# కథా మంజరి

పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకట రావు
ప్రచురణ కర్త

**జనవరి 2021 సంచిక**

© Copyright 2020 - Editorial Board Kathamanjari


కథ



# ఇదీ వరస


| సంఖ్య | విషయం | | పేజీ సంఖ్య |
|---|---|---|---|
| I | మా జట్టు | | i |
| II | కృతజ్ఞతలు | | ii |
| III | కథా కీయం | | iii |
| IV | ఈ నెల విశిష్ట అతిథి | | iv |
| V | కథా మార్గదర్శి | | vi |
| | **కథలు** | | |
| సంఖ్య | కథ పేరు | రచన | పేజీ సంఖ్య |
| 1. | ఇది అబద్ధం కాదు | పాలెపు బుచ్చిరాజు | 1 |
| 2. | మందాకిని | ఎమ్ ఆర్ వి సత్యనారాయణ మూర్తి | 7 |
| 3. | ఎంత మంచివాడవయ్యా | గోవిందు మాధవ రావు | 13 |
| 4. | ఈ బండల మాటున | పోతుబరి వెంకట రమణ | 18 |
| 5. | మారిన మనిషి | సుసర్ల సర్వేశ్వర శాస్త్రి | 25 |
| 6. | దైవం మానుష రూపేణ | రాజేశ్వరి కనకగిరి | 29 |
| 7. | తప్పటడుగు | సత్యశ్రీ | 34 |
| 8. | ఆ'మరణం' | గొర్తి వాణి శ్రీనివాస్ | 41 |
| 9. | కొత్త చిగురు | చివుకుల లక్ష్మీ దేవి | 45 |
| | | | |
| | | | |
| VI | వినదగునెవ్వరు చెప్పిన | | viii |

# ఇంకా మా జట్టు



సాంకేతిక సహకారం

AgradootWeb
Thought. Design. Commitment.

బొమ్మలు

శ్రీ కోయిలాడ రామ్మోహన రావు

# కృతజ్ఞతలు

## SPONSORS

## ఈ సంచికకు ఆర్థిక సహకారం

## OF THE ISSUE

శ్రీ వరహాభట్ల నాగేశ్వర శర్మ గారు

శ్రీమతి పద్మావతి గారు





# “కథా” కీయం



"నా కథ అందరికి నచ్చాలి" అని అనుకుని ఏ రచయితా కథ రాయడు. కనీసం పదిమందిని కదిలించగలిగితే చాలు.. అని కొంతమంది అనుకోవచ్చు. 'నా కథ అద్భుతం..' అంటూ రచయిత తన కథ మీద మీటింగు పెట్టి డబ్బా కొట్టుకునే పని కూడా చేయలేడు. లేదా 'నా కథ మీకు ఎందుకు నచ్చలేదు..' అంటూ పాఠకులతో వాదనలకు కూడా దిగడు. రచయిత మామూలు మనిషి కంటే ఓ స్థాయి ఎత్తులో ఉండి, తన మనోఫలకంలో దిద్దుకున్న ఆలోచనలని కథారూపంలో ఆవిష్కరిస్తాడు. ఆవిష్కరించే ముందు పలు పలు విధాల ఆలోచిస్తాడు. ఏ రచయితా తప్పుడు పనులను చేయమంటూ కథలు రాయడు. అసలు 'చెడు' రాయడు. సమాజంలో చూసిన 'చెడు' ని రాస్తాడు. భూతద్దం పెట్టి వెతికినా, చెడ్డ రచయితలు ఉండరు.

అసలీ ఉపోద్ఘాతం ఎందుకంటే.. ఈ మధ్య ఓ పెద్దాయన రాసిన కథ మీద విమర్శ వచ్చింది. చివరికి ఆ పెద్దాయననే ముద్దాయి అన్నట్టు, ఆ సదరు విమర్శకులు ఆయన మీద దుమ్మెత్తి పోసి, ఆ కథని తిరిగి రాసి పంపారుట. వెనకటికి ప్రఖ్యాత రచయిత మహీధర రామ్మోహనరావు గారకి ఎద్దైనా కథ నచ్చకపోతే ఆయన తిరిగి తిరిగి తనకు తృప్తి కలిగే వరకు ఆ కథని తిరగ రాసుకుని, తర్వాత చించి పారేసావారుట. కథలో చెడు పాత్ర ఉంటే, అది రచయితే అని, మంచి పాత్ర ఉంటే అది వేరే వారనే భావనలతో కథలు చదివే పాఠకులుండొచ్చు.. కాని ఎంతలా పరకాయ ప్రవేశం చేసి కథ రాసినా, రచయిత మంచినే ఆలోచించి రాస్తాడు. దీనికి నిదర్శనం ఆ పెద్దాయన రాసిన జవాబు. కథ వెనుక గల శతాబ్దాల మానవ జీవనవిధానాన్ని కాచి, వడకట్టి అందించిన వివరణను చదివి, జోహార్లు అర్పించాను ఓ అజ్ఞాతుడిగా! ఒక్క ముక్కలో చెప్పాలంటే.. అనంతమైన జ్ఞాన సంపదతో ఎన్నో 'ఇజాలను', వివరంగా విశదీకరించి, అమ్మా, తల్లీ అంటూ అందించిన ఆ జవాబు.. ఓ అమూల్యమైన గ్రంథమే! ఎనిమిది పదులు దాటిన ఆ మహానుభావుడికి శిరసు వంచి నమస్కారం తెలియచేస్తున్నాను.

ఎందుకంటే.. ఆ ఆర్టికల్ చదివితే, ఓ రచయిత అంటే ఎలా వుండాలో తెలిసింది.

రచయిత అన్నవారు.. రాసే ప్రతీ అక్షరాన్ని సమర్థించుకొనే శక్తి సంపాదించాలి. ఏ విషయం మీద రాసినా, వాటి వెనుక విషయ పరిశోధనతో పాటు, సమర్థించుకునే జ్ఞాన సంపదని ఉంచుకోవాలి. విమర్శలను సహేతుకంగా ఎదుర్కొనే సత్తా సమకూర్చుకోవాలి. ఇవన్నీ.. పుస్తక పఠనంతో పాటు, అన్నీ కోణాలలో ఆలోచించగలిగినప్పుడు అలవడతాయి.

అప్పుడు.. తన రచనలకి తానే "రాజు" అవుతాడు.

***0***

## ఈ నెల విశిష్ట అతిథి



# శ్రీ డా. మెడికో శ్యామ్

"డాక్టరు అవ్వలసిన వాడ్ని యాక్టరు అయ్యాను!" అనే డైలాగులు సినిమా నటుల నోటి నుంచి వినేవాళ్ళం, వింటున్నాం కూడా. 'అంటే డాక్టరు చదవంటే అంత సులువా?' అని నాటోటి వాళ్ళు ముక్కు మీద వేలేసుకుని ఓ నిట్టూర్పు విడిచి 'నెక్స్ట్ లైఫ్ బెటర్ లక్' అని సానుభూతి చూపడం మినహా ఏం చేయలేం. అలా కాకుండా కష్టపడి డాక్టరు చదువు చదివి, రోజుకి పదిహేను గంటలు రోగులు, రోగాల మధ్య నిబద్ధతతో వృత్తికి న్యాయం చేస్తూ, మరో వైపు సాహితీ వైద్యాన్ని ప్రవృత్తిగా, ఆనందంగా దత్తత చేసుకున్న తెలుగు రచయితలు పాత తరాలలో కనిపించారు. అది పాఠకుల అదృష్టం!! మొన్నటి తరంలో అలాంటి కథా వైద్యులలో కొమ్మూరి వేణుగోపాలరావు, తంటు, వివేకనందమూర్తి, పరుచూరి రాజారాం, నోమిరెడ్డి జయప్రద, ప్రయాగ మురళి మోహనకృష్ణ వంటివారు ఉండేవారు. నిన్నటి తరంలో సంఖ్య బాగా తగ్గింది. నేటి తరంలో ఇద్దరు ముగ్గురు కనబడుతున్నా, మరి రేపటి తరంలో...?ఈ మూడు తరాల పాఠకులకు చిరపరిచితుడు, నిన్నటి తరానికి చెందినవాడు, నేటి మన విశిష్ట అతిథి డా. చిర్రావూరి శ్యామ్. ఈ పేరు వైద్య ప్రపంచానికి. సాహితీ ప్రపంచానికి మాత్రం మెడికోశ్యామ్.

పువ్వు పుట్టగానే పరిమళించినట్టు, శ్యామ్ చిన్నప్పుడే ఓ కవిత రాస్తే, వాళ్ళమ్మగారు దాన్ని చాగంటి సోమయాజులు (చాసో) గారికి చూపించి, ఎలా వుందో చెప్పమన్నారుట. అది చదివి, 'వీడు పెద్దవాడు అవుతాడని' ఆయన కితాబు ఇచ్చారుట. దానికి తోడు తండ్రి సర్వేశ్వర శాస్త్రి గారు కూడా రచయిత. ఇంటినిండా పుస్తకాలు ఉండేవి. శ్యామ్ ఆసక్తి చూసి, 'రచనలు చేసేవారు ఎక్కువ పుస్తకాలు చదివితే, బాగా రాయగలరు' అని ఆయన చెప్పేవారు. తండ్రి అభిప్రాయాన్ని వ్యతిరేకించినా, కనబడిన ప్రతీ కాగితాన్నీ చదివే అలవాటు శ్యామ్ కి ఎలాగో అబ్బేసింది.

కవితలు రాస్తున్న రోజులలో, 'మెడికో ప్రేమగీతం' అనే కవిత ఓ పత్రికలో వేస్తూ, రచన 'మెడికో శ్యామ్' అని రాసారు. అక్కడ నుంచి ఆ పేరు ఖరారు అయిపోయింది. ఆ రోజుల్లో, ఓ సబ్ ఎడిటర్ సలహా మేరకు మెడికోశ్యామ్ కథలు రాయడం మొదలు పెట్టారు. 'రచన జీవితానికి దగ్గరగా వుండాలనీ, ఇంతకు ముందు ఎవరూ రాయని పద్ధతిలో రాయాలనీ, సంభాషణలు కూడా ప్రత్యేకంగా ఉండాలనీ, జీవితాల్లోంచే కథలు రాస్తే చాలనీ, వీటికి ఏ 'ఇజమూ' అక్కర్లేదనీ..' అనే తన అభిప్రాయాన్ని మెడికోశ్యామ్ కుండ బద్దలు కొట్టినట్టు చెప్తారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లో మంచి పట్టున్న ఈ డాక్టరుగారికి చిన్నప్పట్నించీ పెద్దవాళ్లతో

సాంగత్యం చేయడం ఇష్టం, ఇష్టంతో పాటు అవకాశం కూడా కలిసొచ్చింది. తండ్రితో ఉన్న స్నేహంతో, తెలుగు కథా శ్రేష్ఠులు చాసో గారు, రోణంకి అప్పలస్వామి గారు వీరింటికి తరుచు వస్తూండేవారు. ఆ తర్వాత కాలంలో, కె.ఎన్.వై. పతంజలీ, దాట్ల నారాయణమూర్తి రాజు, అరుణ కిరణ్ లతో పాటు, వైజాగ్ లో మెడిసిన్ చదువుతున్నప్పుడు.. భరాగో, ఆదూరి దంపతులు, ద్విభాష్యం, అవసరాల రామకృష్ణ రావు, సుస్మిత రమణమూర్తి వంటి మేటి రచయితలతో పరిచయాలు ఏర్పడ్డాయి. "రావిశాస్త్రి గారంటే ఇష్టమే... కాని ఆయన్ని ప్రత్యక్షంగా కలవలేక పోవడం అసంతృప్తిగా అనిపించింది. ఓసారి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారిని కలసి, ఆయన కవిత్వం మీద, అభ్యుదయ, విప్లవ కవిత్వాలమీద ప్రశ్నల వర్షం కురిపిస్తే, ఆయన ఆసాంతం సమాధానాలు రాసి ఇచ్చి, నన్ను ప్రోత్సహించడం ఓ మంచి అనుభూతి" అంటారు మెడికోశ్యామ్. విజయనగరంలో ఇంటర్ చదువుతున్న రోజులలోనే ఆరుద్ర, శ్రీశ్రీ లను కలసి వారి సాహిత్యం గురించి మాట్లాడిన సందర్భాలను నెమరువేసుకుంటూ .. 'నేను ఎవరి శిష్యుడ్ని కానేమో గాని, బహుశా ఇంతమంది ఉద్దండుల మాటలు, భుజాలు తట్టడాలు నన్ను బాగా ప్రభావితం చేసి ఉండొచ్చు..' అని కొంచెం గర్వంగా చెప్పుకుంటారు.

'నాకు చిన్నప్పట్నించీ బద్దకం ఎక్కువ.. ఈ విషయం నన్ను తెలిసిన వాళ్లందరికి తెలుసు! బహుశ నా కథలు చిన్నవిగానే ఉంటాయనడానికి ఇదే కారణం అని అనుకుంటాను. కాని చిన్న కథలో పెద్ద విషయం రాయలనే సిద్దాంతంతో రాసాను!' అని ఆనందంగా చెప్పే మెడికోశ్యామ్ కథాసంకలనం "శ్యామ్ యానా" లోని కథలన్నీ చిన్నవైనా, పెద్ద కరెంటు షాకు కొట్టిస్తాయి. మరో రెండు సంకలనాలు "సరాగమాల", "మెడికోశ్యామ్ కథలు' వెలువడ్డాయి. కొన్ని కథలు ఇంగ్లీషు, హిందీ భాషల్లో అనువదించబడ్డాయి. ఐదు దశాబ్దాల రచనా జీవితంలో రాసిలో తక్కువగా ఉన్నా, వాసి ఉన్న కథలను రాసిన మెడికోశ్యామ్, నిత్యం ఏదో ఒక పుస్తకం చదవడం ఇప్పటికీ అలవాటే. ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎం.బి.బి.యస్ చదివి, డిల్లీ ఏ.ఐ.ఐ.ఎం.ఎస్.లో ఎం.డి. చేసి, డాక్టరుగా మూడు దశాబ్దాలు డిల్లీలో పనిచేసారు. తర్వాత అమెరికాలో ఎం.యస్. చేసి ప్రస్తుతం అక్కడే ఉన్నారు.


ఇప్పటికీ కనబడినదల్లా నిశితంగా చదవడం అలవాటు. చదివింది మెదడులో దాచు కోవడం ఇష్టం. దాచుకున్నదాన్ని పదిమందితో పంచుకోవడం మరీ ఇష్టం! స్టెతస్కోప్ పట్టుకున్నా, కలాన్ని కూడా కదిలించగల సత్తా ఉన్నా మెడికోశ్యామ్ .. తిరిగి కథలని ఝుళిపించమని కోరుకుంటూ, ఈ నెల విశిష్ట అతిథిగా విచ్చేసిన మెడికోశ్యామ్ గారికి "కథా మంజరి" ధన్యవాదాలు తెలుపుకుంటోంది!!

ఐదు దశాబ్దాల మెడికో శ్యాంగారి సాహితీ అనుభవాలు ఎన్నెన్నో. అన్నీ అజరామరాలే! వాటిని మథించి, "స్వగతం"గా మలిచి, మనకి అందించినందుకు ఆయనకు శతథా కృతజ్ఞతలు. ఆ నవనీతాన్ని ఈ కింద లింక్ లో ఉంచాం! ఇక మీదే ఆలస్యం.

http://kathamanjari.in/files/SWAGATHAM1.pdf

***0***

# కథా మార్గదర్శి



## శ్రీ కొడవటిగంటి కుటుంబరావు గారు

**తెలుగు కథల చంద'మామ'**

చందమామ కనబడగానే తలపు కొచ్చే మహానుభావుడు శ్రీ కొడవటిగంటి కుటుంబరావు!!

చందమామ మాసపత్రిక అంటే ఇప్పటికీ చిన్నా, పెద్దా అందరికీ ఇష్టమే. ఆ పుస్తకం చూస్తేనే ఒళ్ళు పులకరిస్తుందని అంటారందరూ. సుమారుగా అన్ని భాషల్లో వచ్చే ఈ పత్రికను చదువొచ్చిన ప్రతీ వారు చదివే ఉంటారు. 1947లో ప్రారంభమైన ఈ పత్రిక, డెబ్బై మూడు సంవత్సరాలుగా దిగ్విజయంగా నడుస్తూ, ఆబాలగోపాలాన్నీ అలరిస్తోందంటే కారణం .. ఆనాడు ప్రఖ్యాత తెలుగు రచయిత శ్రీ కొడవటిగంటి కుటుంబరావు గారు ప్రవేశ పెట్టిన ఒరవడి అనే చెప్పుకోవాలి. ఆయన 1952 లో చందమామని అధిరోహించి 1980లో దివంగతులయ్యేవరకూ అక్కడే కొనసాగారు. తెలుగు కథా రచనలో ఓ ప్రత్యేకత సంతరించుకున్న కుటుంబరావు గారి కథలను చదవని తెలుగు సాహితీ అభిమాని, రచయిత ఉండరనడంలో అతిశయోక్తి లేదు. ఆరు దశాబ్దాల రచనా జీవితంలో కథలూ, నవలలూ, వ్యాసాలూ.. అలా అన్నీ కలిపితే వెయ్యికి పైగా ఆయన కలం నుంచి జాలువారాయి.

1908 లో జన్మించిన కుటుంబరావు గారు 13 ఏళ్ల వయసులో సస్పెన్స్ థ్రిల్లర్ నవల రాయడానికి ప్రయత్నించారు. తెలుగు భాష మీద, సాహిత్యం మీద మక్కువ పెంచుకున్న ఆయన, మొదట్లో ఏవో మూడు ఉద్యోగాలు చేసినా, ఇష్టపడక, జర్న లిజంలోకి అడుగు పెట్టి, తర్వాత చందమామలో అడుగుపెట్టారు. నాస్తిక భావాలు పెంపొంది, విప్లవ రచయితల సంఘం ఉపాధ్యక్షుడుగా కూడా పనిచేసారు.

కుటుంబరావు గారి నవల "చదువు" గురించి ప్రముఖులు ప్రశంసిస్తూ, 'అదో ఉద్యమ నవల, రెండు ప్రపంచ యుద్ధాల నడిమి కాలంలో మారుతున్న విలువలకు, మారని మనుషులకు మధ్య ఏర్పడ్డ సంఘర్షణ. ఆనాటి చరిత్రకు అద్దం పట్టింది' అన్నారు. 'కథలు రాయడం చాలా సులువైన పని అని నిరూపించడానికి నేను కథలు రాసాను' అని చెప్పుకున్న కుటుంబరావు గారు మధ్యతరగతి కుటుంబాల జీవితాల మీద అద్భుతమైన కథలు రాసారు. ఆ కథల ద్వారా వారిలో సామాజిక చైతన్యం తీసుకొచ్చారు. ఎంతోమంది రచయితలని కూడా ప్రభావితం చేసే ఆయన కథలలో స్త్రీవాదం కూడా మెండుగా కనబడుతుంది. ఒకటా, రెండా.. వందల్లో రాసిన ఆ కథలు, నవలలు, వ్యాసాలు, గల్పికలు, నాటికలు.. అన్ని అజరామరాలే.

నమ్మిన సిద్ధాంతాలతోనే చివరి వరకు సాహిత్య సేవ చేసిన కుటుంబరావు గారు, తెలుగు సాహితీ ప్రపంచంలో ఎప్పటికీ చిరంజీవే!

చందమామ కనబడినంత కాలం, ఆయన కథలు తెలుగు వాడి మదిలో చల్లగా ప్రకాశిస్తూనే ఉంటాయి!!

***0***

కథా మంజరి

# ఇది అబద్ధం కాదు

(దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ)



పాలెపు బుచ్చిరాజు

పరమేశం గారు జిల్లా పరిషత్తు పాఠశాలలో తెలుగు పండితులు. వృత్తి రీత్యా వారు తెలుగు పండితులు మాత్రమే అయినా, వేదపాండిత్యం వారికి వంశానుగతంగా వస్తున్న విద్య. తెల్లారి లేచి, నిత్యకృత్యాలు తీర్చుకుని, స్నానం చేసి, విభూతి రేఖలు ధరించి, ప్రత్యేకంగా కట్టుకున్న పూజా మందిరంలో సర్వదేవతారాధన చేసి గాని వారు పచ్చి మంచి నీళ్ళు కూడా ముట్టరు. ఆ గదిలో మరెవరికీ ప్రవేశం లేదు.

వారు ఆజానుబాహులు. పచ్చని శరీరం. కాంతులీనే ముఖ వర్చస్సు. పంచె కట్టి పొడుగు చేతుల ఖద్దరు లాల్చీ ధరించి, బడికి బయల్దేరితే, ఎదురు పడిన ప్రతీ మనిషీ నమోవాకాలు పలకవలసిందే! ఊళ్ళో ఏ శుభకార్యం జరిగినా వారి శుభాశీస్సులు ఉండవలసిందే. చూసిన వారికి ఆయన బడిపంతులా, ఆ ఊరికే పంతులా అని సందేహం రాక మానదు. అందరికీ ఆయన అంటే అంత గౌరవం. పండుగలకి, పబ్బాలకి, సామూహిక కార్యకలాపాలకి, పూజా పునస్కారాలకీ ఆయనే ముందుండి యువతని నడిపించాలి.

ఈ సంవత్సరం భాద్రపద మాసంలో వినాయక చవితికి సామూహిక పూజా కార్యక్రమానికి ప్రత్యేకంగా భారీ విగ్రహం తెప్పించి, తొమ్మిది రాత్రులు వేదోక్తంగా పూజలు చేయించారు పరమేశంగారు. భక్తుల నృత్య, గీత, నైవేద్యాలతో ఘనంగా జరిగాయి పూజలు. ఇంక విసర్జన సమయం వచ్చేసరికి ఆ కార్యక్రమం అంతా యువకుల పైనే వదిలేశారు గురువు గారు. కుర్రకారు దానిని ముచ్చటగా జరుపుకుంటారు. తన సమక్షంలో వారు మొహమాట పడవచ్చు. తను లేకపోతే వారికి ఆటవిడుపు. ఇచ్చవచ్చిన రీతిని ఆటలాడుకుంటూ, గంతులు వేస్తూ, విఘ్ననాయకుడిని సాగనంపుతారు.

సుమారు వంద మందికి పైగా చిన్నా పెద్దా యువకులు అందరూ ఆ సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో విగ్రహాన్ని మోసుకుంటూ పాటలు పాడుకుంటూ, ఒకరిపై మరొకరు రంగులు జల్లుకుంటూ ఉత్సాహంతో, ఊరేగింపుగా బయల్దేరారు. ఊరి పొలిమేరలో ఉన్న కోనేటిలో నిమజ్జనం జరపడం ఆచారం.

భక్తులు మైమరచి నృత్యాలు చేస్తూ, పాటలు పాడుకుంటూ, 'గణపతి బప్పామోరియా' అని నినాదాలు చేసుకుంటూ నడుస్తూ ఉండగా, ఊరేగింపు నత్తనడకతో ముందుకు సాగుతోంది. వీధీ వాడా అందరినీ ఆశీర్వదిస్తూ స్వామివారు ఊరేగుతున్నారు. ఇంక సూర్యాస్తమయం కాబోతోంది. పెద్దలు పిల్లల్ని 'త్వరగా కానీయండి చీకటి పడుతోంది' అని హెచ్చరిస్తున్నారు.

ఇంతలో ఎక్కడినుంచో, ఒక రాయి వచ్చి వినాయకుడి విగ్రహానికి తగిలింది. తొండం విరిగి నేలమీద పడింది. ఎక్కడివాళ్ళక్కడ నిశ్చేష్టులై నిలబడి పోయారు. బాజాలు ఆగిపోయాయి. అంతా నిశ్శబ్దం ఆవరించింది. ఎలా జరిగిందిది? ఏమిటీ అపశ్రుతి? "ఎవరు? ఎవరది?" అన్నారెవరో. గప్! చుప్! ఎవరు చేశారిది? కావాలని చేసిందా? కాకతాళీయంగా జరిగిందా? ఏమైతేనేం? ఇదొక దుశ్శకునం. అందరి హృదయాల్లో విషాదం చోటు చేసుకుంది. ఒకరి మొహాలొకరు చూసుకుంటున్నారు. అందరి మనసుల్లోను ఒకటే ప్రశ్న. ఎలా జరిగింది?

ఎవరో కొంటె కుర్రాడు దూరంగా పోతున్న ఒక అవతలి వీధి అబ్బాయి వైపు వ్రేలు పెట్టి చూపిస్తూ, "వాడేమో!" అన్నాడు. అందరూ అటు చూశారు. "వాడే!", వాడే!" మరొకరు వంత పాడారు. "చూస్తారేం? పట్టండి" అన్నాడొకడు. వంద మంది ఒక్కసారిగా ముందుకు ఉరికారు. "పట్టుకోండి .. పట్టుకోండి" అన్న అరుపులు మిన్ను ముట్టాయి. ఈ హడావుడి ఏమిటా అని వెనక్కి తిరిగి చూసిన ఆ అబ్బాయికి ఒక్కటే అర్థం అయింది. వాళ్ళంతా తనని కొట్టడానికే అరుచుకుంటూ వస్తున్నారని. అంతే! ప్రాణ భయంతో అతను పరుగు లంకించుకున్నాడు. మునిమాపు వేళ. అంత మందీ కలిసి సందులు, గొందులు ఎన్ని వెదికినా అతని జాడ తెలియలేదు. ఈలోగా నిమజ్జనానికి సమయం మించి పోతోంది. ఇక ఆ వేట కట్టి పెట్టి నిమజ్జన కార్యక్రమం పూర్తి చేశారు.

అలసిన శరీరాలతో ఇళ్ళకి వచ్చి పడుకున్నారే కాని, ఆ వాడలో చాలా మంది యువకులు ఆ రోజు నిద్రపోలేదు. ఎందుకిలా జరిగింది. ఈ అపశ్రుతిని మింగేసి మాట్లాడక ఊరుకోవడమేనా? ఉడుకు రక్త ప్రవాహంతో బుర్రలు వేడెక్కిపోయాయి. నాలుగైదు రోజులు తర్జన భర్జనలు జరిగాయి. పెద్దల్ని సంప్రదిస్తే మనకెందుకు పొమ్మంటారు. ఉపేక్షిస్తే మనం గాజులు తొడుక్కు కూర్చున్నామని, పిరికి వాళ్ళమని అందరూ అనుకుంటారు. దీనికి తగిన ప్రతీకారం చేయవలసిందే అన్నది యువకుల్లో చాలామందికి వచ్చిన ఊహ.

ఏం చేయాలి? ఎలా చేయాలి? అన్నది నలుగురైదుగురు యువ నాయకులు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు. వారికి కావలసిన వారందరినీ కూడ గట్టుకున్నారు. పథకం అమలు జరిగింది.

ఒకనాటి అర్ధరాత్రి, అవతలి వీధిలో నాలుగైదు ఇళ్ళు నిప్పంటుకుని ధ్వంసం అయిపోయాయి. కొంత ప్రాణ నష్టం కూడా జరిగింది. అదాట్టుగా జరిగిన సంఘటన కాబట్టి పలు కుటుంబాల్లో అమాయక ప్రజల ప్రాణాలు బలై పోయాయి. ఈ వార్త తెల్లారేసరికి ఊరంతా కార్చిచ్చులా వ్యాపించింది. వాడవాడంతా దు:ఖమయం అయింది. కేవలం తమ వాడలోనే అగ్నిప్రమాదానికి కారణం ఏమిటా అని కొందరు పెద్దలు ఆరా తీశారు. జాగ్రత్తగా పరిశీలించి చూస్తే కిరసనాయిలు, పెట్రోలు అంటుకోవడం కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని ఋజువైంది. అంటే? ఇది కేవలం ప్రమాదం కాదా? ఎవరో దుర్మార్గులు కావాలని చేసిన పనా? అన్న ప్రశ్న ఉద్భవించింది. ఎవరైనా ఎందుకలా చేయాలి? ఎంత ఆలోచించినా అంతుపట్టలేదు. ఆఖరికి ఎవరో అన్నారు. వినాయక చవితినాటి వదంతికి, దీనికి ఏమైనా సంబంధం ఉందేమో అని. అంతే! ఒక విషపు చుక్క చాలు పాలు విరిగి పోవడానికి. ఒక చేదు మాట చాలు మనసులు విరిగిపోవడానికి. "అవును" అదే అంటే అదే అన్నాయి పది కంఠాలు.

అది విన్న కొందరిలో ప్రతీకార వాంఛ ప్రబలింది. మనోభావాలు సముద్రపు కెరటాల్లా ఉవ్వెత్తున లేచాయి. ఉడుకు రక్తం సలసల కాగే నీళ్ళలా పొంగి పొర్లింది. "చూస్తారేం? కదలండి." అన్నాడొకడు. కత్తులు, కటార్లు, కర్రలు ఎవరి చేతికందిన ఆయుధాలు వారు పట్టుకుని, అవతలి వాడ మీద పడ్డారు. ఎదురు వచ్చిన వారిని ఆడా, మగా తేడా లేకుండా హింసించారు. హఠాత్తుగా జరిగిన దాడిని ఎదుర్కొనడానికి, ఆత్మ రక్షణ కోసం కొందరు, ప్రతీకార వాంఛతో కొందరు ఆయుధాలతో నిలిచి పోరాడక తప్పలేదు. ఇరు పక్షాల వారికి హోరాహోరి పోరు జరిగింది. ఇటు, అటు, అమాయకులు, స్త్రీ జనం, పల్లా పాపా కూడా బలైపోయారు. పోలీసు సిబ్బంది వచ్చింది. లాఠీచార్జీ జరిగింది. తుపాకులు పేలాయి. కర్ఫ్యూ విధించడంతో అల్లరి సద్దు మణిగింది.

ఈ తరుణంలో నిరాయుధుడైన ఒక పదిహేనేళ్ళ కుర్రాడిని నలుగురైదుగురు యువకులు కత్తులతో వెంట బడి తరిమారు. అతను ప్రాణ భయంతో దిక్కు తెలియకుండా పరుగులు తీస్తూ, సందులు, గొందుల గుండా పోయి, ఈ వాడ నుంచి ఆ వాడలోకి ప్రవేశించాడు. అప్పుడు కానీ అతనికి తెలిసి రాలేదు తను పులి బోనులో చిక్కుకున్నానని. వేటకి చిక్కిన మృగం ఇంకెక్కడికి పోగలదు అనే ధీమాతో ముందుకు సాగారు వేటగాళ్ళు. అతనలాగే పరుగులు పెట్టుతూ వెనుదిరిగి చూడకుండా పోతున్నాడు. పులి తరుముకొస్తూ ఉంటే, జింక పిల్ల అడవిలో ముళ్ళు, మొళ్ళు లెక్కచేస్తుందా? భయంతో కూడిన పరుగు, శక్తిని మించిన

పరుగు, ఆయాసంతో గుండెకాయ చేతిలోకి వచ్చేలా పరుగు. అతను పోయి, పోయి ఇక పరుగులు తీయలేక, ఓ ఇంటి ముందు ఆగిపోయాడు. మూసి ఉన్న తలుపు తట్టాడు.

లోపలి నుంచి ఒక పెద్ద మనిషి తలుపు తెరిచాడు. ఎదురుగా సగం మృత్యువు కబళించి వేసిన ప్రాణి కనిపించింది. అ బాలుడి కళ్ళలో మృత్యుదేవత తాండవమాడుతోంది. ఊళ్ళో ఏం జరుగుతోందో ఆయనకు బాగా తెలుసు. ఒక్క ఉదుటున ఆ బాలుడి చేయి పట్టి లోపలి లాగి, తలుపు గడియ పెట్టాడాయన.

అయిదు నిముషాల్లో మళ్ళి తలుపు మీద దబదబా చప్పుడు. అదెంత ఉధృతంగా ఉందంటే, వెంటనే తెరవకపోతే, తలుపు బ్రద్దలయ్యేటట్టుగా ఉంది. ఆయన ఇలా తలుపు తెరిచారో లేదో, యమకింకరుల లాంటి నలుగురు యువకులు కత్తులు, కర్రలతో లోపలికి దూసుకొచ్చారు.
"ఏడీ? వాడు?" అని అడిగారాయన్ను.
"ఎవరు?"
"వాడే పరుగెత్తుకొచ్చి ఈ ఇంట్లో ప్రవేశించాడు. మేము చూస్తూనే ఉన్నాం."
"మీ చూపు మిమ్మల్ని మోసగించింది. ఇక్కడికెవరూ రాలేదు. నేను పూజలో ఉన్నాను. మీరు నన్ను అనవసరంగా ఇబ్బంది పెడుతున్నారు"
"లేదు. మేము చూశాము."
"నా మాట నమ్మండి. లేదా సోదా చేసుకోండి. నేనిక్కడే నిలబడతాను"
అంతా కలిసి ఇంట్లో నాలుగు మూలలా గాలించి వచ్చారు. ఏమీ ఆచూకి దొరక లేదు.
"క్షమించండి మాస్టారూ! మేమే పొరబడ్డాము. వాడు ఉన్నట్టుండి మాయమైతే లోపలికి చొరబడ్డాడని అనుమానించాము"
"మీ తప్పు లేదు. సందేహ నివృత్తి చేసుకోవడం మీ ధర్మం"
మాస్టారు పరమ నిష్ఠాగరిష్టుడు. అవతలి వాడ మనిషి నీడ కూడా ఇటు పడితే ప్రాయశ్చిత్తం చేసుకునే మనిషి. ఆయన్ని అనుమానించడం మనదే తప్పు అని సంతృప్తి పడ్డారు వారు. తలలు వంచుకుని అంతా నిష్క్రమించారు. వారి వెనకనే తలుపు గడియ పడింది.

ప్రభుత్వం రంగంలోకి దిగడంతో పది రోజుల్లో పరిస్థితి సామాన్యం అయింది. కక్షలు, కావేషాలు క్షణికాలు. మనిషిని ఉద్రేకానికి గురి చేస్తాయి. అనుమానం అనే చిన్న నిప్పురవ్వ అగ్నిగోళమై మనిషిలో మంచిని కాల్చి పారేస్తుంది. అది ఆరిపోయాక అంతా మామూలుగానే ఉంటుంది.

కాలం ప్రశాంతంగా సాగుతోంది. ఎవరి వ్యవసాయం వారు చేసుకుంటున్నారు. ఎవరి వ్యాపారం వారు చూసుకుంటున్నారు. ప్రయాణాలు సాగుతున్నాయి. బడి నడుస్తోంది. ఆ రోజు మరణ ముఖం నుంచి తప్పించుకున్న బాలుడు స్నేహితులతో చెట్టా పట్టాలేసుకుని బడికి వెళ్లి వస్తున్నాడు.

ఎన్ని మరిచినా ఆనాడు పరమేశం మాస్టారి దగ్గర విఫలమైన సంఘటన మాత్రం ఆ నలుగురూ మరిచిపోలేకపోతున్నారు. ఒకనాడు వారంతా కలిసి పంతులుగారిని నిలదీశారు.

"మాస్టారూ! మీరు అబద్ధం చెప్పారు. మమ్మల్ని మోసం చేశారు"

"లేదు. నేను అబద్ధం చెప్పలేదు. మిమ్మల్ని మోసం చేయడం నా అభిమతం కాదు"

"మరి ఆ అబ్బాయి ఈ నాడు నిర్భయంగా తిరుగుతున్నాడు. దీనికి మీరేం చెప్పుతారు?"

"ఆ నాడు నా ఎదుట నిలబడిన వాడు అప్పుడప్పుడే మారాకు వేస్తున్న మామిడి మొక్క లాంటి వాడు. అతని కళ్ళలో మృత్యువు స్పష్టంగా కనిపిస్తోంది. పెనుగాలికి గజ గజా వణికిపోయే ప్రాణికి ఆసరా ఇచ్చి ఆదుకోవడం మానవ ధర్మం. అతనికి ముందు ముందు ఎంతో భవిష్యత్తు ఉంది. బడిలో పదోక్లాసుకి మీ అందరికీ చెప్పే పాఠాలే అతనికీ చెప్పుతున్నాను. తెలివైన వాడని తెలుసు. రేపు అతను ఎదిగి, భారత దేశపు సరిహద్దుల్ని కాపాడే సైనికుడు కావచ్చు. ప్రజా నాయకుడై దేశ పురోగతికి దోహదం చేయవచ్చు. ఒక శాస్త్రవేత్తగా మానవాళికి ఉపయోగపడే గొప్ప ఆవిష్కరణ చేయవచ్చును. దానిని మొక్కలోనే త్రుంచి వేయడం అమానుషం. అదే జరిగితే ఆ పాపానికి నిష్కృతి లేదు. నిష్కారణంగా ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకునే హక్కు ఎవరికీ లేదు. ఎవరి నమ్మకాల మీద వారికి అభిమానం ఉండవచ్చు. ఉండాలి కూడా. కాని దురభిమానం కూడదు. అందుకు నేనలా చేయవలసి వచ్చింది"

"కాని, మీరు మాకు నిజం చెప్పి ఉండవలసింది. మాకు చీవాట్లు పెట్టి వెనక్కి పంపి ఉండవలసింది. దానికి బదులు అబద్ధం చెప్పి పంపారు. మీరంటే మాకు గౌరవం పోయింది"

"మీ ఊహ సరైనదే! కాని ఆ రోజు మీలో నేను మానవుల్ని కాదు దానవుల్ని చూశాను. తర్కానికి లొంగే అవకాశం లేదు. పైగా నా మీద ప్రహారం జరిగే అవకాశాలు కూడా ఉన్నాయి. ఆవేశంలో మనిషి వివేకాన్ని కోల్పోతాడు"

"నిజంగానా మాస్టారూ?"

"పోతే, మీరు పదే పదే అబద్ధం గురించి చెప్పుతున్నారు. ఆ విషయంలో నాకున్న నిర్దిష్టమైన అభిప్రాయం చెప్పుతాను. వినండి!

వేదకాలం నాటి మాట వేరు. అప్పుడు "సత్యం వద. ధర్మం చర" అని శాసించాయి వేదాలు. దానికి తిరుగు లేదు. కాల గమనంలో వచ్చిన మార్పులకి అనుగుణంగా దానిలో కొన్ని మినహాయింపులు వచ్చాయి. నేటి ప్రపంచ పరిభాషలో అబద్ధం అనేది మూడు రకాలు. ఒకటి సాధారణంగా లోకులు స్వార్థం కోసం,

స్వప్రయోజనాల కోసం, పూర్వాపరాలు ఆలోచించకుండా అబద్ధం చెప్పడం. మామూలుగా మనం అబద్ధం అంటే అర్థం చేసుకునేది. ఆచరణీయం కాదు. ఇది అధమం.
రెండోది. ఆపద్ధర్మంగా ఏదో ప్రమాదం నుంచి తప్పించుకోవడానికో, కష్టం రాకుండా కాపాడుకోవడానికో అబద్ధం చెప్పడం. 'అశ్వత్థామ హత:, కుంజర:' ఈ కోవకి చెందినది. ఇది మధ్యమం. "వారిజాక్షులందు, వైవాహికములందు, ప్రాణ విత్త మాన భంగమందు... బొంకవచ్చు నఘముపొందదధిప!" అన్నాడు దీనినే ఒక కవి.
ఇక మూడోదీ, ఆఖరిదీను. మానవత్వంతో ఎదుటి వాడిని రక్షించడం కోసం అబద్ధం చెప్పడం. ఆపదలో ఉన్న వాడిని ఆదుకోవడం. ఇది ఉత్తమం. మీరు దీనిని అబద్ధం అనొచ్చు కాని ఇది అబద్ధాల కోవకి చెందదు. మరొక విషయం గుర్తుంచుకోండి. కక్షలు, కార్పణ్యాలు, వైషమ్యాలు తాటాకు మంటల లాంటివి. క్షణంలో ప్రజ్వరిల్లి చల్లారిపోతాయి. కాని అవి సృష్టించే వినాశం మాత్రం శాశ్వతమైనది. బాధ్యతగల భావి పౌరులుగా మీరీ విషయాన్ని ఎంత త్వరగా గుర్తించగలిగితే దేశానికి అంత మంచిది. ఇంకా ఏమైనా సందేహాలున్నాయా?"

"లేవు మాస్టారూ! తెలిసింది. కాని ఒక్క అనుమానం పీడిస్తోంది. జరిగిందేదో జరిగి పోయింది. ఆ రోజు మేము ఇల్లంతా గాలించాము. జల్లెడ పట్టాం. ఎక్కడా వాడి జాడ లేదు. ఎక్కడ దాచారు?"
"నాచేత మరో అబద్ధం చెప్పించాలని చూస్తున్నారా?"

***0***

# మందాకిని

(దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికయిన కథ)



ఎం.ఆర్.వి. సత్యనారాయణ మూర్తి

"స్వామి వారి దర్శనం బాగా జరిగింది. కొండ కిందకు వెళ్ళడానికి ఆటో కోసం చూస్తున్నాను. ఆటో రాగానే బయల్దేరతాను!" శ్రీమతికి చెప్పి ఫోన్ కట్ చేసి జేబులో పెడుతూండగా "ఎక్స్క్యూజ్ మీ" అన్న మాట విని పక్కకు తిరిగాను.

నాకు నాలుగు అడుగుల దూరంలో కూర్చుని ఉన్న ఆవిడ "మీ ఫోన్ ఒకసారి ఇస్తారా? ఒక కాల్ చేసి ఇస్తాను" అంటూ అడిగింది

నా సెల్ ఫోన్ ఆవిడకిచ్చాను. ఒక నెంబర్ కి ఫోన్ చేసింది. "ఆ, నేనే. మందాకినిని. డ్రైవర్ కనిపించాడా? ఇంకా లేదా? సరే. ఎండలో తిరగకండి. నేను దేవస్థానం సత్రం దగ్గర ఉన్నాను. ఇక్కడకు రండి." అని ఫోన్ కట్ చేసి నా చేతికిచ్చి "థాంక్సండీ" అంది ఆవిడ.

సుమారు నలభై ఐదు ఏళ్ళు ఉండవచ్చు. తెల్లటి దుస్తులు ధరించింది. బంగారు రంగు మేని ఛాయతో చాలా అందంగా ఉంది.

"మీరు ఎక్కడ నుంచి వచ్చారు?" అడిగింది ఆవిడ.

"మాది శివపురం. పశ్చిమ గోదావరి జిల్లా. తునిలో బంధువులు ఉన్నారు. నిన్ననే అక్కడికి వచ్చాం. మీది ఏ ఊరు?" ఆవిడ్ని అడిగాను.

"మాది ముంబై!" నవ్వుతూ చెప్పింది ఆవిడ.

"మీరు తెలుగు వారిలాగే ఉన్నారు. మీ అసలు ఊరు ఏది?" ఆసక్తిగా అడిగాను.

మరో మందస్మిత కుసుమం ఆమె పెదాలమీద విరిసింది.

"నా పుట్టిల్లు అమలాపురం. మా వారిది పిఠాపురం. ప్రస్తుతం ఇక్కడ ఎవరూ లేరు. అందరూ బెంగుళూరు, హైదరాబాద్లలో సెటిలయ్యారు. అన్నవరం రావాలని పదేళ్ల నుంచి అనుకుంటున్నా. ఇప్పటికి కుదిరింది!" అని నా గురించి అడిగింది.

తహాశీల్దారుగా పని చేసి గతేడాది రిటైరయ్యానని చెప్పాను.

రెండు నిముషాలు గడిచాకా తెల్లగా పొడుగ్గా ఉన్నాయన వచ్చి ఆమె పక్కనే కూర్చున్నారు. కొద్ది సేపటికి ఆయన ఫోన్ మోగింది. "గోపురం ఎదురుగా సత్రం దగ్గర ఉన్నాం. నువ్వు కారు తీసుకొచ్చేయ్" అన్నాడు అయన.

కొద్ది సమయానికి కారు వచ్చింది. భార్యాభర్తలు ఇద్దరూ లేచి కారు వద్దకు వెళ్ళారు. ముందుగా ఆయన కారెక్కారు. తర్వాత ఆవిడ కారు ఎక్కుతూ నాకేసి తిరిగి వీడ్కోలు చెబుతూ చెయ్యూపింది. నేనూ చెయ్యూపాను. ఆవిడ కారు ఎక్కగానే కారు బయల్దేరింది.

ఎందుకో నా ఆత్మీయులు ఎవరో దూరంగా వెళుతున్న భావన కలిగింది. కొద్ది సమయంలోనే అన్నవరం కొండ కిందకు వెళ్ళే ఆటో వచ్చింది. నేను ఆటో ఎక్కి కిందకు రాగానే, తుని వెళ్ళే బస్సు రెడీగా ఉంది. వెంటనే బస్సు ఎక్కి అరగంటలో తుని చేరుకున్నాను.

మర్నాడు బయల్దేరి నేనూ, రాజేశ్వరి శివపురం వచ్చేసాం.

***

ఒక వారం రోజుల తర్వాత నేనూ, సుబ్బారావు గారు నగరేశ్వర స్వామి గుడి ప్రాంగణంలో సిమెంటు బెంచీ మీద కూర్చుని ఉండగా ఫోన్ మోగింది.

"హలో" అన్నాను.

"నమస్కారమండి. సదాశివం గారేనా?" ఓ స్త్రీ కంఠం ప్రశ్నించింది.

"ఆ. సదాశివాన్నే మాట్లాడుతున్నాను. మీరు?"

"నేనండి. మందాకినిని. ముంబయ్ నుండి మాట్లాడుతున్నాను. వారం రోజుల క్రితం అన్నవరం కొండమీద మీతో మాట్లాడాను. గుర్తుందా సార్?"

రెండు క్షణాల్లో ఆవిడ రూపం నా మనో యవనికపై ఆవిష్కృతమయ్యింది. నా మనసు నిండా సంతోషం పరుచుకుంది.

"ఆ.. ఆ.. గుర్తుకువచ్చింది మేడమ్. మీరూ, మీ శ్రీవారు ఎలా ఉన్నారు?"

"మేము బాగానే ఉన్నాం సార్. మీరు ఇంకా తునిలోనే ఉన్నారా? లేక మీ ఊరు వచ్చేసారా?" అడిగింది మందాకిని.

"మా ఊరు వచ్చేసాం. ప్రస్తుతం మా ఊరి గుడి ప్రాంగణంలో మిత్రులతో కలిసి ఉన్నాను. నాలాగే రిటైరైన కొంతమంది మిత్రులం రోజూ సాయంత్రం గుడిలో కలుసుకుంటాం."

"సత్సంగమన్న మాట. బాగుంది సార్. ఉంటాను!" అని ఫోన్ కట్ చేసింది మందాకిని.

నా పక్కనే కూర్చున్న రిటైర్డ్ హెడ్ మాస్టర్ సుబ్బారావు గారు అడిగారు 'ఫోన్ ఎవరని?'

ఆయనా, నేనూ చాలా ఆత్మీయంగా ఉంటాం. ఇద్దరం కలిసి రెండు సార్లు కాశీ యాత్ర చేసి వచ్చాం. నేను అన్నవరంలో జరిగిన సంఘటన చెప్పాను.

"మాష్టారూ, నా నెంబరు మందాకినికి ఎలా తెలిసింది?"
"అన్నవరంలో మీ ఫోన్లో వాళ్ళ ఆయనతో మాట్లాడిందన్నారుగా. వాళ్ళ ఆయన ఫోన్ నుంచి మీ నెంబరు చూసి నోట్ చేసుకుని ఉంటుంది!" సింపుల్ గా అన్నారు సుబ్బారావు గారు.
నిజమే. ఇంత చిన్న విషయం నేను గమనించలేక పోయాను.
'మీరు తహసీల్దారుగా చేసినా జి.కె. తక్కువ' అని మా ఆవిడ రాజేశ్వరి అనే మాట గుర్తుకు వచ్చి నవ్వుకున్నాను.

ఒక వారం తర్వాత మందాకిని ఫోన్ చేసింది.
"బాగున్నారా సదాశివం గారూ? మీరు నాటికలు రాసానని చెప్పారు. మా పిల్లల కోసం జాతీయ సమైక్యత ప్రతిబింబించే విధంగా ఒక నాటిక రాసి పంపగలరా? ఇక్కడి తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఆ నాటిక ప్రదర్శిస్తాం."
"అలాగే మేడమ్. వారం, పదిరోజులలో నాటిక రాసి పంపుతాను."
"ధన్యవాదాలండి. ఉంటాను."
ఒక వారం రోజులు శ్రమించి శాస్త్రీయ సంగీతం నేపథ్యంలో జాతీయ సమైక్యతను ప్రబోధించే నాటిక రాసాను. సమీర్, ఇసాక్, భరత్ అనే ముగ్గురు యువకులు శాస్త్రిగారి వద్ద సంగీతం నేర్చుకుంటూ ఉంటారు. స్థానిక రాజకీయ నాయకుడి కుమార్తె ఝాన్సీ కూడా సంగీతం పాఠాలకు వస్తూ ఉంటుంది. సమీర్, ఇసాక్ బంధువులకు తమ పిల్లలు శాస్త్రి గారి వద్ద సంగీతం నేర్చుకోవడం ఇష్టం ఉండదు. ఎంత నచ్చ చెప్పినా సమీర్, ఇసాక్  వారి మాట వినరు. ఒకరోజు ఒక యువకుడు మోటార్ సైకిల్ పై వెళుతూ, పొరపాటున ఒక యువతిని గాయపరుస్తాడు. వెంటనే ఆమెకు వైద్యం చేయించి, క్షమాపణలు చెప్పి ఆమెను ఇంటి వద్ద దింపి వస్తాడు. వారిద్దరూ రెండు మతాలకు చెందినవారు.
నగరం శాంతిగా ఉండడం ఇష్టం లేని రాజకీయ నాయకుడు తన అనుచరుల ద్వారా ఇరువర్గాల వారిని రెచ్చగొట్టి పరస్పరం దాడులు చేసుకునేటట్లు చేస్తాడు. పనిలో పనిగా శాస్త్రి గారి ఇంటిమీద దాడి చేయిస్తాడు. శాస్త్రిగారు ఊరు వెళ్ళడంతో ఇంటికి కాపలాగా ఉన్న సమీర్ గాయపడతాడు. ఝాన్సీ, సమీర్ కి రక్తదానం చేసి అతన్ని కాపాడుతుంది. మర్నాడు శాస్త్రిగారి శిష్యులు అందరూ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి దాడులలో గాయపడిన వారికి రక్తదానం చేస్తారు. తన తండ్రే ఈ దాడులకు మూలం అని తెలుసుకున్న ఝాన్సీ, ఇల్లు వదిలి శాస్త్రి గారింటికి వస్తుంది. ఝాన్సీ తండ్రి వచ్చి బతిమాలితే, మీరు చేసిన తప్పు ఒప్పుకుంటేనే ఇంటికి వస్తానంటుంది. కొన్ని రోజుల తర్వాత ఝాన్సీ తండ్రి, తన ఆస్తిని 'భారతీ సేవా సదన్'కి రాసేసి, తన తప్పులన్నీ అంగీకరించి జైలుకి వెళతాడు. మనమంతా ఒకే గాలి పీలుస్తున్నాం, ఒకే నీరు తాగుతున్నాం. అందరం ఒకే కుటుంబంలా కలిసి మెలిసి ఉండాలన్న శాస్త్రి గారి మాటలు ఝాన్సీ తండ్రిలో పరివర్తన తెస్తాయి. నాటికకు 'సమైక్య భారత్' అని పేరు పెట్టాను.

నాటిక స్క్రిప్ట్ ని కొరియర్లో మందాకినికి పంపాను. ఆమె కూడా నాటిక చదివి బాగుందని మెచ్చుకుంది. నెల రోజులు పిల్లల చేత రిహార్సల్ చేయించి ముంబైలోని రెండు హైస్కూళ్ళలో సమైక్య భారత్ ప్రదర్శించామని చెప్పింది మందాకిని. రెండు చోట్లా మంచి ప్రశంసలు అందుకున్నామని తెలిపింది.

విశాఖపట్నంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసే సమయంలో ఆకాశవాణికి నాటికలు రాసేవాడిని. ఉద్యోగంలో చేరాకా నాటికలు రాయడం కుదరలేదు. ఇన్నాళ్ళకు మళ్ళీ మందాకిని కోరిక మేరకు నాటిక రాయడం, ఆ నాటిక ముంబైలో ప్రదర్శింపబడటం నాకు చాలా సంతోషం కలిగించింది.

నాలుగు నెలల తర్వాత ఓ ఆదివారం ఉదయం మందాకిని ఫోన్ చేసింది. వచ్చే నెల రెండో ఆదివారం ముంబైలోని కల్చరల్ అకాడమీ హాలులో 'సమైక్య భారత్ ' నాటిక ప్రదర్శన ఉందని, సాంస్కృతిక శాఖ మంత్రి, పలువురు ప్రముఖులు వస్తున్నారని, మీరు కూడా వస్తే బాగుంటుందని చెప్పింది.
రాజేశ్వరితో ఆలోచించి, 'ముంబై 'వస్తానని చెప్పాను. ఒక అరగంట తర్వాత నా ఫోన్ కి మెసేజ్ వచ్చింది. ముంబైకి రాను, పోనూ టికెట్లు బుక్ అయ్యాయని. మందాకినికి థాంక్స్ చెప్పాను.

***

శివపురం నుంచి తాడేపల్లిగూడెం వచ్చి కోణార్క ఎక్స్ప్రెస్ ఎక్కాను. ముంబైలో స్టేషన్కి వచ్చి, మందాకిని కారులో వాళ్ళ ఇంటికి తీసుకు వెళ్ళింది. మూడు పడక గదులు, పెద్ద హాలు, వంటగది అన్నీ విశాలంగా ఉన్నాయి. భర్తకి నన్ను పరిచయం చేసింది. పరస్పర నమస్కారాలయ్యాయి. ఆయనకు ఫోన్ రావడంతో లోపలి గదిలోకి వెళ్ళారు.
"మావారు ఓ ప్రైవేట్ బ్యాంక్ కి కన్సల్టెంటు. ఎప్పుడూ బిజీగా ఉంటారు." నవ్వుతూ అంది మందాకిని.
సాయంత్రం కల్చరల్ అకాడమీ హాలుకి వెళ్ళాను మందాకినితో కలిసి. నన్ను వి. ఐ. పి. వరుసలో కూర్చోబెట్టి స్టేజీ మీద ఏర్పాట్లు చూడటానికి వెళ్ళింది మందాకిని. రెండు నిముషాలు గడిచాకా ఒకాయన వచ్చి నా పక్కనే కూర్చున్నారు.
"నమస్కారం సార్. మందాకిని మేడమ్ పంపారు మీకు కంపెనీ ఇమ్మని." అన్నాడాయన తెలుగులో.
"మీరు తెలుగు వారేనా? ఏ ప్రాంతం వారు? " ఆసక్తిగా అడిగాను.
"మాది అమలాపురం. మందాకిని మేడమ్ వారి భర్తతో చెప్పి నాకు బ్యాంకులో ఉద్యోగం వేయించారు. ఎంతో మందికి సాయం చేసారు. చాలా మంచి మనిషి." అన్నాడు ఆయన కళ్లల్లో కృతజ్ఞతా భావాలు కదలాడుతుండగా.
కొద్ది సమయానికే మహారాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి, ఇతర ప్రముఖులు విచ్చేసారు. రెండు దేశభక్తి గీతాలు పాడిన తర్వాత, సమైక్య భారత్ నాటిక ప్రదర్శిస్తారని ప్రకటించారు. రచయితగా నా పేరు చెప్పినపుడు ఆనందంతో నా హృదయం ఉప్పొంగింది. దర్శకత్వం మందాకిని అని ప్రకటించగానే హాలంతా

చప్పట్లతో మారు మోగింది. నాటిక సారాంశాన్ని మరాఠి, హిందీ, ఇంగ్లీషు భాషల్లో వివరించారు. నాటిక తెలుగులోనే ప్రదర్శించారు. ప్రతి ఫ్రేమ్ లో మందాకిని ప్రతిభ కనపడింది. పిల్లలందరూ చాలా బాగా నటించారు. నాటిక ప్రదర్శన పూర్తి కాగానే సాంస్కృతిక శాఖ మంత్రి వేదిక మీదకు వచ్చి నాటికలో పాల్గొన్న పిల్లలందరినీ అభినందించారు.

"మందాకిని మేడమ్ గురించి నాతో చాలా మంది చెప్పారు. వీధి బాలల్ని సమీకరించి వారికి విద్య బుద్ధులు చెప్పించడమే కాకుండా వారికోసం ఒక హాస్టల్ నిర్వహించడం అభినందనీయం. ఉద్యోగాన్ని విడిచి పెట్టి సమాజ సేవకు తన పూర్తి కాలాన్ని వినియోగించడం ముదావహం. నేనూ, నా కుటుంబం బాగుంటే చాలునని కోరుకునే వారు, మందాకిని మేడమ్ ని చూసి సిగ్గుపడాలి. నేను మాత్రమే కాదు, నేను నివసిస్తున్న సమాజంలోని వారు కూడా బాగుండాలని ఆమె తన జీవితం ద్వారా మనకు సందేశాన్ని ఇవ్వడం మనం గమనించాలి. స్వార్థం పెరిగి, దేశభక్తి కొరవడుతున్న ఈ తరుణంలో సమైక్య భారత్ వంటి నాటికలు ఊరూరా ప్రదర్శించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నాటిక రచయిత సదాశివం గారిని కూడా నేను అభినందిస్తున్నాను. మందాకిని మేడమ్ గారికి నాదొక సలహా. ఈ నాటికను హిందీలోకి అనువదింపచేసి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరుతున్నాను." అన్నారు మంత్రి గారు.

ఆ తర్వాత మందాకినిని, నన్నూ మంత్రిగారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమం పూర్తి అయ్యాక మందాకిని, నేనూ ఆమె కారులో ఇంటికి వచ్చాం. భోజనాలయ్యాకా ఆమెని అడిగాను, "వీధి బాలల కోసం సదనం పెట్టాలన్న ఆలోచన మీకెలా వచ్చింది?"

"నేను విశ్వవిద్యాలయానికి స్కూటీమీద వెళ్ళేదాన్ని. దారిలో సరైన బట్టలు లేక, తిండిలేక దీనంగా ఉంటున్న వీధి బాలల్ని చూసినప్పుడు నా హృదయం విలవిలలాడేది. వీళ్ళూ భరతమాత బిడ్డలే కదా! మరి వీరి గురించి ఎవరూ పట్టించుకోరేం? అని బాధ కలిగేది. ఎవరో చేస్తారని ఆలోచించకుండా మనమే ఎందుకు ప్రయత్నించకూడదు? అని అనిపించింది. నా ఆలోచన మా వారికి చెప్పాను. ఆయన సరే అన్నారు. మాకు ఒక్కడే అబ్బాయి. ఢిల్లీలో మల్టీ నేషనల్ కంపెనీలో పని చేస్తున్నాడు. వాడూ అంగీకరించాడు. జాబ్ కి వాలంటరీ రిటైర్మెంట్ ఇచ్చేసాను. రిటైర్మెంట్ బెనిఫిట్సుతో సదనం ప్రారంభించాను. ముందుగా ఇరవైమంది పిల్లలు ఉండేవారు. ప్రస్తుతం నూట ఇరవై మంది ఉన్నారు. మావారి మిత్రులు, మా అబ్బాయి మిత్రులు కొంతవరకు సాయం చేసారు. నా పెన్షన్ డబ్బు మొత్తం సదనం నిర్వహణకు ఖర్చుచేస్తున్నాను. ఏదో నెమ్మదిగా నడుస్తోంది." అంది మందాకిని.

ఆ రాత్రి రకరకాల ఆలోచనలతో నాకు నిద్ర పట్టలేదు.

మర్నాడు ఉదయం మందాకిని అడిగింది, 'ఏదైనా సైట్ సీయింగ్ కి వెళ్తారా?'

నేను తల అడ్డంగా ఊపాను.

"మీరు నిర్వహిస్తున్న సదనం చూడాలని ఉంది. మీరు అనుమతి ఇస్తే." అన్నాను.

"భలేవారే. నేనే తీసుకు వెళ్తాను!" అంది నవ్వుతూ మందాకిని. ఆమె కారులోనే సదనానికి వెళ్ళాం. సదనం మేనేజర్ మమ్మల్ని సాదరంగా ఆహ్వానించారు. ఒక కార్పొరేట్ స్కూల్ హాస్టల్ ఎలా ఉంటుందో అంత శుభ్రంగా, సౌకర్యంగా ఉంది సదనం. ఆఫీసురూంలో సదనం విద్యార్థినీ, విద్యార్థులు జాతీయ పండుగలలో సాధించిన విజయాలకు సంబంధించిన ఫొటోలు ఉన్నాయి. ఎక్కడా మందాకిని ఫోటో కానీ, పేరు కానీ కనపడలేదు. ఆశ్చర్యపోయాను నేను. ఆవిషయమే ఆమెతో అన్నాను. మందాకిని చిరునవ్వు నవ్వింది.
"మనం చేసే పని ఒక పవిత్రమైన యజ్ఞంలా భావించాలి. అంతే కానీ, ప్రచారం కోసం, ఆర్భాటాలకోసం తాపత్రయ పడకూడదు. ఈ సదనంలోని వారందరూ విద్యావంతులై, చక్కని ఉద్యోగాలు సాధించి, ఆదర్శ పౌరులుగా ఎదగాలని నా ఆకాంక్ష." స్థిరంగా చెప్పింది మందాకిని.
సదనంలోని పిల్లలందరూ ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండడం గమనించాను నేను. డైనింగు హాలులో చిన్న బోర్డు మీద 'ఈరోజు భోజన దాత 'అని ఉంది. కానీ పేరు రాయలేదు. మందాకిని వైపు చూసాను
"నా స్నేహితులు, మావారి స్నేహితులు వారి పుట్టిన రోజులకు, పెళ్ళి రోజులకు సదనంలోని పిల్లలకు భోజనం స్పాన్సర్ చేస్తారు. అప్పుడు వారి పేరు బోర్డు మీద రాస్తాము." నవ్వుతూ చెప్పింది ఆమె.
ఆ బోర్డు మీద ఏమి రాసిలేదు. ఆ విషయమే అడిగాను.
“మనం చేసే పనులకు చాటింపు అక్కర్లేదుగా మాష్టారు!” అంటూ నవ్వుతూ చూసింది.
ఆ మాటలు అర్థమవగానే నా అరచేతులు అప్రయత్నంగా కలిసాయి.
మందాకిని సాయంత్రం స్టేషన్ కి వచ్చి రైలు కదిలేవరకూ ఉండి చెయ్యూపుతూ నిలబడింది. ఆమె ఆత్మీయతకు నా మనసు. నా కళ్ళల్లో సన్నటి కన్నీటి పొర కదలాడింది. కోచ్ గుమ్మం దగ్గర నిలబడి ఆమె కనిపించే వరకూ చెయ్యూపుతూనే ఉన్నాను. రెండు నిముషాలు గడిచాకా లోపలకు వచ్చి కూర్చున్నాను. ఎ. సి. కోచ్ చల్లగా ఉంది. కానీ ఆలోచనలతో నా తల వేడెక్కిపోతోంది. ఒక మహిళ అనాధలను అక్కున చేర్చుకుని వారి బంగరు భవిష్యత్తు కోసం ఎంత శ్రమిస్తోంది? తమ పిల్లలు మాత్రం పెద్ద ఉద్యోగాలు చేయాలని, డాలర్లు, కోట్లు సంపాదించాలని కోరుకునే తల్లి తండ్రులలా కాకుండా, సమాజంకోసం, దేశం కోసం ఎంత కష్టపడుతోంది? సమాజంలోని కొంతమందైనా మందాకినిలా ఆలోచిస్తే ఈ బాలకార్మికులూ ఉండరు, బాధ్యత, గమ్యం లేకుండా తిరిగే అనాధ యువకులూ ఉండరు!
అర్ధరాత్రి దాటిన తర్వాత గానీ నాకు నిద్రపట్టలేదు.
శివపురం వచ్చాకా మందాకిని రాజేశ్వరి కోసం ఇచ్చిన చీర ప్యాకెట్ రాజేశ్వరి కిచ్చాను. ఆమె చాలా సంతోషించింది.
మర్నాడే బ్యాంకుకి వెళ్ళి, కారు కొనుక్కోవాలని దాచుకున్న పది లక్షలూ ముంబైలో మందాకిని నడుపుతున్న సదనం బ్యాంకు ఖాతాకి ట్రాన్స్ఫర్ చేసాను.

***0***

# ఎంత మంచివాడవయా

(దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ)



## గోవిందు మాధవరావు

"ఒరేయ్! కాంతం! నీకు శుభ వార్తరా!"

స్టాఫ్ రూంలోకి వచ్చి అక్కడే వున్న తన సహోపాధ్యాయుడైన లక్ష్మీకాంతానికి సమీపానికి వస్తూ.. అన్నాడు కోటేశ్వర రావు సంతోషం ముఖంలో ద్యోదకం అవుతుండగా...

అది మండల రెవిన్యూ ఆఫీస్ ఆధ్వర్యంలో ఉన్న మండల పరిషత్ ప్రైమరీ స్కూల్లోని స్టాఫ్ రూమ్. లక్ష్మీకాంతం, కోటేశ్వర రావులు ఎప్పటి నుండో ఆ స్కూల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వాళ్ళ మధ్య ఉద్యోగ రీత్యా ఏర్పడ్డ సంబంధం కన్నా, చిన్నతనం నుంచి వున్న స్నేహవాత్సల్యం ఎంతో విశిష్టమైనది. ఆ బంధం ఎంత విశిష్టమైనదంటే వాళ్ళ దేహాలు వేరైనా, ప్రాణం ఒక్కటన్నట్టు ఉంటారు. ఒకరికి కష్టం వస్తే మరొకరి కళ్ళు చెమరుస్తాయి అంటే అతిశయోక్తి కాదేమో!

కోటేశ్వరరావు స్వతహాగా లక్ష్మీకాంతం కన్నా ఆర్థిక పరంగా మెరుగనిపిస్తే.. లక్ష్మీకాంతం కుటుంబం మాత్రం హ్యాండ్ టు మౌత్.. అన్నటుగా ఉంటుంది.

కోటేశ్వరరావు ఒక్కగాను ఒక్క కొడుకు సిటీలో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తూ, అదే ఆఫీసులో పనిచేస్తున్న అమ్మాయిని ప్రేమించానని చెప్తే, ఏదోలా తన భార్యకు నచ్చచెప్పుకుని, పెద్ద మనసు చేసుకుని వాళ్ళ పెళ్లికి యెర్ర తివాచి పరిచాడు. ఆ కొడుక్కూడా ఈ కాలపు పిల్లలా బిందాస్ లా ఉండే రకం కాకుండా.. బాధ్యత గుర్తెరిగి ప్రతినెలా తన తండ్రికి డబ్బు పంపిస్తూవుంటాడు. అందువల్ల కోటేశ్వరరావు సంసారం నిత్యం మూడు స్వీట్స్ ఆరు సుగంధ పానీయాలుగా సాగిపోతూ ఉంటుంది.

అదే లక్ష్మీకాంతం విషయానికొస్తే అందుకు భిన్నంగా ఉంటుంది. అతని భార్యను చుస్తే పుట్టెడు రోగాలతో ఎప్పుడూ అవస్థ పడుతూ కనిపిస్తుంది. దాని వల్ల ఆమె నెలకయ్యే మందుల ఖర్చులతో ఒక వైపు సతమతమౌతుంటే, పెళ్లీడు వచ్చిన ఇద్దరు ఆడపిల్లలకు డిగ్రీ వరకు చదువులైతే ఎలాగోలా చదివించినా.. వాళ్ళ ఉద్యోగ ప్రయత్నాలు అతనికి పెను భారంగా మారాయి. వీళ్ళు కూడా ఈ కాలపు ఆడపిల్లల్లా భేషజాలకు పోకుండా, పాపం.. ఇంటి పట్టునే బుద్ధిగా ఉన్నా కూడా.. ఉద్యోగ దరఖాస్తు కోసం పెట్టే ఖర్చు

సర్దుబాటు చేసేందుకు, అతనికి నిత్యం ముప్పు తిప్పలు పడుతూ, మూడు చెరువుల నీళ్లు తాగాల్సి వస్తుంది. ఇలాంటి స్థితిలో తనకు, శ్రీకృష్ణ భగవానునిలా కోటేశ్వరరావు తన స్నేహ వాత్సల్యంతో అడపా తడపా ఆదుకుంటుండడంతో, లక్ష్మీకాంతం నిత్యం వ్రాసే జీవిత పరీక్షల్లో కనీసం పాసు మార్కుతోనైనా పాసైపోతుంటాడు. అలాంటి నేపథ్యంలోనిదే ఇప్పుడు కోటేశ్వరరావు చెప్పబోయే శుభవార్త.

"నాకున్న నిత్య కష్టాల నుంచి ఆదుకోడానికి తనకు తీరుబాటు కాకనే, నిన్ను నాకు స్నేహితుడ్ని చెశాడ్రా ఆ దేవుడు! మరి నీలాంటి దేవుడు నా ప్రక్కనుంటే నా కొచ్చే వార్తలు శుభవార్తలు కాక ఇంకేముంటాయి! ఊఁ చెప్పు అదేంటో." అన్నాడు నిర్వేదం గొంతులో ధ్వనిస్తుండగా. ఆ మాటలకు చలించిపోయిన కోటేశ్వరరావు, కుర్చీలో కూర్చున్న లక్ష్మీకాంతం వెనుకగా వెళ్లి అతని భుజాలపై సుతారంగా నొక్కుతూ.. "ఎందుకురా ఇంత దానికే నన్ను దేవుణ్ణి చేసేస్తావు. నీలాంటి మంచి మనుషుల మధ్య నాలుగు రోజులు నన్నూ ఒక మనిషిగా ఉండనీయక!" అన్నాడు బరువెక్కగా హృదయంతో.

ఆ మాటలు విన్న లక్ష్మీకాంతం చట్టుక్కున లేచి.. అది ఆఫీసని కాసేపు మరిచిపోయి అతన్ని గాఢంగా ఆలింగనం చేసుకున్నాడు కళ్ళు చెమరుస్తుండగా. ఆవేళ అక్కడ ఆ స్నేహితులు ఇద్దరే ఉండటం వాళ్ళ భావాతీత తన్మయ ప్రకటనకు ఆటంకం కలగలేదు.

కోటేశ్వరరావు ముందుగా తేరుకుని "అదేరా! ఊర్మిళను చూసి వెళ్లిన ఆ బ్యాంకు అబ్బాయి తండ్రి శంకర్రావు ఫోన్ చేసి, వాళ్ల అబ్బాయికి మనమ్మాయి బహు బాగా నచ్చిందనీ .. చేసుకుంటే తననే చేసుకుంటాననీ.. మంకుపట్టు పట్టి కుర్చున్నాడనీ .. చెప్పాడు. ఇక ఆ పై మాటలు నాలుగు మాట్లాడేసుకుంటే.. సరిపోతుంది." అప్పటి వరకు మైత్రీ వాత్సల్య భావావేశంతో వేడెక్కిన ఆ స్టాఫ్ రూముని చల్లబడుతుండగా అన్నాడు.

ఆ మాటలు లక్ష్మీకాంతం చెవిన పడగానే ఉబ్బితబ్బిబ్బులైయ్యాడు. కోటేశ్వరరావు చేసిన మేలుకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో తెలీని తెలుగు మాస్టరు కన్నీటి పర్యంతమై, వాటితో స్నేహితుని పాదాలు కడిగినంతగా ఆవేశపడ్డాడు.

***

శంకర్రావు, తన భార్యను తీసుకుని పెళ్ళి మాటలు మాట్లాడుకోటానికి లక్ష్మీకాంతం వుండే ఊరుకి రెండు రోజుల్లో రానున్నట్లుగా అతనికి కబురు పెట్టాడు కోటేశ్వరరావు ద్వారా.

పెళ్ళివారు వస్తున్నారంటేనే లక్ష్మీకాంతానికి చెమటలు పట్టాయి. అసలే నెలాఖరు. ఇంకా జీతం కూడా రాలేదు. చేతిలో చిల్లిగవ్వకూడా లేదు. ఆ విషయమే కోటేశ్వర రావుతో అన్నాడు.

కోటేశ్వర రావు అతనికి సర్ది చెప్పి, అన్నీ తాను చూసుకుంటానని, అనవసరంగా ఆదుర్దా పడవద్దని అతనికి ధైర్యం చెప్పాడు.

అన్నట్లుగానే శంకర్రావు భార్యతో సహా లక్ష్మీకాంతం ఇంటికి అనుకున్న సమయానికి వచ్చాడు. పెళ్లి మాటలు ప్రారంభంలో కాస్త వాడి వేడిగా సాగినా, చివరకు పెళ్ళివారు వెల్లడించిన డిమాండ్ల నన్నింటిని

అంగీకరింపక తప్పలేదు లక్ష్మీకాంతానికి. మాటకు ముందు.. మాటకు చివర "మాకేం వద్దు. కేవలం పిల్లను ఇస్తే చాలు" అంటూనే.. సుమారు పది లకారాల ఖర్చుకు ఒప్పించారు. లక్ష్మీకాంతానికి వొళ్ళంతా చెమట పట్టేసింది అసలు పెళ్లి పనులంటూ మొదలెట్టకుండానే! అదే విషయం కోటేశ్వరరావుతో ప్రస్తావించాడు నైరాశ్యం నిండిన స్వరంతో. ఒక సందర్భంలోనైతే ఈ సంబంధమే వద్దని నిర్ణయం కూడా తీసుకున్నాడు. లక్ష్మీకాంతం పరిస్థితి క్షుణ్ణంగా తెలిసినవాడు కాబట్టి కోటేశ్వరరావు అతని ఆవేశాన్ని తప్పు పట్టలేక పోయాడు. కానీ ఇంతకన్నా మంచి సంబంధం మళ్ళీ వస్తుందని కూడా భరోసా ఇవ్వలేక పోయాడు. అథవా.. వచ్చినా వాళ్ళు కూడా ఇలానే మాట్లాడారని గారంటీ ఏమిటి? అదే అన్నాడు కోటేశ్వరరావు లక్ష్మీకాంతాన్ని సర్ది చెప్పే నేపథ్యంలో. "చూడు! కాంతం. ఇది ఎప్పటికైనా తప్పని ఖర్చు. నాకు తెలిసి అబ్బాయి బుద్ధిమంతుడు. బ్యాంక్లో ఉద్యోగమంటే ఇక నువ్వు ముందు ముందు చూసుకోవలసిన పనిలేదు. అమ్మాయి సుఖపడుతుంది. అయినా యెవరన్నార్రా! ఆడపిల్ల అంటే గుండెలమీద భారమనే రోజులు పోయాయన్నది. మనలాంటి వాళ్ళ కుటుంబాల్లో ఇలాంటి వ్యవస్థలు, సంప్రదాయాలు మారనంత వరకు ఈ దేశంలో పెళ్లి ఒక కుహనా వ్యాపారమే! అది ఉన్నవాడికి వేడుక. మనబోటి వారికది పండోరా'స్ బాక్స్ లాంటిది." అంటూ లక్ష్మీకాంతానికి నచ్చచెప్పాడు.

కోటేశ్వరరావు చెప్తున్న విషయం వినే పరిస్థితిలో లేడు లక్ష్మీకాంతం. అతని అంతరంగంలోని ఆలోచనల సుడిగుండం అతన్ని ఊపిరాడనీకుండా చేస్తోంది. వివిధ రకాల ఆలోచనలు తనని కట్టి పడేసి నిర్వీర్యం చేసేస్తుంటే.. వేరే దిక్కు లేక మళ్ళీ కోటేశ్వరరావు చేతులు పట్టుకుని తననే చూస్తూ.. "నువ్వే నన్ను ఒక ఒడ్డుకు పడేయాల్రా .." అని అనాలనుకున్న మనసులోని మాట మనసులో ఉండగానే, కోటేశ్వరరావే స్పందిస్తూ అతని భుజాన్ని గోముగా నిమురుతూ "ఒరేయ్! కాంతం నీకో విన్నపంరా! ఊర్మిళ పెళ్లి చేసే భాగ్యం నాకు దక్కేలా చూడరా! నీకు ఎంతో రుణపడి వుంటాను. నాక్కూడా ఆడపిల్ల లేని లోటు ఇలాగైన తీరుతుంది. ఒప్పుకుని పుణ్యం కట్టుకోరా. నువ్వేమి ఖంగారు పడక, ముందు జరగరాల్సిన పెళ్లి పన్లు చూడు" అంటూ ఎంతో ఆర్ద్రంగా చెప్పి అక్కనుంచి నిష్క్రమించాడు.

***

లక్ష్మీకాంతం కూతురు పెళ్లి ఎంతో ఘనంగా జరిగిందని అతని బంధువర్గమే కాదు. పెళ్ళివారు సహితం అతనికి తమ మెచ్చుకోలు కితాబు ఇచ్చారు.. అదో గిన్నిస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్స్ తో సమానమన్నట్టు. కోటేశ్వరరావు పుణ్యమా... లక్ష్మీకాంతం ఒక పెద్ద గండం నుంచి బయట పడ్డాడు. ఇదే విషయం అతని తోనే పదేపదే ప్రస్తావించాడు. అయితే ఈ విషయం మూడో కంటికి తెలీకుండా వాళ్ళ ఇద్దరి మధ్యే ఉంచారు. అంటే కనీసం కట్టుకున్న వాళ్లకు కూడా తెలీదంటే అతిశయోక్తి కాకపోయినా, వాళ్ళ మధ్య స్నేహం ఎంత ప్రాణప్రదమైందో ఊహించవచ్చు.

***

అప్పుడే కూతురు పెళ్ళై మూడు నెలలు గడిచింది. అంతలో మొదటి పండుగ్గా దీపావళి రానే వచ్చింది. పెళ్ళైన ఆ క్రొత్త జంటను పండక్కి పిలిస్తే చాలనుకున్న లక్ష్మీకాంతం నెత్తిమీద పిడుగుపాటులాంటి వార్త విన్నాడు. అదేమంటే.. ఈ దీపావళి పండగకు అల్లుడు, అమ్మాయితో సహా.. వియ్యంకుడు, వియ్యపురాలు కూడా వస్తున్నారని. అందులోనూ ఈ మొదటి పండక్కు అల్లుడుకు డైమండ్ ఉంగరం, అమ్మాయికి ఐదు తులాలకు తక్కువ కాకుండా బంగారపు నగ చేయించాలని వియ్యంకుడుకి ఫోన్ చేసి హెచ్చరిస్తునట్లుగా మరీ చెప్పాడు శంకర్రావు.

ఆ మాట విన్న లక్ష్మీకాంతం ముఖంలో రక్తపు చుక్క లేదు. ఒక్కసారి ఊపిరి ఆగినంత పనైంది. ఈ విషయం కోటేశ్వరరావుకు చెప్పి, మళ్ళీ అతడ్ని ఇబ్బంది పెట్టదలుచుకోనూలేదు. అలాగనీ మౌనంగా తను అంత ఖర్చు భరించనూలేడు. ఏం చెయ్యాలో పాలుపోక భగవంతుని మీద భారమేశాడు. సుమారు మరో ఐదు లక్షలు ఉంటే గానీ తనకీ ఈ పండగ సుఖాంతం కాదని, కనుక ఏదో మార్గం చూపమని భగవంతుడ్ని ప్రార్థించాడు లక్ష్మీకాంతం. ఆ భగవంతుడు తన ప్రార్థన విన్నట్టు, లక్ష్మీకాంతం ఎంతో ధైర్యంగా వున్నాడు.

***

పండగ ముందు రోజే దిగారు శంకర్రావు అండ్ కో. పండగ రోజు తెల్లారకట్టే లేచి క్రొత్త వియ్యంకుడు, వియ్యపురాలితో పాటూ.. క్రొత్త అల్లుడ్ని, కూతుర్ని సాంప్రదాయ రీత్యా, హాల్లో నేలపై పెద్ద జంపఖానా వేసి కూచోపెట్టి కుంకుమ బొట్లు పెట్టి, తలకు నూనెతో నలుగు పెట్టి మంగళ హారతులిచ్చి హడావిడి చేశారు లక్ష్మీకాంతం దంపతులు.

వియ్యంకులు తలస్నానాలు చేసి రాగా, మళ్ళీ వాళ్ళందరిని కుర్చీలో కూర్చోపెట్టి ఘనమైన బట్టలు అల్లుడికి, కూతురితో పాటు వియ్యంకునికి, వియ్యపురాలికి పెట్టాడు. ఆ తర్వాత పెట్టె లోంచి బంగారపు నగల పెట్టె తీసి వాటిని పెద్ద పళ్లెంలో పెట్టి అల్లుడికి డైమండ్ వుంగరం, కూతురికి బంగారు నెక్లెస్ పెట్టారు లక్ష్మీకాంతం దంపతులు.

ఈ తంతుని నోరెళ్లపెట్టి చూస్తూ ఉండిపోయింది లక్ష్మీకాంతం భార్య. వియ్యంకులు ఎంతో ఆనందించారు. ఈ దీపావళి పండుగను తాను అనుకున్న దానికన్నా ఎంతో ఘనంగా చేసినందుకు లక్ష్మీకాంతాన్ని ప్రశంశలతో ముంచెత్తాడు శంకర్రావు.

లక్ష్మీకాంతం ఆ ప్రశంశలకు పొంగిపోక, ఈ కార్యం ఇంత ప్రతిషాత్మకంగా నెరపినందుకు అనువైన పరిస్థితులు కల్పించిన ఆ భగవంతుని వేనోళ్ళ స్తుతించాడు మనసులోనే.

మరుసటి రోజు శంకర్రావు దంపతులు ప్రయాణానికి సిద్ధమై హాల్లో కూర్చున్నారు. అదే సమయంలో అమ్మాయికోసం చేసిన తిను బండరాలను వంట గదిలో సర్దుతున్న లక్ష్మీకాంతం అతని భార్యకు పాద నమస్కారాలు చేసేందుకు వచ్చారు కూతురు, అల్లుడు. పాద నమస్కారం చేసిన అల్లుడి భుజాలు పట్టుకుని పైకి లేపి "నా పాలిట ఆ శ్రీమహావిష్ణువు నీవే బాబు. నీకున్న పెద్ద మనస్సుకు ఏమిచ్చి నీ ఋణం తీర్చుకోగలను. చిన్నవాడివని జంకుతున్నాను. లేకపోతే నీ పాదాలకు కోటి సార్లు

నమస్కరించుకుని వాడ్ని!" అని మనసులోనే అనుకుంటూ.. అల్లుణ్ణి గట్టిగా హృదయానికి హత్తుకుని కన్నీళ్లు పెట్టుకున్నాడు లక్ష్మీకాంతం తన్మయంతో నిగ్రహం తప్పి.

అల్లుడు, మామగార్ని ఎలా ఊరడించాలో తేలిక నిశ్చేష్టుడై వుండిపోయాడు అతని వయస్సుకు తెలియని అనుభవం క్రొత్తగా ఎదురైన క్షణంలో. కానీ మామగారి మనోగతం అర్థం చేసుకున్నాడు వయసులో చిన్నవాడైన పెద్ద మనుస్సున్న వాడిలా.

తన కూతుర్ని అల్లుడు ఎలా చూసుకోబోతాడో అనుభవైక వైద్యమైన లక్ష్మీకాంతం, అతని ఔదార్యానికి మనస్సులోనే సాష్టాంగ నమస్కారాలు చేసుకున్నాడు. పండక్కు నాలుగు రోజుల ముందు అల్లుడు ఫోన్ చేసి చెప్పిన మాటలు మనస్సులో పునఃశ్చరణం చేసుకుంటూ...


"అంకుల్! నన్ను మీరు క్షమించాలి! మా తల్లిదండ్రుల అభీష్టం కాదనలేను. అలాని మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేను. అందుకే ఓ నిర్ణయానికొచ్చాను. మీరు పెద్ద మనసు చేసుకుని సహకరిస్తే.. మిగతా కథంతా సుఖాంతమౌతుంది." అని తన ప్రణాళిక ఏమిటో మామగారికి వివరంగా ఫోన్లో చెప్పాడు. ఆయన చేత పైసా ఖర్చు పెట్టనియ్యకుండా.. అంతా ఆయనే చేసినట్లనిపించేలా చేయించాడు. కనీసం ఊర్మిళ తో అయినా మాట వరసకు ప్రస్తావించలేదు.

అలాంటి అల్లుడ్ని ఇలాంటి పండుగ వేళ "ఎంత మంచివాడివయా" అంటూ ప్రశంసించకుండా ఉండలేక పోయాడు లక్ష్మీకాంతం ఆనందాతిరేకంతో దీపాల వెలుగులో తన ముఖమూ వెలిగి పోతుండగా .

***0***

# ఈ బండల మాటున ..

(దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ)



పోతుబరి వెంకట రమణ

ఉదయం పదకొండు గంటలయ్యింది. కోర్టు హాలంతా నిండిపోయి ఉంది. బోనులో నిలుచుని ఉన్నాడు సారథి నిర్వికారంగా. ప్రేక్షకులలో తలవంచుకొని 'దైన్యానికి మరో రూపం' లా కూర్చొని ఉన్నాడు కేశవరావు. తన స్థానం నుండి హుందాగా లేచిన లాయర్ సీతారామయ్య ఒకసారి చుట్టూ పరికించి చూసి, గొంతు సవరించుకున్నాడు.

“యువరానర్! ఈ బోనులో నిలుచున్న సారథికి స్వయంగా తండ్రి .. అదుగోండి అక్కడ కూచున్న నా క్లయింట్ కేశవరావుగారు! ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ, తన ఒక్కగానొక్క కొడుకైన సారథి చదువుకీ, ఉన్నతికీ ఖర్చుచేసి, ఇప్పుడు 'ఒట్టిపోయిన గోవు' లా మిగిలాడు. సారథికూడా చక్కగా చదువుకొని ఓ సాఫ్ట్ వేర్ కంపెనీలో బెంగుళూరులో ఉన్నత స్థితిలోనే కుదురుకున్నాడు. ఇంతవరకూ అంతా సజావుగానే సాగిపోయింది.

తరువాతే కథ అడ్డం తిరిగింది .

విధి వక్రించి కేశవరావు జీవిత సహచరిని కోల్పోయాడు. ఉద్యోగం చేసే రోజుల్లో, తన సంపాదన అంతటినీ కొడుకు కోసమే వెచ్చించాడు. ప్రైవేటు ఉద్యోగం కాబట్టి పెన్షన్ కూడా లేదు. నిజం చెప్పాలంటే కేశవరావు గారు ఇప్పుడు అచ్చంగా రోడ్డున పడ్డారు. ఈ సమయంలో ఆదుకోవాల్సిన కొడుకు ఎందుకో మొహం చాటేసాడు. చట్ట ప్రకారం ముసలి తల్లిదండ్రులను ఆదుకొని, పోషించవలసిన బాధ్యత కొడుకుల మీదే ఉంది. కావున యువరానర్ .. ఈ ముసలి తండ్రిని తన కొడుకు దగ్గరకు చేర్చవలసినదిగా కోర్టు వారికి సవినయంగా వేడుకొంటున్నాను!" అంటూ వంగి నమస్కరించి తన కుర్చీ వద్దకు చేరుకున్నాడు లాయర్ సీతారామయ్య.

"మిస్టర్ సారథి! విన్నారుగా , మీ పై అభియోగాలు. వీటికి మీ సమాధానం ఏమిటి? మీ తరఫున లాయర్ ఎవరూ లేరా?" న్యాయమూర్తి ప్రశ్నించారు .

"గౌరవనీయులైన న్యాయమూర్తి గారూ! కోర్టుకు చెప్పేదేదో నేనే స్వయంగా చెప్పుకుంటాను. అయితే నేను సమాధానం చెప్పే ముందు, నా తండ్రిగారి అభిప్రాయం ఏమిటో చెప్పమనండి!" సౌమ్యంగానే అన్నాడు సారధి.

"కేశవరావు గారూ .. మీరు చెప్పుకోవలసింది ఏమన్నా ఉందా? ఉంటే బోనులోకి వచ్చి నిర్భయంగా చెప్పండి." అన్నారు న్యాయమూర్తి .

విషణ్ణ వదనంతో కూర్చొని ఉన్న కేశవరావు ఒక నిట్టూర్పు విడిచి, నెమ్మదిగా లేచి బోనులోకి వచ్చాడు మూర్తీభవించిన విషాదంలా.

"కేశవరావుగారూ .. ఇప్పుడు మీరు కోర్టులో న్యాయమూర్తి ఎదుట ఉన్నారు. మీ మనసులో ఉన్నదేంటో న్యాయమూర్తి గారికి వివరంగా చెప్పండి. మీకు తప్పకుండా న్యాయం జరుగుతుంది." అభయం ఇస్తున్నట్లుగా ధైర్యం చెప్పాడు లాయర్ సీతారామయ్య.

కేశవరావు ఒక్కసారి కోర్టంతటినీ కలయజూసాడు. న్యాయమూర్తికి దండంపెట్టి గొంతు సవరించుకొని చెప్పసాగాడు.

"అయ్యా! ఏం చెప్పమంటారు? కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది . అయినా కన్నకొడుకు ఎదుట ఒక బిచ్చగాడిగా నిలుచొని.. అయ్యా! నాకు న్యాయం చేయండీ అని కోర్టు వారిని అడుక్కొనే దౌర్భాగ్యం, ఏ తండ్రికీ రాకూడదు...." గొంతు గద్గదికంగా మారి ఒక్క క్షణం ఆగాడు.

న్యాయమూర్తి సైగ అందుకొని బంట్రోతు ఇచ్చిన నీళ్ళను తాగి, తిరిగి చెప్పసాగాడు.

"..... మాది వ్యవసాయ కుటుంబం. మా తాత తరం వరకు బాగానే గడిచిపోయింది. నా తండ్రి తరం వచ్చేసరికి వర్షాలు తగ్గుముఖం పట్టాయి. నూతులు త్రవ్విస్తే, డబ్బులు క్షవరం అయిపోయాయి గానీ, నీరు మాత్రం పడలేదు. ఇప్పటిలా బోర్లు, కరంటు వంటి సౌకర్యాలు లేని రోజులు. పున్నామనరకం నుండి రక్షించే పుత్రుని కోసం చూస్తూ, ముగ్గురు ఆడపిల్లల తరువాత మా నాన్నని కన్నాడు మా తాత. ఆ ముగ్గురు ఆడపిల్లలు పెరిగి పెద్దయి, పెళ్ళిళ్లు పేరంటాలు అయేసరి, అయిదెకరాల ఆసామీ కాస్త ఒక ఎకరం పొలం గల చిన్నకారు రైతు స్థానానికి దిగజారిపోయాడు. ఆ కరువు పరిస్థితులలో మా నాన్న ఎలాగో కష్టపడి హైస్కూలు చదువు వరకే చదవగలిగాడు. ఉన్న కొద్దిపాటి చదువుతోను, చిన్నపాటి పొలంతోనూ రెక్కలు ముక్కలు చేసుకొని సంసారాన్ని ఈదుకుంటూ వచ్చారు . ఒక్కగానొక్క కొడుకునైన నన్ను డిగ్రీ వరకు చదివించి ఆయన సాధించలేని డిగ్రీని నాలో చూసుకొని పొంగిపోయాడు. నిరుద్యోగం కరాళనృత్యం చేసే ఆ రోజుల్లో ఉత్తర, దక్షిణాలు సమర్పించుకొనే స్తోమత లేక, ఏ ప్రభుత్వ ఉద్యోగం రాక, ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి చివరకు ఓ ప్రైవేటు కంపెనీలో చిన్నపాటి ఉద్యోగంలో చేరాను.

అక్కడ నుండి నా శ్రీమతి చారుమతితో కలసి పూర్తిగా సారధి పెంపకం పైనే దృష్టి పెట్టాను. వాడి ప్రాధమిక విద్య పూర్తి అవుతూనే, చారుమతి వారిస్తున్నా వాణ్ణి పేరున్న ప్రైవేట్ రెసిడెన్షియల్ స్కూలులో పెట్టాను. సంవత్సరానికి లక్ష రూపాయలు ఫీజు అయినా భరించాను. ఫేక్టరీ నుండి ఐదు గంటలకు ఇంటికి వచ్చి

కాసేపు విశ్రాంతి తీసుకొని మళ్ళీ ఆరు గంటలకు ఓ హోల్ సేల్ పచారీ దుకాణంలో పద్దులు రాయడానికి వెళ్లి, ఏ రాత్రి పది గంటలకో ఇల్లు చేరుకొనేవాణ్ణి. చారుమతి కూడా తనకి వచ్చిన టైలరింగ్ తో చుట్టు పక్కలవారి బ్లౌజులు, గౌనులు కుడుతూ వేణ్ణీళ్లకు చన్నీళ్ళుగా చేయి సాయంగా ఉండేది. సారధి కూడా మా ఆశలను వమ్ము చేయలేదు. కష్టపడ్డాడు. ఇష్టపడే కష్టపడ్డాడు. ఖరగ్‌పూర్ ఐ.ఐ.టి.లొ సీటు సాధించాడు. చివరి సంవత్సరంలోనే ప్రాంగణ ఎంపికల్లో ఎంపిక అయ్యాడు. అప్పుడే అమెరికా అవకాశం కూడా వచ్చింది. కానీ ఎందుకో దాన్ని వదులుకొని బెంగుళూరుని ఎంచుకున్నాడు. ఆ నిర్ణయం నాకు కొంచెం బాధ కలిగించినా మనసుని సరిపెట్టుకొని వాణ్ణి ఆశీర్వదించాను!

కష్టాలన్నీ గట్టెక్కి సుఖపడే సమయంలో ఆ బ్రహ్మ నాకు తీరని అన్యాయం చేసాడు!

ఛాతీలో నొప్పిగా ఉందని అంటే ఆసుపత్రికి తీసుకెళ్లాను. అదే ఆమె ఆఖరు ప్రయాణం అవుతుందని అని ఏ మాత్రం ఊహించలేకపోయాను. ఆసుపత్రి చేరుకునేటప్పటికే తీవ్రమైన గుండెపోటుతో నన్ను ఒంటరిని చేసి వెళ్లిపోయింది!

ఎందుకో తెలీదు కానీ అప్పటి నుండి సారధి ప్రవర్తనే మారిపోయింది! నాకా వయసు మీరటంతో ఫేక్టరీ నుండి బయటకు వచ్చేయాల్సి వచ్చింది . ఇప్పుడు మాల్స్, కంప్యూటరులు రావటంతో పద్దులు రాసే పని కూడా పోయింది.

ఈ సారధేమో బెంగుళూరు రానేరావద్దని ఖరాఖండీగా చెప్పేసాడు.

అసువులు ఉన్నంత వరకు ఆరాటం తప్పదు కదా! చేతిలో చిల్లిగవ్వ లేక, వేరే దారి లేక తప్పనిసరిగా కోర్టు దారి పట్టవలసి వచ్చింది. ఇంతకన్నా చెప్పడానికేముంది ? న్యాయం కోసం మీ ముందు మోకరిల్లాను! మీరు ఏ తీర్పు చెప్పినా శిరసావహించడానికి సిద్ధంగా ఉన్నాను!"

కేశవరావు కథ విన్న తరువాత, అతనిపై సానుభూతితో పాటు సారధి మీద విపరీతమైన కోపం కూడా కలగసాగింది గాలరీలో ఉన్న వాళ్ళందరికీను.

కొద్దిక్షణాలు మౌనం రాజ్యం చేసిందక్కడ.

"మిస్టర్ సారధి.. విన్నావుగా? ఇక నీ సమాధానం చెప్పు. అటు తరువాత చట్టపరంగా ఏం చర్యలు తీసుకోవాలో నీవు చెప్పే సమాధానంపైనే ఆధారపడి ఉంటుందని మాత్రం మరచిపోకు!" అన్యాపదేశంగా చిన్న హెచ్చరిక చేసారు న్యాయమూర్తి .

చిన్నగా గొంతు సవరించుకున్నాడు సారధి .

అందరి దృష్టి అప్రయత్నంగా సారధి వైపు తిరిగింది.

"గౌరవనీయులైన న్యాయమూర్తి గారికి శతాధిక వందనాలు. ఇప్పుడు నేను మీ దృష్టిలో దోషిని. అవును.. ఈ బోనులో ఉన్నంతకాలం నేను దోషినే కదా! ఇక్కడ ఉన్న చాలామంది దృష్టిలో నేనో విలన్ని. మరి కొందరి దృష్టిలో నేనో చెడ్డ కొడుకుని. అవునంతే! తండ్రి బాధ్యతను స్వీకరించని నేను చట్టం దృష్టిలో దోషినే.

తండ్రిని ఆదరించనందుకు విలన్నే! కన్న తండ్రికి తిండి పెట్టని నేను 'చెడ్డ కొడుకునే' ....." అంటూ జేబులోంచి ఒక కవరు తీసి న్యాయమూర్తి గారికి బంట్రోతు ద్వారా అందించాడు.

“దయచేసి నా వాదన పూర్తయ్యే వరకు ఆ కవర్ని తెరవొద్దు సార్!” అంటూ అభ్యర్థిస్తూ, తిరిగి అన్నాడు.

“గౌరవనీయులైన కేశవరావు గారు తన సర్వస్వాన్నీ ధారపోసి నన్ను ఓ ఐ ఐ టియన్ గా మలిచారు, నిజమే కానీ, నేనేమన్నా ఆయనగార్ని అడిగానా? నేను ఫలానాగా అవుతాను నన్ను ఫలానాగా చేయండీ అని.. లేదే!" అంటూ ఆగాడు.

"ఏ తండ్రి అయినా తన కొడుకు ఉన్నతిని కోరుకోవటం సహజమే కదా! అలాగే మీ తండ్రి నిన్ను ఇలా మలిచారు అది గొప్ప కదా?" మధ్యలో కలగా తీసుకుని, లాయర్ సీతారామయ్య గారు నిలదీసారు సారధిని.

"యస్. దేర్ యు ఆర్! అది ఆయనకు గొప్ప. అది ఆయన గారి కల. ఆ కల నిజం చేసుకోడానికి నేనో పనిముట్టుని అయ్యాను. ఇందులో ఆయన చేసిన త్యాగం ఏముంది?"

"సారధీ ఆయన తండ్రి, నువ్వు కొడుకువి! అది మరచిపోయి ఒక ' మెటీరియలిస్ట్' లా మాట్లాడటం మంచిది కాదు." సీతారామయ్య కించిత్ ఆవేదనగా అన్నాడు.

“లాయర్ గారూ! నేనూ ఆ పాయింట్ దగ్గరకే వస్తున్నాను. ఆయన నాకు జన్మనిచ్చిన తండ్రి అంతే. అదో బంధం. అంతకు మించి అనుబంధం ఏమీ లేదు మా ఇద్దరి మధ్య! ఎందుకంటే ఇంకా ఊహ కూడా విచ్చుకోకముందే ఆరవ తరగతిలోనే ఆయన నన్ను హాస్టల్ కి అంకితం చేసేసారు. అక్కడ నేను ఎలా ఉన్నానో ఆయనకు అక్కరలేదు. ఎలా చదువుతున్నానో మాత్రమే కావాలి. ఎప్పుడన్నా ఇంటికి వస్తే ఎలా చదువుతున్నావు? అని ఆధికారికంగా అడిగేవారే తప్ప, ఎలా ఉన్నావు? అని ఆప్యాయంగా అడిగిన పాపాన పోలేదు. తండ్రి ప్రేమ ఎలాగూ పొందలేక పోయాను. కనీసం తల్లి ప్రేమకు కూడా నోచుకోని దౌర్భాగ్యుణ్ణి......"

కళ్ళు నీటి చెలమలవగా, జేబులోని రుమాలు తీసి కళ్ళొత్తుకొని తిరిగి చెప్పనారంభించాడు.

" .. ఎప్పుడైనా అమ్మ ప్రేమగా దగ్గరకు తీసుకుంటే 'చాల్లే ! నువ్విలా ముద్దు చేసావంటే వాడు హాస్టల్ లో ఉండను ఇంటికొచ్చేస్తాను అంటాడు. అప్పుడు మనం పెట్టిన లక్షలు 'బూడిదలో పోసిన పన్నీరవుతుంది' అని అమ్మని మందలించేవారు. ఏ పండక్కో పబ్బానికో ఓ గారో బూరో చేసి పెడితే... 'ఇదుగో నువ్విలాంటివి అలవాటు చేసావంటే వాడు నీ కొంగు వదిలి వెళ్ళడు' అని గదమాయించేవారు. పాపం అమ్మ .....' భర్త చాటు భార్య'! తన ప్రేమనీ, దుఃఖాన్నీ గొంతులోనే దిగమింగుకొని దూరంగా జరిగిపోయేది. ఇంక నాకు చుట్టాలు బంధువులు తెలిసే తెలీదు. తెలిసే అవకాశమూ లేదు. చిన్నప్పుడెప్పుడో హాస్టల్ లో చేరక ముందు ప్రతీ శలవులకీ తాతగారి ఊరు.... ఆ పల్లెటూరికి మాత్రం వెళ్ళేవాణ్ణి. అంతే! ఆ తరువాత ఏ వేసవి శలవుల్లో ఇంటికొచ్చినా అప్పుడు కూడా ఏ మేథ్స్ , ఏ సైన్స్... సెమీ కోచింగ్ లు ఎదురు చూస్తుండేవి. ఆల్ఫా బీటాలు, వర్గమూలాలూ, ఆక్సిజన్ హైడ్రోజన్ వర్గమూలకాలూ... ఇవే నా శలవులు... కాదు కాదు.. విజ్ఞాన వీచికలు!

ఇదంతా నీ కోసమే కదా ? అని మీరనొచ్చు. అదే నేను  అనేదీను. ఇన్నింటి మధ్య, 'నేను' అనబడే 'నా' గుర్తింపుని నేను కోల్పోయాను.

 హాస్టల్ లో అయినా ఇంట్లో అయినా తినేది.. ఆ అన్నమే! కానీ ఇంట్లో అమ్మ చేతి వంటలో ప్రేమ, మాతృ ధర్మం ఉంటాయి . హాస్టల్ లో 'కుక్' చేతి వంటలో కేవలం జీతం, వృత్తిధర్మం ఉంటాయి.  అక్కడ పెట్టిన ముద్ద అమ్మ చేయంత ముద్దుగా ఉండదు కదా!" కొద్ది సేపు ఆగాడు.

ఇప్పుడిప్పుడే కొడుకులోని రెండో కోణాన్ని చూస్తున్న కేశవరావుకి గతమంతా కళ్ళ ముందు కదలాడసాగింది.

"అయితే ఏమంటావు? ఇప్పుడు హాస్టల్స్ అన్నీ మూసేయాలంటావా?" సీతారామయ్య కొంచెం కోపంగానూ, ఎకసెక్కంగానూ అన్నాడు.

"క్షమించండి. నా ఉద్దేశ్యం  అది కాదు. హాస్టల్ లో ఉండే పిల్లలు,  ఇంటికి వచ్చేటపుడు వాళ్లని ప్రేమగా పలకరించండి. ఆర్తిగా గుండెలకు హత్తుకోండి. ఆ రెండు చర్యలూ చాలు, పిల్లలు  ఇంటి నుండి  హాస్టల్  కి వెళ్ళి మళ్ళీ  తిరిగొచ్చే వరకు వాళ్ళ మనసులు నింపడానికి! నో ఇప్పుడు  ఈ సారధికి ఆ కేశవరావు కి మధ్య ఉండేది ప్రేమ కాదు  ' ప్రేమ రాహిత్యం '!"

"హాస్టల్ లో ఉండే వాళ్ళంతా నీలాగే ప్రేమ రాహిత్యంతో ఉంటారంటావా?" లాయర్ లో విసుగుదల.

"అందరూ కాకపోయినా సగానికి పైగా ఇలా గుండె రాయి చేసుకొనే ఉంటారు.  డబ్బు కడుతున్నాం కాబట్టి చదివించటం వాళ్ళదే బాధ్యత అంటారు తల్లిదండ్రులు!  మీ తల్లిదండ్రులు  ఇంత ఖర్చు  పెడుతున్నారు, కాబట్టి  చదువుకోవటం మీ బాధ్యత అంటారు మేనేజ్‌మెంట్!  అంతా యాంత్రికం!!  ఇక్కడ ప్రేమ స్థానాన్ని డబ్బు ఆక్రమించుకుంది. పిల్లలు విద్యార్జన చేస్తున్నారా? లేక పిల్లల  విద్యతో పెద్దలు ధనార్జన  చేస్తున్నారా అన్నది పెద్ద ప్రశ్న!

సరే  ఏది ఎలా ఉన్నా నేను చిన్నప్పటి నుండి  ఒక రాయి లాగానే పెరిగాను. భావోద్వేగాలు, రాగద్వేషాలు ఏవీ నా మనసుకు పట్టలేదు.

కానీ నాకో కోరిక మాత్రం ఉండేది!  అమ్మ ఒళ్ళో తల పెట్టుకొని సేద తీరుతున్నట్లు, చిన్నప్పటి  ప్రేమనంతా తనివి తీరా పొందుతున్నట్లు....  ఎన్నెన్నో  కలలు కనే వాడిని.  అందుకే నాకు వచ్చిన విదేశీ అవకాశాన్ని కూడా వదులుకున్నాను. ప్చ్... మనిషి ఒకటి తలిస్తే దైవం ఇంకోటి తలుస్తుంది.  ఎవరికి ఏది ప్రాప్తమో అదే దక్కుతుంది. అనురాగం అందుకునే సమయానికి అమ్మ అందరాని తీరాలకు చేరిపోయింది. నా ఆశలన్నీ కూలిపోయాయి!

అందుకే నేనో నిర్ణయానికి  వచ్చాను. అదేంటో ఆ కవరు ఓపెన్  చేసి న్యాయమూర్తి గారు చెబుతారు!" అంటూ అటు వైపు తిరిగాడు.

న్యాయమూర్తి  కవరు చించారు. అందులో నుండి రెండు చెక్కులు, ఒక లేఖ తీసి పరిశీలించారు. అతని మొహంలో నవ్వుతో పాటు కొన్ని ప్రశ్నలు కూడా  మొలకెత్తాయి.

“సారధి మీరనుకొంటున్నట్లు ఒక బండ కాదు. ఆ గుండె మాటున ఏముందో చూడండి. ఒకటి మన ఊళ్లో పేరెన్నిక గల 'వెన్నెలమ్మ' వృద్ధాశ్రమానికి పది లక్షలు విరాళంగా ఇస్తూ కేశవరావు గారిని చేరుస్తున్న లేఖ. రెండోది.. ఇరవై అయిదు లక్షల ముప్పై నాలుగు వేల అయిదు వందలకు కేశవరావు గారి పేరిట చెక్కు!" వివరించారు న్యాయమూర్తి.

ఒక్కసారిగా అందరూ అప్రతిభులై పోయారు!

"న్యాయమూర్తి గారూ! సారధిని కొన్ని ప్రశ్నలు అడగటానికి అనుమతి కోరుతున్నాను!" ముందుగా తేరుకున్న సీతారామయ్య లేచి అడిగాడు .

"యస్ ప్రొసీడ్!" అనుమతించారు న్యాయమూర్తి .

“సారధీ! ఏమిటిదంతా ?" అతని మొహంలో మునుపటి చిరాకు , కాఠిన్యం లేవు.

"ఋణాలు తీర్చుకొంటున్నాను!" నిర్వికారంగా అన్నాడు.

"అది సరే. దాని గురించి తరువాత మాట్లాడుదాం. ఏం చేయాలో ఒక నిర్ణయానికి వచ్చావు. మరి అదేదో ఇంట్లోనే తేల్చుకోవచ్చు కదా? కోర్టు వరకు రావటం ఎందుకు?" సీతారామయ్య మొహంలో అనేక భావాలు కదలాడుతున్నాయి.

ఒక్క నిముషం మౌనంగా ఉండిపోయాడు సారధి. అందరూ సారధి ఏం చెబుతాడా అని చూడసాగారు. శూన్యంలోకి చుస్తూ చెప్పనారంభించాడు సారధి .

“లాయర్ గారూ! మీరన్నట్లు ఈ వ్యవహారం ఇంట్లోనే చక్కబెట్టుకోవచ్చు. కానీ ఇన్నా(న్నే)ళ్ల నా వేదనకు ఓ 'ఔట్ లెట్' కావాలి. ఇన్నేళ్ళుగా నేను అనుభవించిన ప్రేమరాహిత్యం, మానసిక క్షోభ బయట ప్రపంచానికి తెలియాలి. కొంతమంది తల్లిదండ్రులకేనా కనువిప్పు కావాలి...... " అంటూ ఒక్క క్షణం ఆగాడు.

"....... నాకు తెలుసు. లాయర్ సీతారామయ్య గారు, మా నాన్నకు బాల్యస్నేహితులు, ఆప్త మిత్రులు అని. ఆయన తప్పకుండా నా మీద కేసు వేస్తారనీను. నాకు కావలసింది అదే. ఇప్పటికే కొద్ది రోజులుగా ప్రచార మాధ్యమాలు, ప్రసార మాధ్యమాలు నా దుర్మార్గాన్ని ఎండగడుతూ నన్నో 'మనసు' లేని దయాశూన్యునిగా చిత్రించి అనేక కథలు, కథనాలు వండివార్చాయి...." కొంచెం గొంతు పెంచి

"ఇప్పుడు చెప్పండి అందరికీ నా మనసు ఎక్కడ బండరాయిగా మారిందో? చదువుల పేరుతోనో, మంచి భవిష్యత్తు పేరుతోనో మీ పిల్లల్ని 'బండరాళ్లుగా' మార్చకండి. వాళ్ల బాల్యాన్ని కాలరాయకండి!" అంటూ ఒక్కసారిగా బోరుమన్నాడు.

'బండ పగిలి జలం పొంగినట్లు' ఇన్నాళ్ల వేదనా కరిగి కన్నీరై ప్రవించింది.

"సారధీ! కూల్ కూల్" సీతారామయ్య దగ్గరకు వచ్చి భుజం తడుతూ ఓదారుస్తున్నట్లుగా అన్నాడు. కొంచెంసేపటికి తెప్పరిల్లాడు సారధి .

"కొడుకుగా బాధ్యత తీసుకోలేదనే కదా మీరంతా నన్నో కసాయివాడిగా కృతఘ్నునిగా జమ కట్టారు. కానీ 'ప్రేమ రాహిత్యం' అంటే ఏమిటో ఆయనకీ తెలియాలి. అందుకే వృద్ధాశ్రమంలో చేర్చి, నా మొదటి ఋణం తీర్చుకుంటున్నాను.
ఇంక రెండోది. నేను ఎప్పుడు హాస్టల్ నుండి ఇంటికొచ్చినా 'నీ కోసం ఇంత ఖర్చు చేస్తున్నాను . అంత ఖర్చు చేస్తున్నాను..' అంటూ ఏవేవో లెక్కలు చెప్పేవారు. అప్పుడే నిర్ణయించుకున్నాను.. అంతకంతా తిరిగి ఆయనకు జమ చేయాలని. అప్పటినుండి ఎప్పటికప్పుడు ఖర్చులన్నీ ఓ పుస్తకంలో రాసి ఉంచుకున్నాను. దానికి జవాబే నా ఆ చెక్కు! అలా ఆ ఋణం కూడా తీర్చుకున్నాను! ఇంక ఇప్పుడు మూడో ఋణం తీర్చుకోడానికి నేను మా పల్లెకు వెళ్ళిపోతాను. ఉద్యోగానికి రాజీనామా చేసేసాను. పల్లెలో తాత లేకపోవచ్చు. కానీ చిన్నప్పుడు ఆరుబయట వెన్నెలలో తాత చెప్పిన కథలు, కబుర్లు నా మనసులోనే ఉన్నాయి. నాన్నమ్మ లేకపోవచ్చు. కానీ చిన్నప్పుడు ఆమె చేసిపెట్టిన వంటకాల రుచులు ఇంకా నా నాలుకపైన నాట్యమాడుతూనే ఉన్నాయి. అందుకే అక్కడకు చేరి ఆ మధుర జ్ఞాపకాలు తడుముకుంటూ.... నా పల్లెకు ఏమి కావాలో..... పల్లెకు నేనేం చేయగలనో.. అది చేస్తాను. ఇప్పటికే నా మిత్రుని ద్వారా అక్కడ ఓ ఇల్లు అద్దెకు తీసుకున్నాను." అంటూ ముగించాడు.
అందరి మనసులూ మంచు ముక్కల మధ్య కూరుకుపోయినట్లుగా అయిపోయాయి.
సారధి బోనులోంచి బయటకు వచ్చాడు స్వేచ్ఛావిహంగంలా!!

***

తెలతెలవారుతోంది. చెట్ల మీద పక్షులు కిలకిలారావాలు శ్రవణపేయంగా ఉన్నాయి. పల్లెకు నీరాజనం పడుతూ తూర్పు కొండపై సూర్యుడు ఉదయిస్తున్నాడు.
తలుపు తెరచుకొని బయటకు వచ్చాడు సారధి.
ఆశ్చర్యం ......!
ఎదురుగా చిన్న చేతి సంచితో... కేశవరావు.
మౌనంగా దారిచ్చాడు సారధి.
దూడను చేరిన ఆవు 'అంబా' అని అరిచిన అరుపు ఎక్కడినుండో వినవచ్చింది!

***0***

# మారిన మనిషి

(దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ)





## సుసర్ల సర్వేశ్వర శాస్త్రి


"ఏమండి ఇక్కడ డబ్బులు పెట్టాను తీసారా?" అని అడిగిన భార్య వైపు ఆశ్చర్యంగా చూసాడు రామారావు.

"నేనెందుకు తీస్తాను? తీసినా నీకు చెప్పడం నా అలవాటని నీకు తెలుసుగా" పేపరు చూస్తూ అన్నాడు రామారావు.

'నిజమే! తాను ఎక్కడయినా డబ్బులు పెట్టి మరచిపోతే వాటిని తీసి ఇచ్చి వాటిని జాగ్రత్తగా బీరువాలో దాచమని తనని ఎన్నోసార్లు హెచ్చరించడం తెలుసు. పదవ తరగతి చదువుతున్న కొడుకు ప్రసన్న, ఇంట్లో పని చేస్తున్న సీతమ్మ, వారిద్దరికే అవి తీసే అవకాశం ఉంది. సీతమ్మను అడిగి చూస్తే ఎలా ఉంటుంది? అని ముందు అనిపించినా మనసు అంగీకరించలేదు. ఆమె చాలా కాలం నుండి ఇంట్లో పని చేస్తోంది. ఎన్ను సార్లు బంగారు వస్తువులు, డబ్బులు మూల పడిపోతే ఇల్లు ఊడ్చేటపుడు దొరికితే వెంటనే ఇచ్చేసేది. ఎవరో ఒకరు ఉన్నపుడే ఇల్లు తుడిచేది. ఆమె పనిచేస్తున్న వారందరూ ఆమె నిజాయితీని బాగా మెచ్చుకుంటూ ఉంటారు. ఇక ప్రసన్న విషయానికి వస్తే.. ఒక్కడే కొడుకు. ఏ లోటు లేకుండా పెంచుతున్నాము. అయినా వాడికి ఈ వయసులో అంత డబ్బు అవసరాలు ఏముంటాయి? కావలసినవి కొని ఇస్తున్నాం. వాడిని అడిగితే చిన్నబుచ్చుకుంటాడేమో? ఒకవేళ తానే ఎక్కడో పెట్టి మరచిపోయానా?' అనే సందేహంతో ఆ విషయాన్ని అక్కడే వదిలేసింది శారద. కాని తరువాత కూడా చాలా సార్లు ఇలాగే డబ్బులు మాయవడం, ముఖ్యంగా పెద్ద నోట్లే మాయవడంతో తన భర్త దృష్టికి తెచ్చింది.

"ఇది సున్నితమైన విషయం. చిన్నప్పుడు నేను మా నాన్నగారి జేబులో రెండు రూపాయలు దొంగతనం చేసాను. రోజు స్కూలు దగ్గర స్నేహితులు డబ్బులిచ్చి చిరుతిళ్ళు కొనుక్కుని తినేవారు, వాటిని నాకూ ఇచ్చేవారు. కాని నేను వారికి ఎప్పుడూ కొని ఇవ్వలేకపోయేవాడిని. మాకు ఇంట్లో బయట కొనుక్కోడానికి డబ్బులు ఏమీ ఇచ్చేవారు కాదు. తక్కువ ఆదాయం, ఇంటికి వచ్చిపోయే వారు, కుటుంబ సభ్యులతో పాటు మా ఇంట్లో ఉండి చదువుకునే బంధువుల సంఖ్య ఎక్కువగానే ఉండేది. కాని నేను గమనించలేనిది ఏమిటంటే, తీసిన డబ్బులతో బయట చిరుతిళ్ళు కొనుక్కుని తినడం మా నాన్నగారి ఆఫీసు మిత్రుడు చూసి ఆయనకు చెప్పేరన్న సంగతి. ఆ రోజు సాయంకాలం నాన్నగారు ఇంటికి వచ్చాక, ఎప్పుడు లేనిది నన్ను పార్కుకు తీసుకు వెళ్ళి, ఎవరూ లేని చోట కూర్చోపెట్టి, 'దొంగతనం చేయడం, ఖర్చు చేయడం సులభం. కాని నిజాయితీగా సంపాదించే వారు, దుబారాగా ఖర్చు చేయలేరు. ఈ రోజు నీవు చేసిన పని

రేపు నిన్ను దొంగగా మార్చి జైలుకు పంపితే నీకు గౌరవం ఉంటుందా? మనం నలుగురికి అవసరానికి సహాయం చేస్తేనే మనకు అవసర సమయాలలో వారూ మనకు అండగా నిలుస్తారు. అందుకే వారిని మన ఇంట్లో ఉంచి చదిస్తున్నాను. ఆ కారణంగానే మీకు బయట కొనుక్కుని తినడానికి పాకెట్ మనీ ఇవ్వలేకపోతున్నాను. ఎవరో కొనుక్కున్నారని వారితో నువ్వు అలా ఖర్చు చేయనవసరం లేదు. నీ కుటుంబ పరిస్థితుల బట్టే నువ్వు జీవించాలి. నిజాయితీగా ఉంటూ చదువుకుని మంచి ఉద్యోగం చేసుకోవాలి. ఒక పని చేయి.. ఈ నెలనుండి నాకు వచ్చే ఆదాయం, ఖర్చుల వివరాలు నువ్వే రాయి. నేనెందుకు డబ్బులు ఇవ్వడం లేదో తెలుస్తుంది' అని నాన్నగారు చెప్పగానే నాకు ఏడుపు వచ్చేసింది. నిజానికి నాన్నగారు ఇంట్లో అందరి ముందు నన్ను ఈ విషయంపై దండించవచ్చు. కాని నేను తెలియకుండా చేసిన తప్పు సరిదిద్దాలని అందరి ముందు నా గౌరవం పోగొట్టరాదని భావించి, ఇలా బయటకు తీసుకు వచ్చి నా తప్పును చెప్పారు. నాకు ఏడుపు ఆగలేదు నాన్నగారి కాళ్ళపై పడి క్షమాపణ అడిగాను. నాన్నగారు నన్ను లేవదీసి ముద్దు పెట్టుకుని బాగా చదువుకోమని చెప్పి, ఒక స్వీటు దుకాణానికి తీసుకు వెళ్ళి నాకు నచ్చిన ఒక స్వీటు కొని ఇచ్చారు. ఇంట్లో వాళ్ళకి అనుమానం రాకుండా మా నెల వారి కిరాణా దుకాణంనుండి కొన్ని సామాన్లు కొని సంచి నన్ను పట్టుకోమని చెప్పి ఇంటికి తీసుకు వెళ్ళారు. అందరూ మేము సామాన్లు కొనడానికి వెళ్ళాము అనుకున్నారు. ఆ సంఘటనతో నాన్నగారిపై గొప్ప గౌరవం కలిగింది. తరువాత మా ఇంటికి వచ్చే అతిథులు తిరిగి వాళ్ళు వెళ్ళేటపుడు మాకు ఇచ్చే చిల్లర నాణాలు కూడబెట్టి రెండు రూపాయలు కాగానే, మా నాన్నగారికి ఇవ్వగానే నాకు కలిగిన ఆనందం చెప్పలేను. దొంగతనం చేసిన భారం నాలో తొలగిపోయింది. నాన్నగారు కూడా ఎంతో సంతోషపడి దానికి మరికొంత జోడించి మంచి మార్కులు పరీక్షలో వచ్చినందుకు నాకు పెన్ను కొని ఇచ్చారు. కానీ ఇప్పటి పిల్లలు అప్పటిలా కాదు. చాలా సున్నిత హృదయులు. ఎలా స్పందిస్తారో చెప్పలేం. ఇంట్లో మనం ఎన్ని సమకూర్చినా, స్నేహితుల సావాసం, పర్యవసానాలు అర్థం చేసుకునే పరిణితి లేని వయసు వల్ల కొందరు పిల్లలు ఇలాంటి చిల్లర దొంగతనాలకు పాల్పడతారు. కాని ప్రారంభ దశలో తమ తప్పు తెలుసుకున్నవారు తప్పు సరిదిద్దుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరతారు. లేని వారు సంఘ విద్రోహులుగా మారి జీవితాలు నాశనం చేసుకుంటారు. దండన ద్వారా కన్నా "దొంగ" అనే ముద్ర పడినవారికి సమాజంలో ఎదురయ్యే పరిస్థితి ఏమిటి? అనేది వాడికి తెలియాలి. ముందు వాడే ఈ డబ్బులు తీసాడని నిర్ధారించుకోవాలి. ఆ తరువాత వాడి తప్పు వాడే తెలుసుకునేలా చేద్దాం" అన్నాడు రామారావు.

మర్నాడు శారద కొన్ని నోట్లు వంటింట్లో డబ్బాల వెనక కనీ కనిపించనట్లు దాచి ఉంచింది. అవి రెండు రోజులు అక్కడే ఉన్నాయి. వాటిని మళ్ళీ అలాగే ఉంచింది. మరో రెండు రోజుల తరువాత పనిమనిషి సీతమ్మ పని ముగించుకుని వెళ్ళిపోయింది. వంటింట్లోకి వెళ్ళి నోట్లను చూడగా యధాతథంగానే ఉన్నాయి. ప్రసన్న స్కూలునుండి వచ్చే సమయం అవడంతో తలుపు దగ్గరగా వేసి వచ్చి, పక్కింటి వాళ్ళింట్లో కూర్చుని

గుమ్మం వైపు ఓరకంట చూడసాగింది. ప్రసన్న వచ్చి యూనిఫారమ్ మార్చుకుని ఐదు నిముషాలలో తయారై, తలుపు దగ్గరకు వేసి బయటకు వెళ్ళిపోయాడు. శారద ఇంట్లోకి వెళ్ళి నోట్లు లెక్కపెట్టగా రెండు నోట్లు తగ్గాయి. దొంగ ఎవరో తెలిసిపోయింది. వీడు ఆ డబ్బులు ఏం చేస్తున్నాడు? చెడు వ్యసనాలకు ఖర్చు చేస్తున్నాడా? ఆ ఆలోచన రాగానే మనిషిలో వణుకు ప్రారంభమైంది. అతని గదిలోకి వెళ్ళి పుస్తకాలు, స్కూలు బేగ్ వెదకగా ఒక సెల్ ఫోన్, తాము కొననివి కొన్ని కంప్యూటర్ గేమ్స్ కనిపించాయి. రామారావు రాగానే జరిగింది చెప్పి భోరుమంది శారద.

"కంగారుపడకు. నువ్వు ఎప్పటిలాగే ఏమి తెలియనట్లు ఉండు. వాడు రాగానే ఆవేశపడి మాటలనకు. వీడి మీద స్నేహితుల ప్రభావం ఉంది. సెల్ ఫోన్, వీడియో గేములు స్నేహితులు వీడి దగ్గర డబ్బులు తీసుకుంటూ ఇచ్చి ఉండవచ్చు. బయట తిళ్ళకు ఖర్చు చేస్తూ ఉండవచ్చు. వాడికి దొంగతనం అంటే ఎలా భయం కలిగించాలో నేను ఆలోచించాను!" అని చెప్పాడు రామారావు. ప్రసన్న ఆట నుండి ఇంటికి రాగానే, ఎవరూ ఏమీ అడగకపోవడంతో అంతా మామూలుగా ఉందని, అమ్మ నోట్ల విషయం తెలుసుకోలేదని మనసులోనే సంతోషిస్తున్నాడు. మనసులో దిగులు, ఆవేశం కలగలిసి ప్రవహిస్తున్నా శారద భర్త హెచ్చరిక గుర్తు పెట్టుకుని మాములుగానే ఏమి తెలియనిదానిలా నటిస్తోంది.


ఆ రోజు ఆదివారం కావడంతో కొడుకును తీసుకుని ఒక పోలీసు స్టేషన్ కు వెళ్ళాడు రామారావు. అందులో అతని క్లాస్ మేట్ పోలీసు అధికారిగా పని చేస్తున్నాడు. వాళ్ళిద్దరూ మాట్లాడుతుండగా పోలీసులు కొందరు జేబు దొంగలను తీసుకువచ్చి, తమదైన శైలిలో కోటింగ్ ఇస్తూ నిజాలు కక్కించడం గమనించాడు ప్రసన్న. అతని ఒంట్లో వణుకు మొదలైంది. కొంతసేపయాక పోలీసులు ఇద్దరు కుర్రాళ్ళను తెచ్చి పోలీసు అధికారి ఎదుట నిలబెట్టారు. వారిని ఎగాదిగా చూస్తూ "మీరు ఇంకా దొంగతనాలు మానలేదన్న మాట" అని గట్టిగా గర్జించి "వీళ్ళకి మనదైన పద్ధతిలో నాలుగు తగిలించి వీళ్ళ వెనక ఎవరున్నారో తెలుసుకోండి" అని అదేశించాడు. "వీళ్ళు ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ఉన్నారు. స్నేహితుల సావాసంతో జల్సాగా తిరుగుతూ ముందు ఇంట్లో చిల్లర దొంగతనాలు, తరువాత జేబు దొంగతనాలు, ఆడవాళ్ళ మెడలో గొలుసు దొంగతనాలు చేసి దొరికిపోయారు. ఇప్పుడు కొంతమంది పదవ తరగతి విద్యార్థులనుండి యూనివర్శిటి విద్యార్థుల వరకూ తోటి స్నేహితుల ద్వారా డబ్బులిచ్చి జల్సాలకు అలవాటు చేసి చిల్లర దొంగతనాలు చేయంచడం, మత్తుమందులు అమ్మించడం, అలవాటు చేసే ముఠాలు ఎక్కువయాయి. వాళ్ళకి పెద్దవాళ్ళ అండదండలుండడంతో, వెనకవాళ్ళు తప్పించుకుని ఈ విద్యార్థులను ఇరికించేస్తున్నారు. పిల్లలపై ఓ కన్ను వేసి ఉంచాలి. మా చేతికి చిక్కారో తోలు వలిచేస్తాం!" అంటూ ఆగ్రహంగా చెబుతున్న పోలీసు అధికారిని భయంగా చూసాడు ప్రసన్న. పక్క గదిలోంచి కేకలు వినబడుతున్నాయి. ప్రసన్న వైపు చూసి ఆయన "నాలాగ బాగా చదువుకుని పెద్ద పోలీసు అధికారివై, దొంగలను పట్టుకోవాలి" అని చెప్పగానే అలాగే అన్నట్లు తలూపి తండ్రితో కలిసి ఇంటికి చేరాడు ప్రసన్న.

ఆ రోజు నుంచి ప్రసన్నలో వచ్చిన మార్పు గమనించారు వారిద్దరూ. స్నేహితుల దగ్గరనుండి తెచ్చిన ఫోన్, కంప్యూటర్ గేమ్స్ వస్తువులు వారికి ఇచ్చేసాడు. చదువుపై శ్రద్ధపెట్టాడు. అప్పటినుండి ఇంట్లో డబ్బులు పోవడం లేదు. ఆ టెర్మ్ లో చాలామంచి మార్కులు తెచ్చుకొడంతో టీచర్లు అభినందనలతో ప్రసన్నలో కొత్త ఉత్సాహం వచ్చింది. చదువంటే కేవలం క్లాసు పుస్తకాలే కాదని తెలుగు భాష,సాహిత్యం, కథల పుస్తకాలను చదవడం ప్రోత్సహించారు. ఒక వైపు ఇంగ్లీషు మీడియంలో చదువుతున్నా, తల్లిదండ్రుల సహకారంతో తెలుగు పుస్తకాలు చదివి దానిపై పట్టు సాధించి వ్యాస రచన, డిబేటింగ్ పోటీలలో బహుమతులు గెలుచుకుంటున్నాడు. ఎవరైనా వస్తే అతని తెలుగు, ఇంగ్లీషు ప్రసంగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇంజనీరింగ్ చదువినపుడు రచనలు కూడా ప్రారంభించి రచయితగా గుర్తింపు పొందాడు. మాతృభాష ఆవశ్యకతను గట్టిగా సమర్థిస్తూ ఉపన్యాసాలు ఇచ్చేవాడు. ఉపాధి కొసం ఆంగ్లంలో చదివినంత మాత్రాన మాతృ భాష తెలుగును విస్మరించరాదని విషయ పరిజ్ఞానానికి మన చుట్టూ ఉన్న మన వారితో మమతానురాగాలు పెంచడంలో మాతృభాష తెలుగు ఎంతగానో తోడ్పడుతుందని చెప్పడమే కాదు, తెలుగు మాధ్యమంలో చదివి వచ్చిన వారు న్యూనతా భావంతో బాధపడకుండా రెండు భాషలలోనూ ప్రవీణ్యం ఎలా సంపాదించాలో వారికి బోధించి ఆదర్శప్రాయుడయాడు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వించేలా ఉన్నత విద్య అభ్యసించి దేశంలోనే ఉన్నతమైన అధికారిగా ఎంపికయాడు. తను తప్పుతోవ పడుతున్న సమయంలో తనను దండించకుండా సక్రమమార్గంలో నడిపించిన తల్లిదండ్రులకు సదా కృతజ్ఞతలు తెలియచేసుకుంటు ఉన్నాడు ప్రసన్న.

***0***

# దైవం మానుష రూపేణ

(దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ)





## కనకగిరి రాజేశ్వరి


బస్టాప్ పక్కనే ఉన్న బడ్డీ కొట్టులో కూర్చుని బేరాలు చూస్తున్న సత్తిగాడు, ఇందాకట్నుంచీ ఒక అబ్బాయిని గమనిస్తున్నాడు. ఎంతో పరిచయమున్న మొహంలా ఉంది, కానీ గుర్తు రావటం లేదు. అతను అరటిపళ్ళ ధర అడిగి, తీసుకోకుండా మళ్ళీ బస్టాప్ దగ్గర కెళ్ళి నిలబడ్డం గమనించాడు. ఆ నడక చూడంగానే గుర్తొచ్చినట్టై, చటుక్కున బడ్డీ దిగి అతని దగ్గర కెళ్ళి "బాబూ మీ పేరు మోహనేనా, మీ నాన్నగారి పేరు ప్రకాశం గారేనా?" అనడిగాడు ఆతృతగా. ఆ యువకుడు ఆశ్చర్యంగా చూస్తూ ఔనని, "మీరెవరు, మీకు నేనెలా తెలుసు?" అనడిగాడు.

"నేనండీ బాబూ.. సత్తిబాబుని. మీ ఇంట్లో ఉండేవాణ్ణి కదా!" అన్నాడు.

మోహన్ కి గుర్తొచ్చింది.

"నువ్వా, సత్తిబాబు. చాలా మారిపోయావు, మీ వాళ్ళందరూ ఎలా ఉన్నారు" అనడుగుతూనే అతన్ని పరిశీలించి చూసాడు. వేసుకున్న బట్టలూ, చేతి వాచీ, ఫోనూ.. ఆర్థికంగా బాగానే ఉన్నట్టుంది. మోహన్ అప్రయత్నంగా తన బట్టల వైపు చూసుకున్నాడు. ఇంతలో సత్తిబాబు "పదండి బాబూ మీ ఇంటికెళదాం. నాన్నగార్నీ, అమ్మగారినీ చూడాలి." అన్నాడు.

"నాన్న పోయారు సత్తిబాబూ!" అన్నాడు మోహన్.

షాక్ కొట్టినట్టైంది సత్తిబాబుకి.

"ఎప్పుడు బాబూ? ఎలా?" అడిగాడు కన్నీళ్లతో.

"కేన్సర్" అన్నాడు మోహన్. "నేనిప్పుడు ఒక ఆఫీసుకి పదకొండు గంటలకల్లా వెళ్ళాలి. అర్జెంట్." మళ్ళీ మోహనే అన్నాడు.

"ఇప్పుడింకా తొమ్మిదవలేదు. మీ ఇంటికెళ్లి అమ్మగార్ని చూసి, మళ్ళీ మీరెక్కడికెళ్ళాలో అక్కడ దిగబెట్టేస్తాను, ఉండండి!" అని బడ్డీ పక్కనే ఉన్న పళ్ల దుకాణంలో యాపిల్సూ, అరటిపళ్ళూ తీసుకుని

"బాబాయ్, నాన్న వస్తే చెప్పు అర్జెంటుగా బయటికి వెళ్లానని, కొంచెం షాపు చూస్తూ ఉండు!" అని స్కూటర్ తీసుకొచ్చి "ఎక్కండి బాబూ" అన్నాడు .

మోహన్ డైరెక్షన్ చెప్తూ ఉంటే స్కూటర్ పోనిచ్చాడు . కొంచెం ఆర్థికంగా తక్కువ వాళ్ళుండే ఒక లొకాలిటీలో ఆగింది స్కూటర్. ఓ నాలుగైదు వాటాలున్న ఇంట్లో, ఓ వాటా ముందు ఆగి తలుపు తట్టాడు మోహన్. భారతమ్మ తలుపు తీసి మోహన్ని చూస్తూనే "అప్పుడే వచ్చేసావేం, వెళ్లిన పనేమయింది?" అనడుగుతూండగానే సత్తిబాబు ఆవిడ కాళ్ళ మీద పడిపోయాడు. ఆవిడ కంగారు పడుతూ "ఎవరు.. ఎవరు? లే! లే!" అంటూ వెనక్కి జరిగారు. మోహన్ కూడా ఈ హఠాత్పరిమాణానికి కంగారుపడి "లే సత్తిబాబూ" అంటూ లేపాడు. "మన సత్తిబాబమ్మా" అని తల్లితో చెప్తూనే గోడకానించి ఉన్న గాడ్రెజ్ కుర్చీ తీసుకొచ్చి వేసాడు. సత్తిబాబు పళ్ళు ఆవిడ చేతిలో పెట్టి, ఆవిడ మంచం మీద కూర్చుంటే, ఆవిడ కాళ్ళ దగ్గర కూలబడ్డాడు. ఇప్పుడే వస్తాను అని చెప్పి మోహన్ బైటికి వెళ్ళాడు .
"ఎలా ఉన్నారమ్మా? ఎన్నేళ్లయిపోయింది మిమ్మల్ని చూసి. ఈవేళ నా అదృష్టం బాబు కనిపించారు, కానీ పెద్దబాబు గార్ని చూడలేకపోవడం నా దురదృష్టం!" అన్నాడు ఏడుపు గొంతుతో . భారతమ్మ కళ్ళు వత్తుకుంటూ, "బాబు చెప్పే ఉంటాడు, ఏ అలవాట్లూ లేని ఆయనకి కాన్సర్ వచ్చింది. ఆ వైద్యం కోసం మా పల్లెటూర్లో ఉన్న ఇల్లూ అన్నీ అమ్మినా ఆయన దక్కలేదు. ఏం చేస్తాం, మా గీత అలా రాసాడు భగవంతుడు. అప్పటికి వీడింకా డిగ్రీలోనే ఉన్నాడు. మా అన్నయ్య ఒకడు ఈ ఊళ్ళో ఉన్నాడు. వాడి ఆసరా మీద ఇక్కడ ఉంటున్నాం. ఏదో వీడు పేపర్లు వేసుకుంటూ, చిన్నపిల్లలకి ట్యూషన్లు చెప్తూ, ప్రైవేట్ గానే ఎమ్మే కూడా పూర్తి చేసాడు. ఉద్యోగాలకి అప్లికేషన్లు పెడుతూనే ఉన్నాడు. ఏమిటో.. ఏదీ రావటం లేదు. మొన్న మా అన్నయ్యతో పాటు ఎవరో ఆఫీసరు గారింటికి భోక్తగా వెళితే, ఆయన ఒకసారి ఆఫీసుకి వచ్చి కలమని చెప్పారుట! ఈ వేళ మంచి రోజని బయల్దేరాడు. ఏమిటో నా సోది చెప్పేస్తున్నాను, మీరెలా ఉన్నారు? మీ అమ్మా, నాన్నా బాగున్నారా?" అనడిగారు.
సత్తిబాబు ఆవిడ చెప్పిందంతా విని కన్నీళ్ల పర్యంతం అయ్యాడు. ఎలాగో గొంతు పెగుల్చుకుని "పాప గారెక్కడున్నారమ్మా, కులాసాగా ఉన్నారా?" అన్నాడు.
"అది బాగానే ఉంది నాయనా, ఈయనకి బాగులేక పోవడంతోటే, ఇంటర్ అయిపోయాక, దాని పెళ్లి చేసేసాం. అల్లుడు స్కూల్ టీచర్. దాని అత్తవారు మంచివారు. మా పరిస్థితి తెలిసి, దేనికీ పేచీలు పెట్టరు. ఇదుగో వీడి గురించే నా బెంగ అంతా!" అని చెప్తూ ఉండగా, పాల పేకెట్ పట్టుకుని మోహన్ ఇంట్లోకి వచ్చాడు. "అమ్మా, కొంచెం కాఫీ ఇద్దామా, సత్తిబాబుకి, పాపం చిన్నప్పుడు వాడికి రాగి జావే ఇచ్చేదానివి, బలం అని!" అన్నాడు. నవ్వుతూ ఆవిడ "సరే" అని లేవబోతుంటే, సత్తిబాబు "వద్దమ్మా, నాకు ఇప్పటికీ కాఫీ, టీలు అలవాటవలేదు. మీరు కూర్చోండి!" అని కూర్చోబెట్టేసాడు. చుట్టూ చూస్తున్న వాడి కళ్ళు ఓ ఫోటో

దగ్గర ఆగాయి. ఆ రోజు వాడికి బాగా గుర్తు! అది మోహన్ పుట్టిన రోజునాడు తీయించుకున్నారు. మోహన్ కొత్త బట్టలు వేసుకుంటే, అమ్మగారు అతని పాత బట్టలు తనకిచ్చి వేసుకోమన్నారు.

ఆ ఫోటోలో.. వాళ్ళందరూ పై మెట్టు మీద కూర్చుంటే, తను పంతులుగారి కాళ్ళ దగ్గర, పళ్ళన్నీ బైట పెట్టి నవ్వుతూ కింద మెట్టుమీద కూర్చున్నాడు. అమ్మ ఆ ఫోటో చూసి ఎంత సంతోషించిందో! 'రాజా లాగున్నాడు నా బిడ్డ' అని మురిసిపోతూ ఆ ఫోటో అందరికీ చూపించింది. వాడీ ఆలోచనల్లో ఉండగానే ఆవిడ ఓ రెండు అరటిపళ్ళూ ఆపిల్సూ కడిగి, దేముడికి చూపించి ఆపిల్ పండు ముక్కలు చేసి తెచ్చారు. తినండర్రా అని చేతిలో పెట్టారు. మోహన్ మొహమాటంగా నవ్వుతూ "బాగుందమ్మా సత్తిబాబు తెచ్చినవే, అతనికి పెడుతున్నాం!" అన్నాడు.
ఆవిడ నవ్వుతూ "సత్తిబాబు పరాయి వాడేమిట్రా, నా బిడ్డలాగ పెరిగాడు!" అన్నారు.
వాడికి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. "పదండి బాబూ, మీరెక్కడికో వెళ్లాలన్నారు. అక్కడ దింపేస్తాను." అన్నాడు.
మోహన్ తల్లితో "నేనొచ్చేసరికి ఆలస్యం అవుతుందేమో, నువ్వన్నం తినెయ్యి" అని చెప్పి బయల్దేరాడు.

"ఏమిటో సత్తిబాబూ! ఎన్ని ఉద్యోగాలకి అప్లై చేసినా ఏదీ రావటం లేదు. రిజర్వేషన్ లేదు, లంచాలిచ్చుకోలేను. అమ్మ ఈ వయసులో కూడా కష్ట పడుతోంది. ఇప్పుడు వెళ్ళే ఉద్యోగానికి, ప్రైవేటుదే అనుకో, మూడు రోజుల పాటు ఇంటర్వ్యూలయ్యాయి. ఊహించు ఎంతమందొచ్చారో. నేను బాగానే చేసాను. ఆపైన దేముడి దయ. ఏమన్నా ఇన్ఫర్మేషన్ తెలుస్తుందేమోనని, ఓ సారి ఆఫీసర్ గార్ని కలుద్దామని బయల్దేరాను. ఇంతకీ నువ్వేం చేస్తున్నావు?" దార్లో మాట్లాడుతూ అడిగాడు మోహన్.
"నాదీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ అయిపోయింది. గ్రూప్ ఎగ్జామ్స్ కి ప్రిపేరవుతున్నాను. ఆ బడ్డీ కొట్టు మావాళ్ళదే. మా నాన్న వచ్చేదాకా నేనక్కడ బేరాలు చూస్తాను!" అని చెప్పాడు సత్తిబాబు. ఇంతలో ఆ ఆఫీసు దగ్గరికి వచ్చేసారు.
"మీరు పని చూసుకుని వచ్చెయ్యండి. నేనిక్కడ వెయిట్ చేస్తాను. మళ్ళీ మిమ్మల్ని ఇంటి దగ్గర దింపేస్తాను. రెండు బస్సులు మారి వెళ్ళేసరికి ఆలస్యం అయిపోతుంది లేకపోతే.. " అన్నాడు సత్తిబాబు.
మోహన్ ఆఫీసు లోకి వెళ్ళాక ఆఫీసు ఎదురుగా ఉన్న చిన్న కాఫీ షాపులో కూర్చున్నాడు. సత్తిబాబుకి గతం గుర్తొచ్చింది.

***

విజయనగరం జిల్లాలో ఓ పల్లెటూరు తమది. వెనుకబడిన కులం. చదువు తమ జీవితాలను బాగుచేస్తుందని తెలియని వాళ్ళు తన పెద్దవాళ్ళు! తనకి స్కూలికి వెళ్లి చదువుకోవాలని ఉండేది. ఎప్పుడూ

స్కూల్ దగ్గిరే నిలబడి, వాళ్ళు గట్టిగా వల్లె వేస్తున్న పద్యాలూ ఎక్కాలూ వినేవాడు. కాని తన తండ్రి దొరగారి దగ్గర గొడ్లు కాయడానికి పెడతానన్నాడు.

ఓ రోజు గొడ్లు కాయడానికి వెళ్ళననీ, చదువుకుంటాననీ, అన్నందుకు తన తండ్రి తనను వెంటబడి కొట్టడం మొదలు పెట్టాడు. తండ్రిని తప్పించుకుంటూ పరిగెడుతూ ఉండడం, ప్రకాశం గారి కంటబడింది. ఆయన, వాళ్ళింటికి పిల్చి విషయం అంతా కనుక్కున్నారు. తిండి గింజల కోసం, తండ్రి తనని దొరగారి దగ్గర పనిలో పెడతానంటే, తన తిండి బాధ్యతా, చదువు బాధ్యతా ఆయన తీసుకుంటానని, తండ్రికి నచ్చజెప్పి, అలాగే తీసుకున్నారు.
"తొమ్మిదేళ్లు వచ్చాయి, అక్షరాలైనా రావు" అని స్కూల్ వాళ్ళు చేర్చుకోకపోతే, ఓ ఏడాదిన్నర పాటు, అవిశ్రాంతంగా పాటుపడి డైరెక్ట్ గా ఫస్టు ఫారంలో జాయిన్ అవ్వడానికి ప్రవేశ పరీక్ష రాయించడానికి పూనుకున్నారు. ఆ ఏడాదిన్నరా ఇంట్లో అందరూ ఎవరికి వీలైనప్పుడు వాళ్ళు చదువు చెప్పడమే. అమ్మగారు మరీనూ... తెలుగు చదవడం, రాయడం, ఎక్కాలూ, నోటి లెక్కలూ, శతకాలూ అన్నీ చెప్పేవారు. మొత్తమ్మీద ఫస్ట్ ఫాం పరీక్ష పాస్ అయ్యాక,, పక్క ఊర్లో, సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో చేర్చి స్కూల్లో చేర్చారు. తను సెలవుల్లో, ఊరు వెళ్ళినా, పుస్తకాలన్నీ పట్టుకుపోయి, వాళ్ళింట్లోనే చదువుకునే వాడు, తెలియనివి చెప్పించుకునేవాడు.

తర్వాత ఆయనకి ట్రాన్స్ఫర్ అయిపోయింది. అమ్మ దూరం చుట్టం ఒకాయన.. బడ్డీ కొట్టు పెట్టుకుంటున్నాననీ, నమ్మకంగా కొట్లో కూర్చోవడానికి రమ్మనీ, అమ్మనీ, నాన్ననీ అడిగాడు. కొడుకుతో కలిసి ఉండొచ్చని వాళ్ళూ కూడా ఆ ఊరికి మారిపోయారు. అలా పల్లెటూరితో సంబంధం తెగిపోయింది. ఆ వేళ, ఆయన ఆ సాయం చెయ్యకపోతే, తను గొడ్లు కాసుకుంటూనో, దొరగారి పొలంలో పని చేస్తూనో ఉండేవాడు. అంతేకానీ, ఆఫీసరవడం కల్లో మాట అయిపోయేది. ఈ జీవితం ఆయన భిక్ష.

దూరం నుంచి మోహన్ రావడం చూసి, సత్తిబాబు గతం లోంచి బైటికొచ్చాడు. మోహన్ మొహం చూడంగానే అర్థం అయిపోయింది, ఫలితం ఆశాజనకం కాదని. మోహన్ని దిగబెట్టి, సత్తిబాబు ఇంటిదారి పట్టాడు ఏదో ఆలోచిస్తూ.

***

"ప్రకాశ భారతి" స్టేషనరీ కం లైబ్రరీ ప్రారంభోత్సవం. మోహన్, సత్తిబాబూ హడావిడిగా తిరుగుతూ, వచ్చిన పెద్దల్ని రిసీవ్ చేసుకుంటున్నారు. ఆ షాపులో పనికి కుదిరిన ఇద్దరు, అందరికీ కూల్ డ్రింక్స్ అవీ అందిస్తున్నారు. ఆ వార్డు కార్పొరేటర్ వచ్చి ముహూర్తం టైమ్ కి రిబ్బన్ కట్ చేసి, కొన్ని పుస్తకాలు కొన్నారు. చిన్న ఉపన్యాసం కూడా ఇచ్చారు. కొన్నేళ్ల క్రితం వాళ్ళిద్దరూ వచ్చి చిన్న పుస్తకాల షాప్

పెట్టుకుంటామంటే తను చేసిన సాయం గురించి చెప్పుకుని వీళ్లు ఇంకా వృద్ధిలోకి వస్తారని ఆశిస్తున్నానని చెప్పి, పండుగ సందర్భంగా ఇంకా చాలా ప్రోగ్రాం లు ఉన్నాయని, వెళ్ళిపోయాడు.

పక్కనే ఓ కుర్చీలో కూర్చుని ప్రోగ్రాం అంతా చూస్తున్న భారతమ్మ గారికి, కొన్నేళ్ల క్రితం సత్తిబాబు తమ ఇంటికి రావడం గుర్తుకొచ్చింది. మోహన్ ఉద్యోగ ప్రయత్నాలు చేసి నిరాశపడేకన్నా స్వంతంగా తక్కువ పెట్టుబడితో ఎక్కువ రిస్కు లేని వ్యాపారం చెయ్యమనీ, దానికి కావలసిన ఏర్పాట్లకి తను సాయం చేస్తాననీ చెప్పి ఒప్పించాడు. అలా.. ఒక స్కూలుకి దగ్గరగా స్టేషనరీ షాప్ పెట్టడానికి ప్రోత్సహించడమే కాకుండా, స్కూళ్ళకి తిరిగి ఆర్డర్లు సంపాదించి, వ్యాపారంలో నిలదొక్కుకోవడానికి తన వంతు సాయం చేసాడు. ఇప్పుడు తెలిసిన వాళ్ళ సాయంతో ఈ షాపింగ్ కాంప్లెక్స్ లో రెండు షాపులు అద్దెకు తీసుకునే స్థాయికి చేరుకున్నాడు మోహన్. అన్ని పుస్తకాలూ కొనుక్కోలేని స్టూడెంట్స్ కోసం లైబ్రరీ లాగా పెట్టడమే కాకుండా, పెద్ద వాళ్ళ కోసం కూడా పుస్తకాలు నామమాత్రపు రుసుముతో పెట్టాడు.
“అమ్మా” అన్న పిలుపుతో భారతమ్మ ఈలోకం లోకి వచ్చింది.
"అమ్మా! వీరేనమ్మా, నేను మొదట వ్యాపారం మొదలు పెట్టినప్పుడు, ఆర్డర్లిచ్చి ప్రోత్సహించడమే కాకుండా, ఇంకొంతమందికి చెప్పి ఆర్డర్లు ఇప్పించిన హెడ్మాస్టర్ గారు. చాలా సాయం చేసారు!" అని ఒక పెద్దాయన్ని చూపించాడు.
"మీరు చేసిన సాయం మరిచి పోలేమండీ!" అని భారతమ్మ ఇంకా ఏదో అనబోతూ ఉంటే, ఆయన మధ్యలో ఆపి,
"నేను చేసింది ఏముందమ్మా, కష్టే ఫలే.. అన్నారు. మీ వాడు కష్టపడ్డాడు, పైకొచ్చాడు. ఇంకా వృద్ధిలోకి వస్తాడు, చూస్తూ ఉండండి." అన్నారు.

భారతమ్మ, సత్తిబాబుని దగ్గరకు పిల్చి "ఇదుగోనండీ, దీనంతటికీ వీడిదే ప్రోద్బలం. వాడు కన్న కొడుకు, వీడు దేవుడిచ్చిన కొడుకు! అని చూపించింది. సత్తిబాబు సిగ్గు పడిపోయాడు.

ఇంతలో మోహన్ ఒక భగవద్గీత పుస్తకం తీసుకొచ్చి భారతమ్మ చేత మాస్టారికి ఇప్పించాక, సత్తిబాబూ, మోహన్ ఆయన కాళ్ళకి దణ్ణం పెట్టారు. ఆయన మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.

ప్రకాశం గారి ఫోటో వైపు చూసిన సత్తిబాబుకి ఆయన ఆప్యాయంగా నవ్వుతున్నట్టు అనిపించింది!

***0***

# తప్పటడుగు

**సత్యశ్రీ**



“అమ్మా సుమిత్రా! ఇంక వారం వారం ఆశ్రమానికి వచ్చే అవసరం లేదు కదమ్మా" వృద్ధాశ్రమంలోకి సుమిత్ర అడుగు పెట్టగానే మామ్మగారి పలకరింపుగా వినవడింది.

“మొన్నటి వరకు అత్తయ్యగారితో పాటు మాకు కావలిసినవన్నీ తెచ్చి పెడుతూ కబుర్లు చెప్పేదానివి. ఇంక కనిపించవా తల్లీ!" ఇంకో మామ్మగారు దీనంగా అడిగారు.

"నీలో మా కోడల్ని, కూతుర్లని చూసుకున్నాము. ఇంక నీకు ఇక్కడకు వచ్చే అవసరంలేదు కదా. నువ్వు రావంటే చాలా  కష్టంగా ఉంది తల్లీ !"  ఆశ్రమంలో ఇంకో పిన్నిగారి విచారం మాటల్లో కనబడింది.

అందరూ అలా పలకరించేసరికి  సుమిత్రకి దుఃఖం ఆగలేదు.

“అయ్యో! అలా అనకండి అమ్మా! మా అత్తయ్య ఎంతో.. మీరంతా కూడా అంతే! నాకు వీలయినప్పుడు తప్పకుండా వస్తూ ఉంటాను!" అంది సుమిత్ర కన్నీళ్ళతో.

అందరి దగ్గర శెలవు తీసుకుని, ఆశ్రమానికి కట్టవలసిన డబ్బులు కట్టి, అత్తగారితో ఇంటికి బయలుదేరింది సుమిత్ర.

సుమిత్ర ఇంటికి వచ్చింది కానీ మనసంతా ఏదో తెలియని అపరాధ భావంతో నిండిపోయింది. ఏ పనీ సవ్యంగా చేయలేకపోతోంది. అన్ని పనులు ఏదో లోకంలో ఉన్నట్లు చేస్తోంది. అందరికి భోజనాలు పెట్టి వంటగది అంతా సర్ది పడకగదిలోకి వచ్చి నడుము వాల్చింది.  భర్త శరత్ హాయిగా నిద్రపోతున్నాడు. తను ఎందుకు అలా ఉండలేకపోతోంది. బుర్ర అంతా ఆలోచనలతో గతంలోకి జారుకుంది.

తను అత్తగారింట్లో అడుగు పెట్టేసరికి అత్తగారు, మావయ్యగారు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు. శరత్ ఒక్కడే సంతానం వాళ్ళకు. తనని కూతురు కంటే ఎక్కువ ప్రేమగా అభిమానంగా చూసుకునేవారు. హాయిగా ఆనందంగా తెలియకుండానే సంవత్సరాలు గడిచిపోయాయి. ఆరాధ్యా, అభినవ్.. ఇద్దరి పిల్లలకి తల్లి అయ్యింది. మనవలతో ఆటలాడుకుంటూ తాతగారికి , మామ్మగారికి ఒక్కక్షణం తీరిక ఉండటం లేదు.

ఆ రోజు ఇంకా ఇప్పటికి గుర్తు తనకి...

"అమ్మా సుమిత్రా! ఆరాధ్యకి జలుబుగా ఉందనుకుంటా, కొద్దిగా జ్వరంగా కూడా ఉంది, ఏదన్నా మందు వేయమ్మా!"  అన్నారు సుమిత్ర మావగారు రాజశేఖరంగారు.

"ఏవండీ ఆఫీసు నుండి త్వరగా రావడానికి కుదురుతుందా? ఆరాధ్యకి జ్వరంగా ఉంది. హాస్పిటల్కి తీసుకువెళ్ళాలి!" అని భర్తకి ఫోన్చేసింది సుమిత్ర.

"నాకు కుదరదు సుమిత్రా! నువ్వు మీ అన్నయ్య వాళ్ళింటికి వెళ్ళి, అక్కడ నుండి డాక్టర్ దగ్గరకు వెళ్ళు. నేను ఆఫీస్నుండి వచ్చేటప్పుడు పికప్ చేసుకుంటా! " అన్నాడు భర్త శరత్.

మామూలు జ్వరమే కదా అనే ఉద్దేశ్యంతో తనూ సరే అంది. అన్నయ్యకి ఫోన్ చేసి డాక్టర్ అపాయింట్మెంట్ తీసుకోమని, వెంటనే రెడీ అయి అరాధ్యని, అభినవ్ని తీసుకుని అన్నయ్య వాళ్ళింటికి బయలుదేరింది సుమిత్ర.. డాక్టర్ టెస్టులు చేసి వైరల్ ఫీవర్ అని, జాగ్రత్తగా ఉండమనీ మందులు ఇచ్చారు. అన్నయ్య మందులు తీసుకుని వచ్చాడు .

"అమ్మా.. బయట అంతా వైరల్ ఫీవర్ ఎక్కువగా ఉంది. మీ ఇంట్లో చలిగాలి, దోమలు ఎక్కువ. పూర్వం పెంకుటిల్లు కదా! ఆరాధ్యకి తగ్గే వరకు ఒక వారం రోజులు ఇక్కడే ఉండచ్చు కదమ్మా!" అన్నాడు సుమిత్ర అన్నగారు.

తనకి అదే కరెక్ట్ అనిపించి, "హలో అత్తయ్యా! ఆరాధ్యని డాక్టర్ గారికి చూపించాను. మందులు రాసారు, వైరల్ ఫీవర్ అన్నారు. నాకు కంగారుగా ఉంది. కొద్దిగా తగ్గేవరకు ఇక్కడ ఉందామనుకుంటున్నాను. మీరేమంటారు?" అని సుమిత్ర అత్తయ్యగారికి ఫోన్చేసి అడిగింది.

"ఎందుకమ్మా అక్కడ పిల్లతో.. ఏం ఇబ్బంది పడతావు! కావాలంటే డాక్టర్ దగ్గరకి ఎంతసేపు వెళ్తావు. ఇక్కడ మాకు కంగారుగానే ఉంది. సాయంత్రం అబ్బాయితో వచ్చేసెయి తల్లీ!" అన్నారు సుమిత్ర అత్తగారు విశాలాక్షిగారు.

సుమిత్ర ఇంకేమి మాట్లాడకుండా భర్తతో ఇంటికి తిరిగి వచ్చేసింది.

అన్నగారు దోమలు అని చెప్పడంతో గదుల్లో దోమల చక్రాలు అన్ని వైపులా పెట్టి తలుపులు అన్ని మూసేసింది. ఆరాధ్యకి బాగోకపోవడంతో అభినవ్ ని తాతగారు, మామ్మగారి దగ్గర పడుకోపెట్టారు.

ఉదయం లేచేసరికి జ్వరం తగ్గలేదు సరికదా, ఆయాసం కూడా ఎక్కువ అయ్యింది. గబగబా తను, భర్త ఆరాధ్యని తీసుకుని హాస్పిటల్కి వచ్చేసారు. డాక్టరుగారితో అన్నయ్యకి పరిచయం ఉండటం వల్ల వెంటనే లోపలకి పిలిచి, పిల్లని చూసారు. "నూటమూడు ఫీవర్ ఉంది, ఆయాసం కూడ ఎక్కువగా ఉంది. భయపడవలసినది ఏం లేదు గాని, వెంటనే హాస్పిటల్లో అడ్మిట్ చెయడం మంచిది!" అంటూ డాక్టర్ గారు మా వైపు చూసారు. ఆరాధ్యని వెంటనే జాయిన్ చేసేసాం.

అన్నయ్య ఇంటికి ఆ హాస్పిటల్ దగ్గరే.. హాస్పిటల్ కి వెళ్లి రావడానికి సులువుగా ఉంటుందని, అందరం అక్కడికి వచ్చేసాం. వారం రోజులు అందరికీ కాళరాత్రే అయ్యింది. ఎలాగో గండం గడిచింది. అరాధ్య బ్రతికి

బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నాం. 'ఓ రెండు రోజులు ఇక్కడే స్థిమితపడి వెళ్ళండి' అని అన్నయ్య అనడంతో అక్కడే ఉన్నాం.

ఆ రోజే..

"అమ్మా సుమిత్రా! ఇలారా తల్లీ! నీతో కొంచెం మాట్లాడాలి" అని సుమిత్రని పిలిచారు రాజశేఖరంగారు.

"ఏంటి మామయ్యగారు, ఏదో ఆలోచిస్తున్నట్లున్నారు. మీకు వంట్లో బానే ఉందా?" అంది సుమిత్ర.

"అమ్మా సుమిత్రా! నేను మీ అత్తయ్య బాగానే ఉన్నాం గాని, ఓ విషయం చెపుతా.. వినమ్మ. ఎలాగు ఈ సంవత్సరం ఆరాధ్యని స్కూల్లో జాయిన్చేయాలి కదా. మన ఇల్లు ఊరి పొలిమేరలో ఉంది, అక్కడ సౌకర్యాలు అంతగా లేవు. ఇక్కడే ఇల్లు తీసుకుని మీరూ ఉండండి. నేను అత్తయ్య అక్కడే ఉంటాం.. మేము అప్పుడప్పుడు వస్తూ ఉంటాము." అన్నారు సుమిత్ర మామగారు రాజశేఖరంగారు.

ఆ విషయం రెండు మూడు సార్లు అయన, అత్తయ్యగారు చెప్పడంతో సుమిత్రకి తప్పలేదు. స్కూల్ కి దగ్గరలోనే ఇల్లు చూసుకుని వేరే కాపురం పెట్టిసారు. అంత మాత్రంగా వారి మధ్య అపోహలు, పొరపచ్చాలు రాలేదు. అప్పుడప్పుడు అత్తమామలు వస్తూ వెళ్తూ ఉండటంతో రోజులూ, సంవత్సరాలు ఇట్టే గడిచి పోతున్నాయి.

పిల్లలు ఇద్దరూ స్కూల్కి వెళ్తూ ఉండటంతో, తను డిగ్రీ చేసి టీచర్ ట్రైనింగ్ చేసి ఉండటంతో, ఖాళీగా ఉండటం ఎందుకని తను కూడా స్కూల్లో జాయిన్ అయ్యింది.

మామయ్యగారు ఆరోగ్యంగానే ఉన్నా, అత్తగారికి కాళ్ళనొప్పులతో మంచంమీద నుండి కదలలేని పరిస్థితి వచ్చేసింది.

"మీరిద్దరూ ఇక్కడికి వచ్చేయండి మావయ్యా. మీరొక్కరు అక్కడ ఏం ఇబ్బంది పడతారు?" అంటూ సుమిత్ర మావగారికి అప్పడప్పుడు చెప్తూనే ఉంది.

"వద్దులే అమ్మా! ఇక్కడ ఆవిడతో నా పాట్లు ఏవో నేను పడతాను. నా తర్వాత మీకు ఎలాగూ ఆవిడని చూడక తప్పదు. ఇప్పటి నుండి మీ మీద భారం పెట్టదలుచుకోలేదు" అనేవారు సుమిత్ర మావగారు రాజశేఖరంగారు.

పెద్దవాళ్ళని ఒక్కళ్ళని వదిలేసామని మనసులో బాధగానే ఉన్నా, తన స్కూల్, పిల్లల చదువుల కారణంగా తను ఇంకేమి మాట్లాడలేకపోయేది. తన భర్తకి ఇవేమీ అక్కరలేదు. తన పనేదో తనదే. ఏదన్నా చెప్తే అవునా అలాగా నీకు ఎలా నచ్చితే అలా చేయి అంటాడు. తను తప్పు చేస్తున్నానేమో అనే ఫీలింగ్. బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది వసుధ. వచ్చే నెలలో కొంచం పెద్ద ఇంట్లోకి మారి, అత్తమామలని కూడా తీసుకువచ్చేయాలని నిర్ణయించుకుని హాయిగా ఊపిరి పీల్చుకుంది.

రోజులాగే స్కూల్ కి రెడీ అవ్వబోతూ ఉంటె అత్తగారి నుండి ఫోన్ .

"హల్లో అత్తయ్యా! చెప్పండి? ఇప్పుడు ఫోన్చేసారేంటి? అంతా బాగానే ఉన్నారు కదా" ఆతృతగా అడిగింది సుమిత్ర . 'ఆ టైములో ఎప్పుడు వాళ్ళ నుండి ఫోన్ రాదు' అనుకుంటూ. ఫోన్ భర్తకి ఇచ్చింది.

"హల్లో నాన్నా శరత్, నాన్నగారు కాలుజారి గడపమీద పడిపోయారు. నాకు చాలా కంగారుగా ఉంది. ప్రక్కింటి అబ్బాయి వచ్చి మంచం మీద పడుకోబెట్టాడు. తొందరగా రాగలవా!" అన్నారు ఆవిడ అవతలనుండి ఫోన్లో.

"సరే అమ్మా! నేను సుమిత్ర ఇప్పుడే బయలుదేరి వస్తాము. నువ్వేం కంగారు పడకు!" అని ఫోన్ పెట్టేసాడు శరత్.

గబగబా పిల్లల్ని వదిలి ప్రక్క వాళ్ళకి చూస్తూ ఉండమని చెప్పి బయలుదేరి వెళ్ళారు ఇద్దరూ. తలకి బలంగా దెబ్బ తగలడం వల్ల , కొద్దిసేపట్లోనే మామయ్యగారు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.

అన్నయ్యకి ఫోన్చేసి పిల్లల బాధ్యత అప్పగించి, బంధువులందరికీ కబురు చేసి, కార్యక్రమాలన్నీ ముగించారు. ఓ నాలుగు రోజులు గడిచాక, అత్తయ్యగారు కొద్దిగా తేరుకున్నాక, ఆవిడ సామాన్లన్నీ సర్దేసి తమతో పాటే ఇంటికి తీసుకు వచ్చేసారు.

విశాలాక్షిగారు మంచంమీద నుండి లేవలేకపోవడం వల్ల, ఆవిడ పనులన్నీ దగ్గరుండి తనే చూసుకునేది సుమిత్ర. కాలకృత్యాలన్నీ తనే దగ్గరుండి చేయించి, అవన్నీ తనే శుభ్రం చేసేది. స్నానం చేయించి చీర కట్టి జాగ్రత్తగా మంచం మీద పడుకోబెట్టి, తను స్నానం చేసి, అన్ని పనులు చూసుకుని పిల్లలని, స్కూల్కి పంపి, అత్తగారికి కావలసినవన్నీ దగ్గరగా టేబులు మీద సర్ది, తాను స్కూల్ కి వెళ్ళేది.

"అమ్మా! ఈ మొబైల్ని దగ్గర ఉంచుకో. ఇందులో నా నెంబరు, సుమిత్ర నెంబరు, ఇంకా మీ అక్కచెల్లెళ్ళవి, అన్నదమ్ములవి వాళ్ళ పిల్లలవి నెంబర్లు కూడా ఉన్నాయి. అర్జంట్ అయితే ఎవరికైనా వెంటనే ఫోన్చేయడానికి వీలుగా ఉంటుంది!" అన్నాడు శరత్ ఒకరోజు తల్లికి మొబైల్ ఇస్తూ.

మావగారు లేకపోవడంతో సొంత ఇంటిని చూడటానికి వీలులేకపోవడంతో, నాలుగు వాటాలుగా చేసి అద్దెకి ఇచ్చేశాడు శరత్. దాని మీద వచ్చే అద్దెలు తల్లి పేర ఎకౌంటు తీసుకుని, దాని లోనే వేసేవాడు. తల్లి పొలం ఏదో ఉంటే అది కూడా అమ్మేసి, ఆ డబ్బులు కూడా అకౌంట్లో వేసాడు. బ్యాంకు లోన్ తీసుకుని, పెద్ద అపార్టుమెంట్ తీసుకుని అందులోకి మారిపోయారు.

స్కూల్లోగానీ, ఇంట్లోగాని ఎంత పని ఉన్నా అత్తగారిని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు సుమిత్ర. అనుకోకుండా పరిస్థితుల్లో మార్పు వచ్చేసింది. సుమిత్ర ఎందుకో మూడీగా ఉండటం గమనించాడు శరత్. స్కూల్లో ఒత్తిడి అని ఊరుకున్నాడు. అత్తగారి పనులు ఎంతో శ్రద్ధగా చేసే సుమిత్ర, ఆవిడ ఒకటి నాలుగు

సార్లు చెప్పిన పట్టించుకోక పోవడం గమనించాడు శరత్. పిల్లల మీద ఊరికే విసుక్కోవడం, అత్తగారి విషయంలో కూడా విసుక్కుంటూ పనిచేయడం.. ఎందుకో చాలా ఇబ్బందిగా అనిపించింది శరత్ కి!
రెండ్రుజులు అలోచించి, శరత్ ఓ నిర్ణయానికి వచ్చాడు.
"సుమిత్రా! నేను ఒకటి ఆలోచించాను. అమ్మని వృద్ధుల ఆశ్రమంలో చేర్పిద్దాం అనుకుంటున్నాను. మంచం మీద ఉన్న వాళ్లని చూసుకోవడానికి ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయట. నువ్వేం అంటావు?" అన్నాడు ఒకరోజు రాత్రి పడుకోబోతూ, తను ఒప్పుకోదని పూర్తి నమ్మకంతో.
"అవునా! చాలా మంచి నిర్ణయం తీసుకున్నారండీ. నేను చెప్తే మీరేమనుకుంటారో అని చెప్పలేదు. అలాగే చేద్దాం. రేపే వెళ్ళి చూసొద్దాం!" అంది సుమిత్ర.
ఆశ్చర్యపోయాడు శరత్. తనకి తెలిసిన సుమిత్ర కాదు. ఏదో జరిగింది. అందరి ఆడవాళ్ళలానే తన సుమిత్ర కూడా మారిపోయిందా అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు.
దగ్గరుండి మరీ ఆశ్రమాన్ని చూసి వచ్చి, అన్ని మాట్లాడి మంచి రోజు చూసి అమ్మని చేర్పించే వరకు వదలలేదు సుమిత్ర.
కళ్ళు మూసి తెరిచేలోగా సంవత్సరం గడిచిపోయింది. తను ఒక రోజు కూడా అత్తగారిని చూడటానికి వెళ్ళలేదు.
ఒక రోజు శరత్ ఆశ్రమం ఉండి వస్తూనే "అమ్మ చాలా నీరసంగా కనిపిస్తోంది, నిన్ను చూడాలంటోంది. ఒకసారి అమ్మని చూసి రాకూడదా!" అన్నాడు సుమిత్రతో.
ఇంక తప్పదు అన్నట్లు, ఆ రోజు సాయంత్రమే ఆశ్రమానికి వెళ్ళింది అత్తగారిని చూడటానికి.
అత్తగారు మంచం మీద నిస్తేజంగా పడుకోవడం, అక్కడ వాతావరణం, అశుభ్రత చూసి మనస్సు తరుక్కుపోయింది సుమిత్రకి. ఏడుపు వచ్చేసింది. తను ఇంత మూర్ఖత్వంగా ఎలా చేయగలిగింది. అంత నిర్దాక్షణంగా అత్తగారిని వదిలేసిందా తను. దేవుడు తనని క్షమిస్తాడా అసలు. మావయ్యగారికి ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయానే' అనుకుంటూ...
"అత్తయ్యా! ఎలా ఉన్నారు?" అని పలకరించింది అపరాధభావంతో.
"అత్తయ్య ఇక్కడ ఇంక ఒక్క క్షణం కూడా ఇక్కడ ఉండద్దు. పదండి మనం ఇంటికి వెళ్ళిపోదాం" అంది అత్తగారితో సుమిత్ర.
"సుమిత్రా! వద్దమ్మా. ఇంతకు ముందు పరిస్థితి వేరు, ఇప్పుడు వేరు! నన్ను చూడటం నీకు చాలా ఇబ్బంది తల్లీ. ఇక్కడ వీళ్ళందరి మధ్య నాకు చాలా హాయిగానే ఉంది. కాకపోతే నిన్నే చూడలేకపోయాను!" అన్నారు అత్తగారు. అక్కడ ఉన్నవారందరికీ తనని పరిచయం చేసారు. అందరూ తనతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతున్నారు.

"మీ అత్తగారు ఎంతసేపు నీ గురించి, మీ ఆయన గురించి, పిల్లల గురించే మాట్లాడతారు. మాకు అందరికీ రోజూ రామాయణం, భారతం అన్నీ చదివి వినిపిస్తుంటారమ్మ. ఆవిడ వచ్చాక మాకు కొత్త వెలుగు వచ్చింది!" అన్నారు అక్కడి ఆశ్రమంలో ఒక మామ్మగారు.

ఆశ్రమ నిర్వాహకులతో మాట్లాడి అంతా దగ్గరుడి శుభ్రం చేయించింది. ఆ రోజు మొదలు ప్రతీ వారం పిల్లల్ని కూడా తీసుకుని వెళ్ళడం, అక్కడి వాళ్ళందరితోనూ ఆనందంగా గడపటం అలవాటయిపోయింది.
సుమిత్రలో వచ్చిన మార్పు చూసి, శరత్ ఆశ్చర్య పోయాడు. అదే అడిగాడు.
సుమిత్ర ఓ ఉత్తరం భర్తకి ఇచ్చింది. పది రోజుల కిందట వచ్చిన ఉత్తరం అది.

> "అమ్మా సుమిత్రా! నువ్వెంత మంచి దానివో నాకు తెలుసు. నన్ను కన్నతల్లి కంటే ఎక్కువగా చూసుకున్నావు. కానీ నేను నా పెద్దరికం నిలబెట్టుకో లేకపోయాను. ఆ రోజు నువ్వు ఫోన్లో మా అక్క కొడుకుతో 'బ్యాంక్లో నా డబ్బు వాడేరో ఉన్నయో ఒకసారి చూసి చెప్పమని' అడగడం.. నువ్వు విన్నావని అర్థమయ్యింది. ఏం చేయను తల్లీ! వాళ్ళ మాటలు, వీళ్ళ మాటలు నమ్మి, టివి సీరియల్స్ చూసి, మీరు కూడా అలా మారిపోతారేమో అని భయం వేసింది. తర్వాత నీ ప్రవర్తనలో మార్పు వచ్చింది. కానీ నీకు కృతజ్ఞతలు చెప్పాలి. ఈ విషయం మా అబ్బాయికి చెప్పనందుకు. వాడికి తెలిసి ఉంటే వాడూ నాకు దూరమయ్యే వాడేమో. నేను ఆశ్రమంలో ఏనాడు బాధపడలేదు. అక్కడ వారందరితోనూ హాయిగా గడుపుతున్నాను. నా తర్వాత కూడా నీకు వీలయితే వాళ్ళని చూస్తూ ఉండు"

ఉత్తరం చదివిన శరత్ ఓ చిరునవ్వు నవ్వాడు.
"అదేమిటి.. మీకు ఏమి అనిపించలేదా?" సుమిత్ర భర్తని సూటిగా అడిగింది.
"ఇందులో అనిపించడానికి ఏమి కనిపించలేదు! ఇది చాల సహజమే.. అమ్మ ఎంక్వయిరీ చేసిన విషయం నాకూ తెలుసు. కాని ఆ వయసులో అందరికి ఆ భయం ఉంటుంది! ఈ విషయంలో ఏ తల్లి తండ్రిని, ఏ పిల్లలు అపార్థం చేసుకోకూడదు. రేప్పొద్దున్న మనం కూడా ఇలాగే ఆలోచిస్తాం! అయితే.. ఈ విషయం నీకు సమయం వచ్చినప్పుడు చెప్పాలని ఎదురు చూస్తున్నాను. ఆ సమయాన్ని కూడా అమ్మే చూపించింది!"
సుమిత్ర భర్త కళ్ళల్లోకి సూటిగా చూడడానికి, కన్నీళ్ళు అడ్డొచ్చాయి!
"ఏవండీ! అత్తయ్యగారి ఇంటికి తీసుకు వచ్చేద్దాం. నేను ఉద్యోగానికి రాజీనామా చేసి, ఆ ఆశ్రమ భాద్యతలని తీసుకుంటాను. అత్తగారి డబ్బులు ఆశ్రమానికి ఖర్చు పెడదాం!" కళ్ళు ఒత్తుకుంటూ సుమిత్ర భర్తతో అంది.
"మీ ఆడవాళ్ళని అర్థం చేసుకోవడం చాలా కష్టం! నీ అంతట నువ్వే ఆవిడని ఆశ్రమంలో పెట్టావు. మరలా నువ్వే తీసుకువచ్చే ప్రయత్నం చేసావు. ఇప్పుడు మరలా, ఇంతమంది బాధ్యతా తీసుకుంటానని

అంటున్నావు. నీ ఆశయానికి నేను ఎప్పుడు అడ్డురాను. నీకు ఏది మంచిది అనిపిస్తే అదే చేయి!" అంటూ ఓ నిమిషం ఆగి, మళ్ళీ తనే అడిగాడు.

"ఇంతకీ ఈ నిర్ణయం వెనుక అంతరార్థం ఏమిటో..?"

"మనం చేసే పనులే, మన పిల్లలకి అలవడుతాయి. మన అడుగుజాడలలో వాళ్ళు నడుస్తారు. రేప్పొద్దున్న అత్తయ్యగారి పరిస్థితి మనకు రాకుడదంటే, నేను వేసిన తప్పటడుగుని వాళ్ళు అనుసరించ కూడదు. అందుకు నా అడుగుల్ని దిద్దుకుంటున్నాను!! పదండి.. ఆశ్రమానికి వెళ్దాం!" అంటూ బయలుదేరిన సుమిత్రని అనుసరించాడు శరత్.

***0***

కథా మంజరి

# ఆ 'మరణం'



## వాణి శ్రీనివాస్ గొర్తి

సాయంత్రానికల్లా కార్యక్రమాలన్నీ పూర్తయ్యాయి. ఇంటికొచ్చి స్నానాలు చేసేసరికి చీకటి పడుతోంది.

"దీపాలు పెట్టేవేళ కావస్తోంది. ఇక మనం బయల్దేరదాం." అన్నాడు రమణ

ఇంటివాళ్ళతో చెప్పి వెళ్ళేది కాదు కాబట్టి, వీధి వాకిట్లో నిలబడి రాఘవ కొడుకు రామం మొహం వంక చూశాను. పొంగుకొస్తున్న దుఃఖాన్ని బిగబట్టటం వల్లనేమో కంఠం వాచినట్టుంది. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. తండ్రి పోయిన దుఃఖాన్ని దిగమింగుకుంటున్నాడు పాపం! కాలమే గాయాన్ని మాన్పుతుంది. మనసు మెల్లగా అలవాటు పడిపోతుంది.

చిన్నకొడుకు కడసారి చూపుక్కూడా రాలేకపోయాడు... అతనికి ఇంకా పర్మిషన్ రాలేదుట.

రమణా నేనూ బస్టాండుకి వచ్చి బస్సెక్కాము. టిక్కెట్టు డబ్బుల కోసం జేబు తడిమాను. జేబులో వందనోటు బయటకు తీయబోతే, నాలుగు మడతలు పెట్టిన తెల్ల కాగితం చేతిలో కొచ్చింది. ఉత్తరంలా వుంది.

నా జేబులో ఎవరు పెట్టారు దీన్ని? అసలు ఇందులో ఏముంది? మడత విప్పబోయా.

"టికెట్ సార్" అంటూ కండక్టర్ నా దగ్గరకొచ్చాడు.

రమణ ఇచ్చేలోపు వంద తీసి నేనే ఇచ్చాను.

"దిగేటప్పుడు చిల్లర తీసుకోండి సార్!" అని టికెట్ మీద రాసిచ్చాడు.

"రాఘవ నాకంటే చిన్న. అయినా నాకంటే రెండు నెలలు ముందే రిటైర్ అయ్యాడు. అరవై ఏళ్లకే గుండెపోటు రావటం దారుణం! విశ్రాంత ఉద్యోగి ఇలా శాశ్వతంగా విశ్రాంతి తీసుకుంటాడనుకోలేదు!" బాధపడుతూ అన్నాడు రమణ.

"మా ఇద్దరికీ ఆరు నెలలు తేడా. కానీ ఒకేసారి ఇద్దరం ఉద్యోగంలో చేరాం. అప్పటికే రాఘవకి ఇద్దరు పిల్లలు. నాకు పెళ్లి కావటం లేటయ్యింది!" అన్నాను

"అవును, రాఘవ పిల్లలు చేతికి అందొచ్చారు. పెద్ద కొడుక్కి పిల్లలు కూడా ఉన్నారు. కుటుంబంతో సహా త్వరలో సింగపూర్ వెళ్లటానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాడుట. 'వాడితో నేనూ వెళ్లిపోతాను. మిమ్మల్ని

మళ్లీ ఎప్పుడు కలుస్తానో? వీడియో కాల్స్ చేయండి. నన్ను మర్చిపోకండి' అని చెప్పాడు. ప్రయాణానికి ఏర్పాట్లు కూడా చేసుకుంటుండగా ఇలా అయింది. పాపం, చిన్నవాడు కాశ్మీర్ లో వుంటున్నాడు. సమయానికి రాలేకపోయాడు. రాఘువకి బీపీ, షుగర్ కూడా లేవు. ఉక్కు శరీరం. అలా ఎలా జరిగిందో?" అన్నాడు రమణ.

"నిందలేనిదే బొంది పోదు. వాడికి అప్పుడే నూకలు తీరిపోయాయి. మృత్యువు ఈ రూపంలో వచ్చింది." అన్నాను వైరాగ్యంగా.

"అంతా దైవేచ్ఛ! మన జీవితాలు ఎట్లా ముగుస్తాయో? రాఘువకి బాధ్యతల్లేవు. నీకూ, నాకు తండ్రి బాధ్యత ఇంకా తీరలేదు. తమ్ముళ్లూ వున్నారు. ఇద్దరు పిల్లలు. వాళ్ళ పెళ్లిళ్లు కూడా చెయ్యాలి. అటూ ఇటుగా ఒకే వయసు వాళ్ళలో ఒకళ్ళు చనిపోతే, మరొకళ్ల మానసిక స్థితి వర్ణనాతీతం!" అన్నాడు రమణ నిట్టూరుస్తూ.

బస్సులోకి చలిగాలి వస్తోంది. ఇద్దరికీ కళ్ళు మూతలు పడుతున్నాయి. రమణకి నిద్ర పట్టినట్టుంది. నాకు నిద్ర రావటం లేదు. ఉత్తరం గుర్తొచ్చింది.

జేబులోంచి బయటకు తీసి మడతలు విప్పాను.

"అన్నయ్యా! వన్ సైడెడ్ గా నువ్వు తీసుకున్న నిర్ణయాన్ని చిన్నవాడిగా నేను కాదనలేకపోయినా అది తప్పు అని చెప్పలేనంత చిన్నవాణ్ణి మాత్రం కాను."

ఇదేవిటి? నా తమ్ముడు నాకెప్పుడు ఉత్తరం రాసాడు? ఆశ్చర్యంగా ముందూ వెనకా తిప్పి చూశాను. చిరునామా లేదు. నాలుగు రోజుల క్రితం తారీఖు వేసి ఉంది. మళ్లీ చదవటం మొదలుపెట్టాను.

"అమ్మ పోయాక నాన్న రెండో పెళ్లి చేసుకోకుండా మనల్ని పెంచటానికే జీవితాన్ని ధారపోశారు. నేను ఆయన దగ్గర లేకపోయినా, పెద్ద కొడుకువి నువ్వున్నావన్న నమ్మకం, ధైర్యం ఆయన్ని నడిపిస్తోంది. నీ అప్పులు తీర్చుకోవటానికి నాన్నతో సంతకం పెట్టించుకుని ఆయన ప్రాణంగా, అమ్మకు ప్రతిరూపంగా చూసుకునే ఇంటిని అమ్మేశావని నాన్నకు తెలీదు! నాన్న రిటైర్ అయ్యారు, వచ్చి తీసుకు వెళ్లమని ఉత్తరం రాశావు. ఎక్కడికని తీసుకుపోను...

నా యింటికా? శత్రువుల గుండెలే నా యిల్లు. మృత్యు కౌగిలి నాకు ఆప్తులూ, అయిన వాళ్ళూ. నాదంటూ ఏదీలేదు. నన్నంటి పెట్టుకున్న ఈ సైనిక దుస్తులు తప్ప. నాకు ఆస్తి వద్దని ఆనాడే చెప్పాను. మిగిలినదంతా నీదే అన్నప్పుడు నాన్నని అనాధ శరణాలయంలో చేర్చాల్సిన అవసరం ఏమొచ్చింది? నీ భార్యకూ, పిల్లలకూ నాన్న నచ్చట్లేదని చెప్పావు. ఇక్కడి విషయాలు అక్కడ, అక్కడివి ఇక్కడ చేరేస్తారని, ఇంటి విషయాల్లో ఎక్కువ జోక్యం చేసుకుని తగాదాలు పడుతున్నారన్నావు.

అది ఆయన వయసు రీత్యా వచ్చిన అభద్రతా భావం. నీకు సంబంధించిన ప్రతి విషయంలో తన జోక్యం ఉండాలని, అందులో తన ఉనికిని చాటుకునే ప్రయత్నం. తనని మీరు ఇంకా ఎక్కువగా పట్టించుకోవాలని, తన ప్రాధాన్యతను గుర్తించమని చెప్పే సంకేతం కూడా.

ఆయన మనసులో మాట చెప్పుకునేందుకు అమ్మ ఎట్లాగూలేదు. ఇప్పుడు నువ్వు కూడా కుటుంబంతో విదేశాలకు వెళ్ళిపోతే, ఒంటరితనం ఆయన మనసుని ఎంతగా కాల్చేస్తుందో ఒక్కసారి ఆలోచించు!

నీ భార్యా పిల్లలకు ఏదో విధంగా నచ్చచెప్పు. నాలుగు రోజుల్లో నువ్వు ఇండియా వదిలేస్తున్నావు. నాన్న బాధ్యతను మాత్రం వదిలిపెట్టకు!

నా శరీరాన్ని సరిహద్దు రక్షణ కోసం నిత్యం దద్దరిల్లే కాల్పుల మధ్య, ఏదో రోజు ఈ మరుభూమి లోనే కన్నుమూస్తాను. మాతృభూమి ఋణం తీర్చుకుంటాను.

నువ్వు కూడా పితృ ఋణం తీర్చుకుంటావని మనసారా నమ్ముతున్నాను!!"

ఉత్తరం చదవటం పూర్తయ్యింది. ముచ్చెమటలు పోసాయి నాకు. ఈ ఉత్తరం నాకు ఎవరు రాశారు? ఎన్వలప్ కవర్ లో పెట్టి పంపి వుంటారు. ఈ ఒక్క పేజీ మాత్రం నా జేబులోకి ఎలా వచ్చింది?

నా చొక్కా తడిమి చూసుకున్నాను. నాకర్థమైంది. ఈ చొక్కా నాది కాదు. మరెవరిది? బాగా ఆలోచించాను. మధ్యాహ్నం నా చొక్కా విప్పి రాఘవ గదిలో ఉన్న కొక్కానికి తగిలించి స్నానానికి వెళ్ళాను. మళ్లీ సాయంత్రం వచ్చి తొడుక్కున్నాను. చొక్కా మారిపోయింది. చీకట్లో చూసుకోలేదు. అదే తెల్ల చొక్కా. చిక్కుముడి విడిపోయింది!!

అంటే రాఘవ గుండెపోటు వెనకాల అసలు కారణం ఇదా? ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ వుండే రాఘవ మనసులో ఇంత వేదన ఉందా? నా మనసంతా బాధతో నిండిపోయింది!

రమణ ముందు స్టాపులో దిగిపోయాడు

కండక్టర్ నాకు ఇవ్వాల్సిన చిల్లర బాకీ సంగతి మర్చిపోయి, బస్సు దిగి ఇంటికి వచ్చేశాను.

ఒంటిమీద బట్టలతో సహా బావి దగ్గర తలారా స్నానం చేసి, పొడి తుండు కట్టుకుని లోపలికొచ్చాను.

"వచ్చావా! వెళ్లిన పని అయ్యిందా?" అన్నారు నాన్న.

"అయ్యింది!" అన్నాను ముక్తసరిగా.

"అలా ఉన్నావేం? ఏదైనా ఇబ్బందా? నాతో చెప్పు. మీ ఆవిడ ఎవన్నా అందా?" అన్నారు.

"అదేం లేదు." అన్నాను.

"సరేలే నాకెందుగ్గానీ, నీ దగ్గర నా ఆరునెలల గడువూ పూర్తయ్యింది. నా బట్టలూ మందులూ సర్దేసుకున్నాను. నీకు ఎప్పుడు ఖాళీ దొరికితే అప్పుడు తీసుకెళ్లి మీ తమ్ముడి దగ్గర దింపు. నేను సిద్ధంగా ఉన్నాను!" అన్నారు నాన్న.

"వద్దు.  ఇక్కడే ఉండిపోండి. ఈ వయసులో అటూ ఇటూ తిరగలేరు!" అన్నాను .
"కొడుకులకు ప్రేమ ఉంటుంది నాయనా.  నాన్నను నాతోనే ఉంచుకోవాలనే ఆశా వుంటుంది.  నాకూ ఈ తిరుగుళ్లు లేకుండా ఒకేచోట ఉండాలని ఉంది. కానీ అప్పసం ఒక్క చోటే ఉంటే,  నీ భార్య, పిల్లలూ నావల్ల బాధ పడతారు.  మీరిద్దరూ పంచుకున్నాక, బతికున్నన్నాళ్ళూ తిరుగుతూ ఉండటానికి నా మనసుకు నేనే నచ్చచెప్పుకుంటున్నాను!" అన్నారు నాన్న.
"వాళ్ళకి నేను నచ్చచెప్పుకుంటాను. మీరు ఇక్కడే ఉండండి.  పెద్ద కొడుగ్గా మీ బాధ్యత నాది!  మిమ్మల్ని చూడాలనుకున్నప్పుడు తమ్ముడే ఇక్కడికి వస్తాడు!" అన్నాను దృఢంగా.
భరోసాగా ఫీలయ్యారు నాన్న.
తృప్తిగా చూసారు  నావంక.. !!

***0***

కథా మంజరి



# కొత్త చిగురు

## లక్ష్మి చివుకుల

గౌతమి ఎక్స్ ప్రెస్ ప్లాట్ ఫామ్ మీదకి వచ్చి ఆగింది. అందులో తన బోగీ వెతుక్కుంటూ ముందుకు నడిచారు నారాయణమూర్తి గారు. తన భోగీ వెతుక్కుని సీటు నెంబర్ ఒకటికి రెండు సార్లు చూసుకుని, పై కండువాతో ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ ఆ కంపార్ట్ మెంట్ అంతా పరికించి చూసారు.

అందరూ లగేజీలు సర్దుతూ సూట్ కేసులు, బేగ్ లు బెర్త్ క్రిందికి తోయడంలో బిజీగా వున్నారు.

'ఇంటి దగ్గర భార్య, కొడుకు ఎలా ఉన్నారో' అనుకుంటూ సీట్లో కూలబడ్డారు నారాయణమూర్తి గారు.

కబుర్లు చెప్పుకుంటూ, తెచ్చిన సామాను సర్దుకుంటూ ఎవరి హడావిడిలో వాళ్ళున్నారు. అప్పుడు చూసారు నారాయణమూర్తి గారు.. ఎదురుగా ఉన్న బెర్త్ మీద కూర్చున్న ఒకమ్మాయి మాత్రం ఎవరితో సంబంధం లేనట్టుగా కళ్లు మూసుకుని ఏదో ఆలోచిస్తోంది. నారాయణమూర్తిగారు బేగ్ లోంచి టిఫిన్ తీసి తినబోతూ, ఆ అమ్మాయిని అడిగారు.

"అమ్మా.. కొంచెం టిఫిన్ తింటావా!"

"వద్దండీ!" ఆ అమ్మాయి గొంతులో కొంచెం దుఃఖపు ఛాయలు కనిపించాయి..

ఆయన టిఫిన్ తినేసి, మంచి నీళ్లు తాగి నిద్ర పోవడానికి సిద్ధంగా వున్నారు. అందరు మెల్లగా నిద్రలోకి జారుకుంటున్నారు. ఆయన కూడా బలవంతంగా కళ్లు మూసుకున్నారు. ఆయన కలత నిద్రలో కూడా భార్య, కొడుకు గుర్తుకు వచ్చారు.

ఆయన మధ్యలో బాత్ రూముకి వెళ్దామని లేచారు. ఆ అమ్మాయి అలాగే కూర్చొని వుంది. ఎక్కినపుడు ఎలా వుందో.. ఇప్పుడు అలాగే కూర్చొని వుంది. ఏంటో ఆ అమ్మాయి కొచ్చిన కష్టాలు! ఒక్కొక్క మనిషికి ఒకో రకం కష్టాలు పెడతాడు భగవంతుడు... మనసులో అనుకుంటూ, బాత్ రూముకి వెళ్లేరు.

వచ్చేటప్పటికి ఆ అమ్మాయి అక్కడ కనిపించలేదు. ఇప్పుడు ట్రైన్ రన్నింగ్ లోనే వుంది. ఏ స్టేషన్ లోను ఆగటం లేదు. ఆ అమ్మాయి బాత్ రూమ్ దగ్గర కూడా కనిపించలేదు. ఆయన మనసు ఎందుకో కీడును శంకిస్తోంది!!

గబగబా డోర్ దగ్గరకు వెళ్లేరు. ఆయన ఊహించినట్టుగానే రన్నింగ్ ట్రైన్ లో డోర్ తీయడానికి ట్రై చేస్తోంది ఆ అమ్మాయి.

"ఏం చేస్తున్నావమ్మా?" అన్న నారాయణ మూర్తిగారి గొంతు వినగానే, ఒక్కసారి ఉలిక్కిపడి వెనుతిరిగి చూసింది.

"ఇప్పుడు ఆ డోర్ ఎందుకు తీస్తున్నావు?"

ఆ అమ్మాయి రెండు చేతులు గట్టిగా పట్టుకుంటూ పెద్దగా గద్దిస్తూ అడిగారు.

“నన్ను ఆపకండి.. నన్ను వదిలేయండి!! నాకు బ్రతికి వుండే అర్హత లేదు. నేను చాలా పెద్ద తప్పు చేసాను. నా తల్లిదండ్రులకు నా ముఖం చూపించలేను!" అంటూ పెద్దగా ఏడుస్తూ రెండు చేతులతో ముఖం కప్పుకుని ఏడుస్తోంది.

కాసేపు ఆ అమ్మాయిని అక్కడే  ఏడవనిచ్చి, నెమ్మదిగా భుజం మీద చేయి వేసి సీటు దగ్గరకు తీసుకువచ్చి మంచి నీళ్లు తాగమని ఇచ్చారు.

అప్పటికీ చుట్టు పక్కల వాళ్ళందరూ గాఢ నిద్ర లోకి జారి పోయారు.

"ఇప్పుడు చెప్పమ్మా! ఎందుకు ఇంత సాహసం చేసావు? అంత ప్రాణాలు తీసుకోవలసిన అవసరం ఏమి వచ్చింది? కూర్చొని ఆలోచిస్తే ప్రతీ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.  అన్నింటికీ చావే పరిష్కారం కాదు!" అనునయంగా అన్నారు నారాయణ మూర్తి గారు.

“ప్రేమంటూ వెంటబడితే ఒకడిని గుడ్డిగా నమ్మి మోసపోయాను. ఇప్పుడు నేను గర్భంతో వున్నానని తెలిసి ముఖం చాటేస్తున్నాడు. దానికి కారణం నేనే అని, ఏమిటి నమ్మకం.. అంటూ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడు.  మనసా వాచా నమ్మినందుకు, అతన్ని మనస్పూర్తిగా ప్రేమించినందుకు, అతనిని నమ్మి సర్వస్వం అర్పించినందుకు నాకు ఈ తగిన శాస్తి జరిగింది!  ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని తల్లితండ్రులకు నా ముఖం చూపించను!  వాళ్ళ ఆర్ధిక పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే వుంది. అయినా కూడా నన్ను చదువుకోమని పంపిస్తే, నేను ఒళ్ళు కొవ్వు ఎక్కి ఈ పని చేసాను. నా వెనకాల ఇద్దరూ చెల్లెళ్ళు వున్నారు. వాళ్ళకి చదువులు చెప్పించాలి, పెళ్లి చేయాలి.  ఈ పరిస్థితుల్లో నేను ఇంటికి వెళితే వాళ్ళు తట్టుకోగలరా? నా సంగతి తెలిసి చెల్లెళ్ళకి పెళ్లి సంబంధాలు వస్తాయా? మా తల్లిదండ్రులు ఊరిలో తల ఎత్తి తిరగ గలుగుతారా? నేను చేసిన పనికి నా కుటుంబం అంతా బలి అవ్వవలసిందేనా? ఎంత అమాయకంగా నమ్మి మోసపోయాను.  ఈ పరిస్థితులలో చావు తప్ప నాకు వేరే దారేది?"  అంటూ ఆ అమ్మాయి కుమిలి కుమిలి ఏడుస్తోంది.

"అమ్మా! నువ్వు ఏం సంకోచించకుండా మా ఇంటికి రా!! అక్కడ కొంచెం స్తిమిత పడ్డాక, నీ సమస్య గురించి ఆలోచిద్దాం నువ్వు కంగారు పడకు…"

ఆ అమ్మాయికి భరోసా ఇచ్చి తన మీద నమ్మకం కలిగేలా మాట్లాడుతూ, నారాయణమూర్తిగారు ఆ అమ్మాయిని తీసుకుని ఇంటికి వచ్చారు.

భార్యకు పరిచయం చేసి "ఆ అమ్మాయిని స్నానం చేయమని చెప్పి, టిఫిన్ పెట్టు. పాపం నిన్నటి నుంచీ ఏమీ తిన్నట్టుగా లేదు …  ఇకపోతే ఆ అమ్మాయి విషయం నీకు వివరంగా తరువాత చెపుతాను!" అంటూ అక్కడ నుంచి తన రూములోకి వెళ్లి పోయారు.

ఆ అమ్మాయి స్నానం చేసి వచ్చాక టిఫిన్ పెట్టి, “కొద్ది సేపు పడుకుని లేమ్మా! కాస్త స్థిమిత పడ్డాక మాట్లాడుకుందాం!” అంటూ నారాయణమూర్తిగారి భార్య తలుపులు దగ్గరగా వేసి బయటకు వచ్చారు.

ఈలోగా నారాయణమూర్తిగారు భార్యకు విషయమంతా వివరించి చెప్పారు. భార్యాభర్తలిద్దరూ ఒక నిర్ణయానికి వచ్చారు.

రెండు రోజులు గడిచాయి. ఆ అమ్మాయికి కొంచెం అలవాటు అయింది. ఇక ఆలస్యం చేయకుండా, ఆమెతో తమ ఆలోచన చెప్పాలని నారాయణమూర్తి అనుకున్నారు.

ఆ రోజు వీలు చూసుకుని ఆమెతో అన్నారు.

"అమ్మా! మేము చెపుతున్నది చాలా జాగ్రత్తగా విను. నీకు ఇష్టమైతేనే ఆచరించు.. లేదా ఈ విషయం ఇంతటితో వదిలేద్దాం! నీకు ఇంకో దారి ఏమైనా వెతుకుతాము. నీకు ఇంకో మార్గం దొరికే వరకు మా ఇంట్లో వుండవచ్చు, మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. ఇంకా పై చదువులు చదువుకుంటానంటే చదువుకో! నేను చదివిస్తాను. నువ్వు మాత్రం మళ్లీ అలాంటి పిచ్చి పని చేయనని మాట ఇవ్వు...!”

నారాయణమూర్తి గారి మాటలు వింటూనే తల ఊపింది.

“మాకు ఒక్కడే అబ్బాయి. చూసావుగా! మేం ముగ్గురమే ఉంటాం. ఆర్థకపరమైన ఇబ్బందులు లేవు. అంచేత నిన్ను పోషించడం మాకు ఇబ్బందేం కాదు. అలాగే మీ తల్లిదండ్రులను కూడా జీవితాంతం నువ్వే చూసుకోవచ్చు! వాళ్ళు బ్రతకడానికి నెలకి ఇంతని పంపిస్తూ ఆర్థికంగా సహాయం చెయ్యి. మాకేమీ అభ్యంతరం లేదు. మీ చెల్లెళ్ళు ఇద్దరినీ బాగా చదివించు, వాళ్ళకి పెళ్లిళ్ళు చేయి! మేము ఎన్నాళ్ళు వుంటామో తెలియదు. ఇందులో మా స్వార్థం కూడా వుంది. మా తరువాత ఈ ఇంటి పరిస్థితి ఏమవుతుందో అనే భయం మాకు చాలా కాలం నుంచి ఉంది. నీకు అభ్యంతరం లేకపోతే, ఈ ఇంటి బాధ్యతలు నువ్వే తీసుకోవాలి. బహుశా మాకు ఆ భగవంతుడే నిన్ను మాకు చూపించాడు అనుకుంటాం... బాగా ఆలోచించుకుని ఒక నిర్ణయానికి రా! ఇందులో బలవంతం ఏమీలేదు. నువ్వు తీసుకున్న నిర్ణయం వలన రెండు కుటుంబాలు నిలబడతాయి..." అన్నారు కళ్ళు చెమ్మగిల్లుతుండగా ఆర్ద్రత నిండిన గొంతుతో..

ఆమెకు ఆలోచించడానికి ఎక్కువ సమయం పట్టలేదు.

"మీరు సూటిగా చెప్పకపోయినా నేను మీ హృదయాన్ని అర్థం చేసుకోగలను. అంతం కాబోయిన నా జీవితానికి కొత్త చిగురులు తెప్పించారు. లోకంలో తల ఎత్తుకుని తిరిగేలా జీవితాన్ని ఇస్తున్నారు. అంతకంటే ఎక్కువగా పుట్టబోయే నా బిడ్డకి తండ్రిని ఇస్తున్నారు. ఇంతకంటే ఏం కావాలి!” అంటూ ఆ గదిలో కూర్చుని, అమాయకంగా ఎటో దిక్కులు చూస్తున్న, నారాయణమూర్తి గారి అబ్బాయిని చెయ్యి పట్టుకుని వచ్చి, ఆ దంపతుల కాళ్ళకు నమస్కారం చేసింది!

అదేం తెలియని, ఆ అబ్బాయి .. కాదు కాదు ఆమె భర్త చిన్న పిల్లాడిలా ఆమె చెయ్యి పట్టుకునే, ఆమె అడుగులో అడుగు వేసుకుంటూ నడిచాడు!

***0***

పదో కథ .. ఓ చిన్న విన్నపం!

పదికథల సమాహారంలో ఓ ముత్యం ఈ నెల లేదని ఈ పాటికి మీరు గుర్తించే ఉంటారు. కారణం ఒక్కటే... "కథా మంజరి" కథలకో గుర్తింపూ, స్థాయీ వస్తున్న తరుణంలో, ఆ స్థాయిలో ఉన్న కథలు మాకు చేరకపోవడం. దీపావళీ కథల పోటీలో సాధరణ ప్రచురణకు స్వీకరించిన కథలతో పాటు, డిసెంబరు 15వ తారీఖు వరకూ అందిన కథలను వడపోత పట్టగా వచ్చిన కథలను ప్రచురించడానికి నిర్ణయం తీసుకున్నాం. వెరసి 'నవరత్నాలే' మీ ముందు ఉంచగలిగేం!

పదే పదే గుర్తు చేస్తున్న కథా మంజరి ఆలోచనలకి, ఆశయాలకి సాహితీ పరంగా చేయూత అందిస్తూ, మంచి కథలను అందించవలసినదిగా మరోసారి రచయిత(త్రి)లను అభ్యర్ధిస్తూ..

నమస్సులతో

సంపాదకుడు



# వినదగునెవ్వరు చెప్పిన ..

కథా మంజరి సంపాదకీయం చదివాక "కథాకీయం" నిర్వహణ ఎంత కష్టమో అర్ధమయింది. ముఖ్యంగా మీ తపన ..తెలుస్తోంది. పత్రిక సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. బొమ్మదేవర నాగకుమారి గారిని గూర్చి చదివాక, సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాను. ఆమె ఆదర్శనారిగా అనుపించారు. మరుగున పడిన మాణిక్యాలను మళ్ళీ వెలుగులోకి తెస్తున్నారు.

మీ కృషి బహు ప్రశంసనీయం

**దామరాజు విశాలాక్షి**

మీరు రాసిన కథాకీయం చదివాను. చాలా నచ్చింది మీరు తలపెట్టిన ఆలోచన మంచి కార్యరూపం దాల్చింది. కరోనా కాలంలో మంచి ఆలోచన చేసారు. ముఖ్యంగా కొత్త రచయితలకు అవకాశం కల్పిస్తున్నందుకు చాలా చాలా కృతజ్ఞతలు. ఒకేచోట పది కథలు దొరుకుతున్నాయి కథామంజరిలో చాలా బాగుంది. మీ , మన కథామంజరి ఇంకా ఇంకా పైకి ఎదగాలని ఆ భగవంతున్ని మనసారా వేడుకుంటున్నాను.

**B, లక్ష్మి శర్మ,**

లాలాపేట సికింద్రాబాద్

చిన్న మనవి

సంచిక, కథలపై

అభిప్రాయాలను, విమర్శలను, సలహాలను

కథా మంజరి కి పంపించండి.

info.kathamanjari.in కి మెయిల్ చేయండి.

మరి


పాఠకులకూ, రచయితలకూ మరొక్కసారి

# నూతన సంవత్సర

మరియు

# సంక్రాంతి

# శుభాకాంక్షలు



కథా మంజరి